ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం 10.06.2026 | సంపుటి : 12 సంచిక : 321 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

### ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాల సృష్టిపై
# 'సిట్' వేయండి



**తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్(జనంసాక్షి): ప్రభుత్వ భూములకు నకిలీపట్టాల సృష్టిపై సిట్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. ఖానామెట్ భూములకు నకిలీ పట్టాలు సృష్టించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ భూమి తనదంటూ పిటిషన్ దాఖలు చేసిన ఇట్టిగా ప్రాపర్టీస్‌కు రూ.5లక్షల జరిమానా విధించింది. నకిలీ పట్టాల మిగతా 2లో..

# పలకరించిన తొలకరి



## నైరుతి ప్రవేశంతో హైదరాబాద్‌లో భారీ వర్షం

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- విరిగిపడిన చెట్లు
- అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక

హైదరాబాద్(జనంసాక్షి): తొలకరి పలకరించింది. నైరుతి ప్రవేశంతో హైదరాబాద్ నగరంలో భారీ వర్షం కురిసింది. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ నగరంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. నగరంలో పలు చోట్ల ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలుల తీవ్రతకు రామ్‌నగర్‌లోని వీఎస్టీ మిగతా 2లో..



### మీనాక్షి నటరాజన్ నామినేషన్
# తిరస్కరణ

- అఫిడవిట్‌లో వివరాలు దాచారన్న కారణంతో చర్య
- నిన్న ఓట్ చోరీ.. నేడు సీట్ చోరీ: సీఎం రేవంత్ రెడ్డి
- ఈ విషయంపై న్యాయపోరాటం చేస్తామని వెల్లడి



భోపాల్,జూన్9(జనంసాక్షి): కాంగ్రెస్ పార్టీకి అనుకోని ఘటన ఎదురయ్యింది. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మధ్యప్రదేశ్ నుంచి ఆమె రాజ్యసభ ఎన్నికల కోసం నామినేషన్ వేయగా.. అది తిరస్కరణకు గురైంది. నామినేషన్ పత్రాలతో సమర్పించిన అఫిడవిట్‌లో ఒక పెండింగ్ కేసుకు సంబంధించిన మిగతా 2లో..

## ఉద్యోగుల జీతాలు ఆలస్యంపై క్రమశిక్షణా చర్యలు తప్పవు

**చెల్లింపులో అధికారుల జాప్యంపై మండిపడ్డ సీఎం రేవంత్**

2లో..

# రాష్ట్ర ఆర్థికప్రగతి మహిళల చేతుల్లో



## మహిళా సాధికారతకు మరో అడుగు • ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు పెద్దపీట

- వారిని కోటీశ్వరులను చేసే పనిలో వెనకడుగు లేదు - మహిళల స్ఫూర్తితోనే తమ ప్రజాపాలన సాగుతోంది
- వారి దెబ్బకే కొందరు ఫాంహౌజ్‌కు పరిమితమయ్యారు - కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు కూడా ఇవ్వలేదు
- బీజేపీలో కనీసం అధ్యక్ష పదవి ఇవ్వలేదు
- మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేసిన సీఎం రేవంత్



హైదరాబాద్,జూన్9(జనంసాక్షి): మహిళా సాధికారతకు తమ సర్కార్ మరో కీలక అడుగు వేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం.. మహిళా సంఘాలకు 553 ఆర్టీసీ బస్సులు పంపిణీ చేస్తున్నామని ఉద్ఘాటించారు. మహిళా శక్తి పథకం కింద 553 బస్సులు పంపిణీ చేశామని వ్యాఖ్యానించారు. మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ అని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో బస్సులను సీఎం మిగతా 2లో..

> "2034 వరకు మీ ఆశీర్వాదంతో ఈ ప్రభుత్వాన్ని నడిపిస్తాం. వెయ్యి కాదు 3 వేల ఆర్టీసీ బస్సులు తీసుకొస్తాం. ఇందిరమ్మ ఇల్లు ఆడబిడ్డల పేరు మీదే ఇచ్చాం. పట్టణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి మహిళల పేరుమీదే ఇస్తాం. మీకు ఎవరు అడ్డం వచ్చినా ఆర్టీసీ బస్సుతో తొక్కించండి. మహిళలను అభివృద్ధిలో సగం వ్యాపారంలో సగం చేశాం. రిలయన్స్‌తో పోటీ పడి పెట్రోల్ బంక్‌లను మా ఆడబిడ్డలు నడిపిస్తున్నారు. అంబానీ, అదానీతో పోటీ పడి మా ఆడబిడ్డలు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు. కోటి మంది అడబిడ్డలను కోటీశ్వరులను చేయాలని ఈ ప్రభుత్వం కంకణం కట్టుకుంది" - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## పేదల ఆశలు నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం

### పదేళ్ల బీఆర్ఎస్‌లో అభివృద్ధి శూన్యం : మంత్రి పొంగులేటి

భద్రాద్రి కొత్తగూడెర్(జనంసాక్షి): గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ప్రజలకు చేసిందేమీ లేదని, ప్రస్తుత రేవంత్ రెడ్డి ప్రభుత్వం పేదవాడి ఆశలను నెరవేర్చే దిశగా అడుగులు వేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో పలు అభివృద్ధి పనులను ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, ఎమ్మెల్యే మిగతా 2లో..





### గ్రేట్ నికోబార్ ఎయిర్‌పోర్ట్‌కు
# కేంద్రం అనుమతి

**మలక్కా జలసంధికి అతిసమీపంలో జీఎన్ఐ ప్రాజెక్టు**

న్యూఢిల్లీ(జనంసాక్షి): గ్రేట్ నికోబార్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం అనుమతులు ఇచ్చింది. రూ.13వేల కోట్లతో పౌర-సైనిక విమానాశ్రయాన్ని నిర్మించనుంది. ఐఎన్ఎస్ బాజ్ వద్ద ఇప్పటికే ఉన్న నావికాదళ మిగతా 9లో..



## బాసరలో విషాదం

- గోదావరిలో స్నానానికి దిగి ముగ్గురు గల్లంతు
- మృతులు హైదరాబాద్‌కు చెందిన అన్నదమ్ములుగా గుర్తింపు


## దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికుల దుర్మరణం**



### 36వ అంతస్తు నుంచి పడి
## ముగ్గురి మృతి

- లండన్‌లో విషాదకర ఘటన
- మృతులు భారత సంతతికి చెందిన వ్యక్తులుగా గుర్తింపు



వివరాలు లోపలి పేజీల్లో..

### దేశానికే రోల్ మోడల్‌గా
# తెలంగాణ

- తీర్చిదిద్దేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నాం
- స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామికవృద్ధికి ప్రాధాన్యం
- పారిశ్రామికవేత్తలు రాష్ట్ర ప్రగతిలో కీలక భాగస్వాములు
- ఎఫ్‌టీసీసీఐ ఎక్సలెన్స్ అవార్డ్స్ ప్రదానోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్(జనంసాక్షి):భావితరాల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను దేశంలోని ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా తీర్చిదిద్దేలా ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. భవిష్యత్తు కోసం ఎదురు చూడకుండా, దాన్ని నిర్మించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్(ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో మిగతా 2లో..




# ధాన్యం సేకరణలో తెలంగాణ రికార్డు

- 8 లక్షల మెట్రిక్ టన్నుల మొక్క జొన్న కొనుగోలు
- హమాలీల కొరత కూడా సేకరణలో అడ్డంకి
- ధాన్యం సేకరణలో ప్రతిపక్షాల విమర్శలు అర్థరహితం
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి బాధ్యతారహితంగా విమర్శలు
- మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టకుపోతాయన్న ఎన్‌డీఎస్‌ఏ
- మీడియా సమావేశంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి





**కొనుగోళ్లపై కేంద్రం అనవసర కొర్రీలు**

**ఈ విషయమై మరోసారి కేంద్రానికి లేఖ రాస్తా**

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలోని వడ్లకు ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ లేదని పౌరసరఫరాలు, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అందుకే ఈ వడ్లను కేంద్రం కొనుగోలు చేయడానికి సుముఖంగా లేదన్నారు. మంగళవారం హైదరాబాద్ సచివాలయంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో పండించిన 75 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లు కొనుగోలు చేయాలని మరోసారి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషికి లేఖ రాస్తానని ఆయన స్పష్టం చేశారు.ఇంకా రెండు లక్షల మెట్రిక్ టన్నుల ప్రోక్యూర్‌మెంట్ వచ్చే అవకాశం ఉందన్నారు. నాగర్ కర్నూల్ జిల్లాలో ఇంకా పంట సాగవుతుందని చెప్పారు. ప్రతిపక్షాలు చెప్పేవన్నీ అబద్దాలేనని పేర్కొన్నారు. పౌర సరఫరాల శాఖ కార్యాలయం నుంచి నేరుగా ఆన్‌లైన్‌లో రైతులు, మహిళా సంఘాల అకౌంట్‌లో నగదు వేస్తున్నామని చెప్పారు. మహిళ సంఘాలకు కేంద్ర ప్రభుత్వం నిధుల నుంచి రూ.170 కోట్లు చెల్లించామని వివరించారు.8 లక్షల మేట్రిక్ టన్నుల మొక్క జొన్న కూడా కొనుగోలు చేశామని తెలిపారు. క్వింటాకు రూ.1000 నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం భరించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా ఇంత బాధ్యతగా కొనుగోలు మిగతా 2లో..

### హెచ్1 బీ వీసాకు లక్ష డాలర్ల ఫీజు
# చట్టవిరుద్ధం



## ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదనను కొట్టివేసిన అమెరికా ఫెడరల్ న్యాయస్థానం

**ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదనను కొట్టివేసిన అమెరికా ఫెడరల్ న్యాయస్థానం**

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు షాక్ తగిలింది. హెచ్1బీ వీసాల కోసం ట్రంప్ ప్రభుత్వం ప్రతిపాదించిన లక్ష డాలర్ల సుమారు రూ. 85 లక్షలకు పైగా భారీ ఫీజును అమెరికా ఫెడరల్ న్యాయస్థానం కొట్టేసింది. ట్రంప్ తీసుకున్న ఈ నిర్ణయం పూర్తిగా చట్ట విరుద్ధమని బోస్టన్‌లోని యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరొకిన్ సోమవారం తీర్పు వెలువరించారు. విదేశాల్లో ఉంటూ అమెరికా తాత్కాలిక వలస వీసా హెచ్1బీకి ఎంపికైన వారు ఈ భారీ మొత్తాన్ని చెల్లించాలని గత సెప్టెంబరులో




ట్రంప్ ప్రభుత్వం నిబంధన తీసుకురాగా.. దీనిని సవాలు చేస్తూ అమెరికాలోని 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ బోస్టన్ కోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన జడ్జి, అమెరికా కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు నేరుగా ఇలాంటి పన్నులపై నిర్ణయం తీసుకోలేరని స్పష్టం చేశారు. ఈ భారీ వసూలు పెనాల్టీ కాదని, చట్ట విరుద్ధమైన పన్ను అని ప్రకటిస్తూ ఆ నిబంధన చెల్లదని కొట్టిపారేశారు. కోర్టు తీసుకున్న ఈ నిర్ణయంతో ఐటీ సహా పలు రంగాలకు చెందిన వేలాది మంది విదేశీ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ టెక్కీలకు పెద్ద ఊరట లభించింది.

### కాంగోలో అంతకంతకూ
# విస్తరిస్తున్న ఎబోలా

**ఇప్పటికే 101 మంది మృత్యువాత**

న్యూఢిల్లీ(జనంసాక్షి):మధ్య ఆఫ్రికా దేశం కాంగోలో ఎబోలా వైరస్ విజృంభిస్తోంది. ఈ వైరస్ కారణంగా ఇక్కడ ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం ఆందోళనను రేకెత్తిస్తోంది. ఈ మేరకు కాంగో ఆరోగ్య అధికారులు ఓ ప్రకటనను విడుదల చేశారు. ఆ ప్రకటన ప్రకారం.. కాంగోలో ఇప్పటివరకు 550కి పైగా ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. వారిలో 101 మంది ప్రాణాలు కోల్పోగా.. మిగతా 9లో..




## మా దాడులతో ఇరాన్ సైన్యం పూర్తిగా నాశనమైంది

- ప్రస్తుతం టెహ్రాన్ వద్ద క్షిపణి సామర్థ్యం 21 శాతానికి మాత్రమే పరిమితమైంది
- మళ్లీ దాడులు ప్రారంభిస్తే ఎదుర్కోవడానికీ సిద్ధంగా ఉన్నాం
- ట్రంప్ హెచ్చరిక
- హర్మూజ్ వద్ద కూలిన అమెరికా అపాచీ హెలికాప్టర్

### భారతీయులున్న నౌకపై
## మేమే దాడి చేశాం



- ఇరాన్ పోర్టుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో అడ్డుకున్నాం
- ప్రకటించిన అమెరికా

2లో..

## మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ

వివరాలను పూర్తిగా వెల్లడించలేదనే కారణంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. నామినేషన్ల పరిశీలన సమయంలో బీజేపీ నాయకులు రిటర్నింగ్ అధికారికి అభ్యంతరం తెలిపారు. పెండింగ్‌లో ఉన్న ఒక కోర్టు కేసు వివరాలను మీనాక్షి నటరాజన్ తన అఫిడవిట్‌లో పేర్కొనలేదని బీజేపీ ఆరోపించింది. ఈ అభ్యంతరాన్ని పరిశీలించిన అనంతరం నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. మీనాక్షి నటరాజన్ గతంలో లోక్‌సభ సభ్యురాలిగా పనిచేశారు. ప్రస్తుతం కాంగ్రెస్‌లో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో రాజ్యసభ ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే ఉద్రిక్తతలు నెలకొన్నాయి. కాంగ్రెస్ తమ ఎమ్మెల్యేలను కర్ణాటకకు తరలించి క్రాస్ ఓటింగ్‌ను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఇక, మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ నిర్ణయాన్ని కాంగ్రెస్ సవాలు చేస్తుందా? లేదా ప్రత్యామ్నాయ వ్యూహంతో ముందుకు వెళ్తుందా? అన్నది ఆసక్తికరంగా మారింది. ఇదిలావుంటే మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను మధ్యప్రదేశ్ ఎన్నికల అధికారి తిరస్కరించడంపై ఆ పార్టీ స్పందించింది. బుధవారం కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించడం ప్రజాస్వామ్య ప్రక్రియను దెబ్బతీయడానికి బీజేపీ చేసిన బహిరంగ ప్రయత్నమని ఆయన అభివర్ణించారు. ఆమె నామినేషన్‌లో ఏదైనా తప్పు లేదా వివరాలను వెల్లడించలేదనే ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవి, అవాస్తవమైనవని పేర్కొన్నారు. ఇది కాంగ్రెస్ పార్టీకి దక్కాల్సిన స్థానాన్ని లాక్కోవడానికి చేసిన నిరాశాజనకమైన ప్రయత్నం మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభపెట్టి తమ వైపు తిప్పుకునే బీజేపీ కుట్రలు విఫలమవుతున్నాయని గ్రహించిన తర్వాత, వారు ఇంత దిగజారిపోయి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని వివరించారు. ఇది రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై బీజేపీకి ఉన్న నిబద్ధత ఎంత బూటకమో మరోసారి నిరూపిస్తోందని తెలిపారు. ప్రతి దశలోనూ బీజేపీ ఏదో ఒక రూపంలో ఓట్ల చోరీ చేయడానికే ప్రయత్నిస్తుందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని పట్టపగలు దోచుకునే ఈ చర్యను తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సహించమని కరాకండిగా చెప్పారు. దీనిపై న్యాయపరంగా, రాజకీయంగా, ప్రజల మధ్యన గట్టిగా పోరాడుతామని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కె.సి. వేణుగోపాల్ అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణను రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. మధ్యప్రదేశ్‌లో మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించడం బీజేపీ కుట్ర అని ఆరోపించారు. 'ఓట్ చోరీ', 'ఎస్ఐఆర్' తర్వాత, ఇప్పుడు బీజేపీ 'సీట్ చోరీ'కి పాల్పడుతోందని ధ్వజమెత్తారు. తెలంగాణలో మీనాక్షి నటరాజన్‌పై ఎలాంటి క్రిమినల్ కేసులు లేవని స్పష్టం చేశారు. ఈమేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి పోస్టు పెట్టారు. జైరాం రమేశ్ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకత్వం ఎన్నికల కమిషన్‌ను కలిసేందుకు వెళ్లే ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. బీజేపీ గెలవలేక కుట్ర చేసి మీనాక్షి నటరాజన్ నామినేషన్‌ను తిరస్కరించారని ఆగ్రహించారు. ఇది ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఇలా చేయడం ప్రజల గొంతులను అణచివేయడమే నని చెప్పుకొచ్చారు. ప్రజాస్వామ్యానికి ఇది ఒక చీకటి రోజు అని వ్యాఖ్యానించారు. ఈ విషయాన్ని పౌరులందరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని? న్యాయం జరిగే వరకు పోరాడుతామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

## పలకరించిన 'తొలకరి'

రోడ్డులో భారీ వృక్షం నేలకొరిగింది. అలాగే, హైదర్‌గూడలోనూ ఓ భారీ వృక్షం నేలకొరగడంతో ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. పలుచోట్ల రహదారులపై వర్షం నీరు చేరింది. ముషీరాబాద్‌లో ఈదురుగాలులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. భాగ్యనగరంలో భారీ వర్షం కురుస్తోండటంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. సిటీలోని పలు ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడుతోండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై భారీగా వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముఖ్యంగా లోతట్టు కాలనీలు, ప్రధాన రహదారులు, కూడళ్లలో నీరు చేరడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పంజాగుట్ట, ఖైరతాబాద్, బంజారాహిల్స్, యూసఫ్‌గూడ, టోలీచౌకి, ఫిలింనగర్, అమీర్‌పేట్, ఎస్సార్‌నగర్, ఎర్రగడ్డ, సనత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. పలు ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా సాగుతుండగా, కొన్ని చోట్ల ట్రాఫిక్ జాం అయింది. కార్యాలయాలు, విద్యాసంస్థల నుంచి ఇళ్లకు వెళ్లే ప్రజలు వర్షం కారణంగా ఇబ్బందులు పడ్డారు. భారీ వర్షాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ సిబ్బంది అప్రమత్తమయ్యారు. నీరు నిలిచిన ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతూ పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని, వర్షపు నీరు నిలిచిన ప్రాంతాల్లో జాగ్రత్తగా ప్రయాణించాలని అధికారులు సూచిస్తున్నారు. వాతావరణ శాఖ అధికారులు మరికొన్ని గంటల పాటు నగరంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్ స్తంభాలు, చెట్లు, నీటితో నిండిన ప్రాంతాల వద్ద జాగ్రత్తలు పాటించాలని సూచించారు. భారీ వర్షాల ప్రభావంతో నగరంలోని పలు లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. తెలంగాణలో బుధవారం కూడా పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో నేడు అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. గంటకు 40 నుంచి 50కి.మీ వేగంతో ఈదురుగాలులతో వర్షాలు పడొచ్చని పేర్కొంది. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ, రంగారెడ్డి, హైదరాబాద్, మెదక్ జిల్లాలకు మోస్తరు వర్ష సూచన ఉన్నట్లు తెలిపిన వాతావరణ శాఖ అధికారులు.. కామారెడ్డిలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే, బుధవారం వికారాబాద్, మహబూబ్‌నగర్, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.



**సౌతర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
**6-1-50,కార్పొరేట్ ఆఫీస్, మింట్ కాంపౌండ్, హైదరాబాద్ - 500063**

షార్ట్‌టెండర్ నోటీసు

NIT NO. 2023-24 తేది: 17.20.2019

**టెండర్ నోటీస్ నం: 03/2026-27 ఆఫ్ ఎస్ఈ/సివిల్/కార్పొరేట్ ఆఫీస్/మింట్ కాంపౌండ్/హైదరాబాద్ తేది: 08.06.26**

క్రింది పనులకు దిగువసంతకందారు టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

**1.టెండర్ స్పెసిఫికేషన్ నం.03/2026-27:** హైదరాబాద్ ఎర్రగడ్డలోని జీటీఎస్ కాలనీ బ్లాక్-2లోని డైరెక్టర్ క్వార్టర్స్‌లోని రెండవ అంతస్థులో 2 స్ప్లిట్ ఏసీలు, ఇతర పనులు చేయుట.

**2.టెండర్ స్పెసిఫికేషన్ నం.04/2026-27:** ఏప్రిల్ 2026 నుండి మార్చి 2027ఆర్థికసంవత్సరానికి హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో టీజీఎస్‌పీడీసీఎల్, కార్పొరేట్ ఆఫీస్‌లోని ఏ- బ్లాక్‌లోని ఆర్వో ప్లాంట్ నుండి కార్పొరేట్ ఆఫీస్ పరిసరాలలోని అన్ని బ్లాకులకు, కొన్ని ఇతర ప్రదేశాలకు మినరల్ వాటర్ సరఫరా, మరియు అన్ని వాటర్ ట్యాంకుల నిర్వహణ చేయుట.

**3.టెండర్ స్పెసిఫికేషన్ నం.05/2026-27:** ఏప్రిల్ 2026 నుండి మార్చి 2027ఆర్థికసంవత్సరానికి హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో టీజీఎస్‌పీడీసీఎల్, కార్పొరేట్ ఆఫీస్‌లోని అన్ని బ్లాకులలోని ఏసీలకు వార్షిక మరమ్మతులు నిర్వహించుట.(ఎస్‌సీ కులాలకు రిజర్వుచేయబడినది)

**టెండర్ స్పెసిఫికేషన్ నం.05/2026-27:** హైదరాబాద్ ఎర్రగడ్డ జీటీఎస్‌కాలనీలోని టీజీఎస్‌పీడీసీఎల్, సీజీఆర్ ఎఫ్-1(రూరల్)మరియు సీపీటీఐలోని డైరెక్టర్ క్వార్టర్స్‌లో ఎలక్ట్రికల్ పనులు చేయుట.

పూర్తి వివరాలకు, అర్హతకు సంబంధించిన మరియు మిగతా నిబంధనలు మొదలగునవి www.tgsouhtherpower.com వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. మిగతా వివరాలకు ఎస్ఈ/సివిల్/కార్పొరేట్ ఆఫీస్/టీజీఎస్‌పీ డీసీఎల్/హైదరాబాద్‌ను సంప్రదించగలరు. టెండరు జారీచేయు చివరి తేది: 18.06.2026 మరియు టెండరు తెరచు తేది: 19.06.2026. ఫోన్: 87124681816, ఫ్యాక్స్: 23431006

DIPR No.3933-PP/CL/ADVT/2026-27

**సం/- సూపరింటెండింగ్ ఇంజినీర్**
**సివిల్/టీజీఎస్‌పీడీసీఎల్**

# రాష్ట్ర ఆర్థిక ప్రగతి మహిళల చేతుల్లో



ప్రారంభించి ప్రసంగించారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతిని అందించింది కాంగ్రెస్సేనని సీఎం రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. బీజేపీ అధ్యక్ష పదవిని ఒక్కసారైనా మహిళకు ఇచ్చారా అని ప్రశ్నించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని పేర్కొన్నారు. కేసీఆర్ హయాంలోని తొలి ఐదేళ్లలో ఒక్క మహిళకైనా మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ప్రభుత్వంలో ఇద్దరు మహిళలకు మంత్రి పదవులు ఇచ్చామని ప్రస్తావించారు. మహిళలను స్ఫూర్తిగా తీసుకుని పరిపాలన చేస్తున్నామని వివరించారు. మహిళలను పరిపాలనలో భాగస్వామ్యం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పుకొచ్చారు. మహిళా సంఘాల్లో 67 లక్షల మంది ఆడబిడ్డలు ఉన్నారని తెలిపారు. ఆడబిడ్డలతో పెట్టుకుంటే అధికారంలో ఉంటారా? అని ప్రశ్నించారు. తమ అక్కలు పెట్టిన వాతలతోనే కొందరు ఫామ్‌హౌస్‌లో పండుకున్నారని విమర్శించారు. ఉచిత బస్సుతో స్కూళ్లలో ఆడపిల్లల డ్రాపౌట్స్ తగ్గాయని అన్నారు. ఉచిత బస్సు పథకం కోసం రూ.10 వేల కోట్లు ఖర్చు చేశామని తెలిపారు. కడుపు నిండా విషం పెట్టుకుని ఉచిత బస్సు పథకం ఆపాలని కొంతమంది చూశారని ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లను రెచ్చగొట్టి రోడ్డుపైకి పంపారని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు. 27 వేల స్కూళ్ల నిర్వహణ బాధ్యత కూడా ఆడబిడ్డలకు అప్పగించామని తెలిపారు. మిడ్ డే మీల్ పథకం సరుకులు కూడా మహిళలే సరఫరా చేస్తున్నారని వెల్లడించారు. పెట్రోల్ బంకుల నిర్వహణ అప్పగించడంతో లక్షలు సంపాదిస్తున్నారని చెప్పుకొచ్చారు. 8 వేల స్త్రీ శక్తి భవనాలు ఒకేసారి పూర్తిచేస్తామని అన్నారు. కార్పొరేట్ ఆఫీస్‌ల కంటే మిన్నగా స్త్రీ శక్తి భవనాలు ఉంటాయని వివరించారు. హైటెక్ సిటీ దగ్గర మహిళలకు రూ.1000 కోట్ల భూమి కేటాయించామని ప్రస్తావించారు. 106 స్టాల్స్‌తో అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో మాల్ నిర్మించామని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులుగా మారుస్తామని సీఎం రేవంత్‌రెడ్డి పునరుద్ఘాటించారు. దళారులు, దోపిడీదారులకు తమ ప్రభుత్వంలో చోటులేదని స్పష్టం చేశారు. 2034 వరకు ప్రజాప్రభుత్వం కొనసాగుతుందని ధీమా వ్యక్తం చేశారు. ఆడబిడ్డలకు అండగా ఉండే బాధ్యత తమదని తెలిపారు. ఎవరెన్ని కుట్రలు చేసినా మహిళా సంఘాలను ఆదుకుంటున్నామని చెప్పుకొచ్చారు. రూ.60 వేల కోట్ల రుణాలతో ఆర్థికంగా నిలబెడుతున్నామని తెలిపారు. ఆడబిడ్డలు సంతోషంగా ఉండాలని మంచి చీరలు ఇస్తున్నామని వివరించారు. కేసీఆర్ హయాంలో ఇచ్చిన చీరలను ఎవరైనా కట్టుకున్నారా? అని ప్రశ్నించారు. ఆడబిడ్డల సంక్షేమానికి అన్నివేళలా కృషిచేస్తామని తెలిపారు. పంట మార్పిడి విషయంలో మహిళలు చొరవ చూపాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే మహిళలకు గుర్తింపు ఉంటుంది. మహిళలకు ఇవ్వాల్సిన రూ.4వేల కోట్ల సున్నా వడ్డీ నగదును గత ప్రభుత్వం చెల్లించలేదు. మహిళలతో పెట్టుకున్న ఎవరైనా అధికారంలో ఉంటారా? మహిళలతో పెట్టుకున్నందుకే బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయింది. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం ఆర్టీసీకి రూ.10,500 కోట్లు చెల్లించాం' అన్నారు. అందరికంటే ముందుంటామని మహిళలు నిరూపిస్తున్నారు. వ్యవసాయానికి ప్రాణవాయువు ఆడబిడ్డలు. ఆడబిడ్డ పుడితే.. మహాలక్ష్మి వచ్చిందని సంతోషపడే సంస్కృతి మనది. మన సంస్కృతి, సంప్రదాయాల్లో మహిళలకు ప్రత్యేక గుర్తింపు ఉంది. మహిళా శక్తిని ప్రపంచానికి చాటి చెప్పిన ఘనత ఇందిరాగాంధీకి దక్కుతుంది. మహిళలను స్ఫూర్తిగా తీసుకొని మేం పరిపాలన చేస్తున్నాం. అమెరికాలో మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు వందల ఏళ్లు పట్టింది. భారత్‌కు స్వాతంత్ర్యం రాగానే మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన ఘనత నెహ్రూకే దక్కుతుందని రేవంత్ అన్నారు. స్థానిక ఎన్నికల్లో మహిళలకు రాజీవ్‌గాంధీ రిజర్వేషన్లు ఇచ్చారు. సోనియా గాంధీ 2013లో చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు ఇవ్వాలని బిల్లు ప్రవేశపెట్టారు. అంబానీ, ఆదానీలకు పోటీగా పెట్రోల్ బంకులు, సోలార్ విద్యుత్‌ను రాష్ట్ర మహిళలు నిర్వహిస్తున్నారు. త్వరలోనే మహిళా శక్తి భవనాలు నిర్మిస్తామని అన్నారు.

## పేదల ఆశలు నెరవేరుస్తున్న ప్రజా ప్రభుత్వం

జారే ఆదినారాయణ , జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతును రాజును చేయాలనే లక్ష్యంతో ఇప్పటికే 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశామని, రేషన్ కార్డులు, సన్నబియ్యం, ఉచిత విద్యుత్ , డైట్ ఛార్జీల పెంపు వంటి నిర్ణయాలతో ప్రభుత్వం పేదలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. పేదవాడి ఆత్మగౌరవం కోసం రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశామని, అందులో కేవలం అశ్వారావుపేట నియోజకవర్గానికే నాలుగు వేల ఇళ్లు కేటాయించినట్లు మంత్రి వెల్లడించారు. చివరి పేదవాడి వరకూ లబ్ది చేకూరుస్తామని చెప్తూ, భూమి లేని పేద ఆడబిడ్డల కోసం ఐదెకరాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. నాడు కేవలం పింక్ కలర్ పార్టీ వారికి మాత్రమే అందిన లబ్ది, నేడు ప్రతి పేదవాడికి చేరుతోందని విమర్శించారు. విద్యా వ్యవస్థలో మార్పుల గురించి ప్రస్తావిస్తూ అశ్వారావుపేటలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఇక్కడ కులమతాలకు, పేద ధనిక తారతమ్యం లేకుండా సుమారు 2300 మంది విద్యార్థులు చదువుకుంటారని చెప్పారు. దీనితో పాటు త్వరలోనే ఇక్కడ అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్‌ను కూడా తీసుకురానున్నట్లు ప్రకటించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అశ్వారావుపేటకు వంద పడకల ఆసుపత్రిని, నర్సింగ్ కాలేజీని మంజూరు చేసినట్లు మంత్రి గుర్తుచేశారు.

## ఉద్యోగుల జీతాలు ఆలస్యంపై క్రమశిక్షణా చర్యలు తప్పవు

**చెల్లింపులో అధికారుల జాప్యంపై మండిపడ్డ సీఎం రేవంత్**

హైదరాబాద్(జనంసాక్షి):రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపులో జాప్యంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జీతాల ఆలస్యానికి బాధ్యులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. సీఎం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జీతాల చెల్లింపుపై ఆర్థిక శాఖ కీలక సర్క్యులర్ జారీ చేసింది. రెగ్యులర్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్, హానరేరియం ఉద్యోగులందరికీ 1వ తేదీన వేతనాలు వేస్తున్నట్లు స్పష్టం చేశారు. ఆలస్యమైతే హెడ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్, డీడీఓలదే బాధ్యతని తెలిపారు. ప్రతి నెల 25వ తేదీలోపు జీతాల బిల్లులు ట్రెజరీకి సమర్పించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలాఖరులోపు బిల్లుల స్క్రూటినీ, ఆడిట్, అథరైజేషన్ పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి హుకుం జారీ చేశారు. బ్జడెట్ కొరత లేదా సాంకేతిక సమస్యలు ఉంటే ముందుగానే ఫైనాన్స్ శాఖకు తెలియజేయాలని సూచించారు. జీతాల చెల్లింపులో పరిపాలనా నిర్లక్ష్యాన్ని తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. అన్నిశాఖలు, కార్పొరేషన్లు, విశ్వవిద్యాలయాలు, సొసైటీలు ఉత్తర్వులు ఖచ్చితంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఉద్యోగికి ప్రతి నెల 1వ తేదీన జీతం చేరేలా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ మేరకు ఫైనాన్స్ శాఖ కార్యదర్శి డా. గౌరవ్ ఉప్పల్‌కు సమన్వయ బాధ్యతలను సీఎం రేవంత్‌రెడ్డి అప్పగించారు.

## దేశానికే రోల్ మోడల్‌గా తెలంగాణ

మంగళవారం జూబ్లీహిల్స్ లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్ లో నిర్వహించిన 'ఎఫ్ టీసీసీఐ ఎక్స్ లెన్స్ అవార్డ్స్ 2026' ప్రదానోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఐటీ, లైఫ్ సైన్సెస్ నుంచి మ్యానుఫ్యాక్చరింగ్, డీప్-టెక్ వరకు తెలంగాణను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన వృద్ధి కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. పరిశ్రమ 4.0 విప్లవంలో భాగంగా దూసుకొస్తున్న ఆటోమేషన్, డీప్-టెక్ సవాళ్లను ఎదుర్కొనేలా రాష్ట్రంలో కాంప్రహెన్సివ్ ఎకోసిస్టమ్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. అదే సమయంలో... భవిష్యత్తు తరాలకు మేలు జరిగేలా స్థిరమైన, పర్యావరణహిత పారిశ్రామిక వృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. రాబోయే రోజుల్లో పారిశ్రామికాభివృద్ధి అనేది కేవలం భూమి, మూలధనంపైనే కాకుండా... మేధో సంపత్తి, నాలెడ్జ్ ఎకానమీ ఆధారంగానే సాధ్యమవుతుందన్నారు. అందుకు... పరిశ్రమల అవసరాలకు, విద్యాసంస్థల శిక్షణకు మధ్య ఉన్న స్కిల్ గ్యాప్ ను పూడ్చాల్సిన అవసరముందన్నారు. ఆ దిశగానే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణను స్కిల్ క్యాపిటల్ గా మార్చాలనే సంకల్పంతో 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ'కి శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులను తీసుకొచ్చి... ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతోనే ముందుకెళ్తున్నామన్నారు. పారిశ్రామికాభివృద్ధిని కేవలం హైదరాబాద్ కే పరిమితం చేయ కుండా... రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నామన్నారు.

## దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

**తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికుల దుర్మరణం**

హైదరాబాద్(జనంసాక్షి):దుబాయ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మినీ బస్సు, ట్రక్కు ఢీ కొన్న ఘటనలో తెలంగాణకు చెందిన ముగ్గురు కార్మికులతో పాటు మరో నలుగురు దుర్మరణం చెందారు. వివరాల్లోకి వెళ్తే..దుబాయ్‌లోని అత్యంత రద్దీగా ఉండే ఎమిరేట్స్ రోడ్డుపై సోమవారం వేగంగా వస్తున్న మినీబస్సు ట్రక్కును ఢీకొనడంతో ఏడుగురు మృతి చెందగా ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను పోలీసులు హాస్పిటల్‌కు తరలించారు. మృతులను జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి మండలానికి చెందిన అబ్దుల్ రఫీక్, కొడిమ్యాల మండలానికి చెందిన సయ్యద్ సలీం, మల్యాల మండలానికి చెందిన గజుల తిరుపతిగా గుర్తించారు. గాయపడిన వారిలో హైదరాబాద్ నగరానికి చెందిన మహమ్మద్ సయీద్ కూడా ఉన్నాడు. .

## 36వ అంతస్తు నుంచి పడి ముగ్గురి మృతి

లండన్(జనంసాక్షి):లండన్‌లో విషాదకర ఘటన చోటుచేసుకుంది. ఓ బహుళ అంతస్తుల భవనం బాల్కనీ నుంచి పడి ఒకే కుటుంబంలోని ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. వీరిని భారత సంతతికి చెందిన వ్యక్తులుగా గుర్తించారు. మే 27న ఈ ఘటన చోటుచేసుకోగా.. తాజాగా స్థానిక మీడియా కథనంతో వివరాలు బయటకు వచ్చాయి.ముంబయికి చెందిన రాకేశ్ పాయ్ (47), అదితి పరాల్కర్ దంపతులకు తొమ్మిదేళ్ల కుమారుడు (సిద్) ఉన్నాడు. ఇరవై ఏళ్ల క్రితమే వీరు లండన్‌కు వెళ్లి స్థిరపడ్డారు. వేర్వేరు రంగాల్లో కన్సల్టెంట్‌లుగా పనిచేస్తున్న ఈ దంపతులు.. దక్షిణ లండన్‌లోని ఎలిఫెంట్ అండ్ క్యాజిల్‌లోని హైపాయింట్ టవర్‌లో (36వ ఫ్లోర్‌లో) నివసిస్తున్నారు. అయితే, వీరి కుమారుడు సిద్‌కు చిన్నప్పటి నుంచే శారీరక వైకల్యంతో పాటు మాటలు సరిగా రాకపోవడం, మూత్రపిండాల సమస్య ఉన్నట్లు తెలిసింది. ఆరేళ్ల క్రితం భారత్‌కు వచ్చిన రాకేశ్ దంపతులు.. కొన్నేళ్లపాటు సిద్‌కు ఇక్కడే చికిత్స చేయించారు. అయినప్పటికీ అతడి పరిస్థితిలో పురోగతి కనిపించక పోవడంతో కుమారుడిని తీసుకొని గతేడాది తిరిగి లండన్‌కు వెళ్లిపోయారు. ఈ క్రమంలో మే 27న ఉదయం ఏడున్నర ప్రాంతంలో వారు ఉంటున్న అపార్ట్‌మెంట్ నుంచి ముగ్గురూ కిందపడిపోయారు. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వచ్చి పరీక్షించిన రెస్క్యూ టీమ్.. దంపతులు సహా సిద్ ప్రాణాలు కోల్పోయినట్లు నిర్ధరించారు. ఈ విషాదానికి దారితీసిన పరిస్థితులపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

## ప్రభుత్వ భూములకు నకిలీ పట్టాల సృష్టిపై సిట్ వేయండి

వ్యవహారంలో రెవెన్యూ అధికారుల పాత్రపైనా సీఐడీ దర్యాప్తునకు ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఈ వ్యవహారంపై ఐపీఎస్ అధికారి నేతృత్వంలో సిట్ ఏర్పాటు చేయాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. నాలుగు వారాల్లోగా నివేదిక సమర్పించాలని జస్టిస్ నగేశ్ భీమపాక ఆదేశాలు ఇచ్చారు. గతంలో టీజీఐఐసీ ఇచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ ఇట్టిగా ప్రాపర్టీస్ అనే సంస్థ హైకోర్టులో సవాల్ చేసింది.





# ధాన్యం సేకరణలో తెలంగాణ రికార్డు

చేయలేదని చెప్పారు. భవిష్యత్తులో పాడి ప్రొక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలని దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని వివరించారు. రాష్ట్రంలో హమాలీల సమస్య అధికంగా ఉందన్నారు.తెలంగాణలో ప్రస్తుతం ఉన్న స్టోరేజ్ సరిపోవడం లేదన్నారు. బుధవారం మేడిగడ్డలో మూడు బ్యారేజీల టెస్టింగ్ ప్రక్రియపై సమీక్ష చేస్తామని చెప్పారు. ఈ మూడు బ్యారేజిల్లో నీళ్లు నింపొద్దని ఇప్పటికే నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్‌డీఎస్ఏ చెప్పిందని గుర్తు చేశారు. మేడిగడ్డలో నీళ్లు నింపితే కొట్టుకుపోతాయని ఎన్‌డీఎస్ఏ స్పష్టం చేసిందన్నారు. దేశంలోనే రికార్డ్ స్థాయిలో తెలంగాణలో ధాన్యం కొనుగోళ్లు చేశామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెంగాణలో ఎక్కువ ధాన్యం ఉత్పత్తి అయ్యిందని.. యాసంగిలో రికార్డ్ స్థాయిలో ధాన్యం కొన్నామని చెప్పారు. రబీ, ఖరీఫ్ సీజన్ కలిపి 147 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని.. ఇన్ని టన్నుల ధాన్యం సేకరణ దేశంలోనే రికార్డ్ అని తెలిపారు. వడ్ల కొనుగోళ్లకు సంబంధించి రూ.35,077 కోట్లు రైతుల ఖాతాలో వేశామన్నారు. 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని.. రైతులకు ఇబ్బంది లేకుండా స్థానికంగా ధాన్యం కొనుగోలు చేశామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం 52 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ టార్గెట్ పెట్టిందని.. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 75 లక్షల మెట్రిక్ టన్నులు సేకరించిందని తెలిపారు. తెలంగాణ పొరుగు రాష్ట్రం ఏపీలో 25 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు మాత్రమే జరిగిందని పేర్కొన్నారు. దేశంలో ఉత్పత్తి అయ్యే వరిలో 61 శాతం తెలంగాణలోనే అవుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ద్వారా మహిళా సంఘాలు, పీఏసీలను బలపరుస్తున్నామన్నారు. మహిళా సంఘాల ద్వారా 53 లక్షల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేయించామని.. రూ.171 కోట్లు మహిళా సంఘాలకు ఇచ్చామన్నారు. పీఏసీల ద్వారా 90 లక్షల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేశామని తెలిపారు. బీజేపీ, బీఆర్ఎస్ ధాన్యం కొనుగోలుపై తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. గన్నీ బ్యాగులు అందుబాటులో లేవని దుష్ప్రచారం చేస్తున్నాయని ఫైర్ అయ్యారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాలు ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నాయని మండిపడ్డారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తీరుపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్‌రెడ్డి బాధ్యతారహితంగా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. దేశంలో ఏ బీజేపీ పాలిత రాష్ట్రంలోనూ.. తెలంగాణలో సేకరించినంతా ధాన్యం సేకరించలేదని తెలిపారు. అలాంటి బీజేపీ నేతలు ఇక్కడ యాత్రలు చేయడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ప్రతిపక్షాలు చెప్పేవి అన్ని అబద్దాలేనని మండిపడ్డారు. ధాన్యం విషయంపై కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషిని పదిసార్లు కలిశామని తెలిపారు. మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని కోరామని.. కానీ కేంద్రం ఎందుకు కొనుగోలు చేయట్లేదని ప్రశ్నించారు. రైతులపై బీజేపీ వైఖరి స్పష్టం అవుతోందని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్రం కూడా బాధ్యతగా ధాన్యం కొనుగోలు చేయలేదని మంత్రి ఉత్తమ్ చెప్పుకొచ్చారు. భవిష్యత్తులో పాడి ప్రొక్యూర్‌మెంట్‌లో ఏ విధంగా పోవాలనే అంశంపై.. దేశంలో వివిధ రాష్ట్రాల్లో ప్రత్యేక బృందాలు పర్యటిస్తున్నాయని అన్నారు. రాష్ట్రంలో హమాలీల సమస్య ఎక్కువగా ఉందని ప్రస్తావించారు. మోస్ట్ అడ్వాన్స్ మోడరైజేషన్ సిస్టం తేవాలని తాము నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. తెలంగాణలో ఇప్పుడు ఉన్న స్టోరేజ్ సరిపోవట్లేదని తెలిపారు.


## మా దాడులతో ఇరాన్ సైన్యం పూర్తిగా నాశనమైంది

వాషింగ్టన్(జనంసాక్షి):అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల వల్ల ఇరాన్ సైన్యం పూర్తిగా నాశనమైందని ట్రంప్ పేర్కొన్నారు. ప్రస్తుతం టెహ్రాన్ వద్ద క్షిపణి సామర్థ్యం 21 శాతానికి మాత్రమే పరిమితమైందన్నారు. మళ్లీ దాడులు ప్రారంభిస్తే ఇరాన్ దురాక్రమణను ఎదుర్కోవడానికి అమెరికా సైన్యం సిద్ధంగా ఉందని హెచ్చరించారు. మరోవైపు ఈ యుద్ధంలో అగ్రరాజ్యం సైతం భారీ నష్టాన్ని చవిచూసిందని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించింది. ఇరాన్ దాడుల్లో ఇప్పటివరకు 13 మంది అమెరికన్ సైనికులు మరణించగా.. 399 మంది గాయపడ్డారని వెల్లడించింది. అమెరికాకు చెందిన పలు యుద్ధ విమానాలు కూడా కూలిపోయాయని తెలిపింది.

హర్మూజ్ వద్ద కూలిన అమెరికా అపాచీ హెలికాప్టర్

హర్మూజ్ జలసంధి సమీపంలో అమెరికాకు చెందిన అపాచీ హెలికాప్టర్ కుప్పకూలింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్ ధ్వంసమవగా.. ఇద్దరు పైలట్లు సురక్షితంగా బయటపడినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. హర్మూజ్‌పై ఇరాన్ విధించిన దిగ్బంధనాన్ని ఛేదించే ప్రయత్నాల్లో భాగంగా, యూఎస్ సెంట్రల్ కమాండ్ (సెంట్‌కామ్) అపాచీ హెలికాప్టర్లతో పాటు ఫైటర్ జెట్‌లు, డ్రోన్‌లతో పహారా కాస్తోన్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలోనే రీపర్ డ్రోన్‌లను కూల్చివేసినట్లు ఇరాన్ ప్రకటించడంతో.. అపాచీ హెలికాప్టర్ ఇరాన్ కాల్పుల్లో కూలిపోయిందా లేదా ఏదైనా సాంకేతికలోపం తలెత్తిందా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. ఫిబ్రవరిలో అమెరికా, ఇరాన్‌ల మధ్య ఘర్షణలు ప్రారంభమైనప్పటినుంచి యూఎస్ సైనిక హెలికాప్టర్ కూలిపోవడం ఇదే మొదటిసారి.

## భారతీయులున్న నౌకపై మేమే దాడి చేశాం





వాషింగ్టన్(జనంసాక్షి): పశ్చిమాసియా ఘర్షణల వేళ.. ఒమన్ తీరంలో భారతీయులున్న నౌకపై దాడి జరిగిన సంగతి తెలిసిందే. తమ దేశమే ఆ దాడి చేసిందని అమెరికా మిలిటరీ వెల్లడించింది. ఇరాన్ ఓడరేవుల నుంచి నౌకల రాకపోకలను అడ్డుకునేందుకు రెండునెలలుగా హర్మూజ్‌లో యూఎస్ దిగ్బంధనం కొనసాగిస్తోంది. దానికి విరుద్ధంగా ఇరాన్ పోర్టుకు వెళ్లేందుకు ప్రయత్నించడంతో దాడి చేసినట్లు యూఎస్ సెంట్రల్ కమాండ్ తెలిపింది. పలావు జెండాతో బయల్దేరిన కార్గో నౌక ఎంటీ మారివెక్స్ హర్మూజ్ సమీపంలో ఒమన్ తీరంలో ఉండగా ఈ దాడి జరిగింది. అమెరికా ఆదేశాలు పాటించకపోవడంతో పశ్చిమాసియా జలాల్లో ఉన్న యూఎస్ఎస్ అబ్రహం లింకన్ నుంచి ఈ దాడి చేసినట్లు పేర్కొంది. దీంతో మారివెక్స్ ఇక ఇరాన్‌ను చేరుకోలేదని ఎక్స్ వేదికగా వెల్లడించింది. దాడి కారణంగా మంటలు చెలరేగడంతో నౌకలోని సిబ్బంది అత్యవసర సహాయం కోసం అభ్యర్థనలు పంపారు. వెంటనే అప్రమత్తమైన భారత నౌకాదళానికి చెందిన హెలికాప్టర్లు.. షిప్‌లోని వారిని సురక్షితంగా తరలించాయి. ఇండియన్ కోస్ట్‌గార్డ్ 24 మంది భారతీయులను కాపాడింది.ఇరాన్- అమెరికా మధ్య శాంతి ఒప్పందం ఖాయమైందని అనుకునేలోపే.. మరోసారి ఘర్షణలు ప్రారంభమయ్యాయి. దాంతో ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్‌లో అంతరాయాలు మళ్లీ తీవ్రమయ్యాయి. ఏప్రిల్ 13 నుంచే అమెరికా దిగ్బంధనాన్ని కొనసాగిస్తోంది. మానవతా సహాయం కోసం వెళ్తున్న 42 నౌకలు మాత్రమే హర్మూజ్ దాటేందుకు అనుమతించింది.

# మొబైల్ వలస సహాయ కేంద్రం ప్రచార రథం ప్రారంభం

- లాంఛనంగా ప్రారంభించిన చిన్నారెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : గల్ఫ్ వలసలపై అవగాహన, చైతన్యం కల్పించడానికి ఏర్పాటు చేసిన 'మొబైల్ వలస సహాయ కేంద్రం' ప్రచార రథాన్ని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్, సీఎం ప్రజావాణి ఇంచార్జి డా. జి. చిన్నారెడ్డి మంగళవారం హైదరాబాద్ ప్రజాభవన్‌లో ప్రారంభించారు. ఐక్యరాజ్య సమితి అనుబంధ విభాగాలైన ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆఫ్ యునైటెడ్ నేషన్స్ (ఎఫ్ఓఏ), ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఓఎం) లు మైగ్రేషన్ మల్టీ-పార్టనర్ ట్రస్ట్ ఫండ్ (ఎంఎంపిటిఎఫ్) మద్దతుతో ఈ ప్రచార రథం ఏర్పాటైంది. తొలి విడతలో నిజామాబాద్, నారాయణపేట జిల్లాలలో ఈరోజు యాత్ర ద్వారా ప్రచారాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ఐఓఎం ప్రతినిధి అంకిత సురభి, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ జువ్వాడి నర్సింగరావు, ఎన్నారై అడ్వయిజరీ కమిటీ ఛైర్మన్ డా. బిఎం వినోద్ కుమార్, వైస్ ఛైర్మన్ మంద భీంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**సీఎం ప్రజావాణిలో 775 దరఖాస్తులు**

మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన 229వ సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 775 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 390, ఇందిరమ్మ ఇండ్ల కోసం 254, రెవెన్యూ శాఖకు సంబంధించి 45, ప్రవాసి ప్రజావాణికి 01 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 85 దరఖాస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి దరఖాస్తులను స్వీకరించి ఎండార్స్ మెంట్ చేసి సంబంధిత అదుకారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. గిరిజన గురుకుల పాఠశాలల ఔట్ సోర్సింగ్ ఏ. ఎన్. ఎం. ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలివచ్చారు. తమకు వారాంతపు సెలవులు, ప్రసూతి సెలవులు, 15 క్యాజువల్ సెలవులు కల్పించాలని, పెండింగ్ వేతనాలు ఇప్పించాలని కోరగా వెంటనే స్పందించిన చిన్నారెడ్డి గిరిజన శాఖ కార్యదర్శి సంతోష్ నాయక్ తో ఫోన్ లో మాట్లాడి సమస్యలను పరిస్కారం చేశారు. ఆరోగ్య శాఖలో 104 విభాగంలో విధులు నిర్వహిస్తున్న తమకు ప్రతి నెల వేతనాలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సిబ్బంది పెద్ద ఎత్తున ప్రజావాణికి వచ్చారు. వైద్య శాఖ ఉన్నతాధికారులతో చిన్నారెడ్డి మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. ఈ కార్యక్రమంలో ఏ.సీ.పీ. ఉమేందర్, ఎన్.ఆర్.ఐ. సమన్వయ మండలి వైస్ చైర్మన్ మంద భీంరెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గంజాయి పార్టీపై పోలీసుల దాడి

- పాతబస్తీకి చెందిన ఆయుర్వేద డాక్టర్ అరెస్ట్

హైదరాబాద్, జూన్ 9 (జనంసాక్షి) : నగరంలోని పాతబస్తీ చంద్రాయణగుట్ట బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి పార్టీపై పోలీసులు దాడులు చేశారు. క్రిస్టల్ టౌన్‌షిప్‌లోని ఓ ఇంటిలో గంజాయి పార్టీ జరుగుతున్నట్లు పక్కా సమాచారం అందుకున్న పోలీసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. గంజాయి సేవిస్తున్నట్లు గుర్తించి... ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి సుమారు 220 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఊటీ, కొడైకెనాల్ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చినట్లు విచారణలో వెల్లడైంది. ఈ దాడుల్లో ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు అతౌల్లాను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆయన్ను వైద్య పరీక్షల నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మెడికల్ రిపోర్ట్ వచ్చిన తర్వాత తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు ప్రకటించారు.

# దామచర్ల వద్ద ఘోర ప్రమాదం

- రెండు టూ వీలర్లు ఢీకొని ముగ్గురు దుర్మరణం



నల్లగొండ, జూన్9 (జనంసాక్షి) : నల్లగొండ జిల్లా దామరచర్ల లారీ యార్డ్ వద్ద ఘోర రోడ్డుప్రమాదం జరిగింది. రెండు ద్విచక్రవాహనాలు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురు మృతిచెందారు. మృతులను వాడపల్లికి చెందిన బత్తుల ధనుంజయరావు(43), ఉప్పుతల నరసింహారావు (38), దాచేపల్లి మండలం నారాయణపురం గ్రామానికి చెందిన డెక్క వెంకటేశ్(25)గా పోలీసులు గుర్తించారు. స్థానికంగా ఉన్న ఓ సిమెంట్ ఫ్యాక్టరీలో పని చేసేందుకు ధనుంజయరావు, నరసింహారావు ద్విచక్రవాహనంపై బయలుదే రారు. వారిద్దరూ దామరచర్ల లారీ యార్డ్ వద్దకు రాగానే.. బైక్‌పై వేగంగా వచ్చిన వెంకటేశ్(25) అనే యువకుడు వారి వాహనాన్ని బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ధనుంజయరావు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన నరసింహారావు, వెంకటేశ్‌ని హుటాహుటిన మిర్యాలగూడ ఆస్పత్రికి తరలించారు. కాగా, వెంకటేశ్ చికిత్సపొందుతూ పరిస్థితి విషమించడంతో మృతిచెందాడు. మరోవైపు మెరుగైన చికిత్స కోసం నరసింహారావును నల్లగొండకు తరలిస్తుండగా మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయాడు. ఒకే ప్రమాదంలో ముగ్గురు మృతిచెందడంతో దామరచర్ల మండలంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు స్థానిక ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

# నిరంతరం ప్రజల కోసమే పని చేస్తున్నాం

## పన్నులు పెంచలేదు.. అప్పులు తీర్చుతున్నాం..

- కనురెప్ప పాటు కరెంట్ పోకుండా 18,546 మెగావాట్ల రికార్డు డిమాండ్ అధిగమించాం
- 60 కోట్లతో విద్యుత్ సబ్ స్టేషన్ల అభివృద్ధి పనులు
- త్వరలోనే కోటి 15 లక్షల కుటుంబాలకు రూ. 5 లక్షల 'ఇందిరమ్మ కుటుంబ భీమా'
- హరీష్ రావు, ప్రతిపక్ష పార్టీల విష ప్రచారాలను తిప్పికొట్టండి!
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



స్టేషన్ ఘన్పూర్/భువనగిరి, జూన్ 09 (జనంసాక్షి) : నిరంతరం ప్రజల కోసమే పనిచేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జనగామ జిల్లాలోని స్టేషన్ ఘనపూర్ నియోజక వర్గంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ సబ్ స్టేషన్లకు శంకుస్థాపన, నిర్మాణం పూర్తి చేసుకున్న 33/11 కేవీ సబ్ స్టేషన్లు, 132/33 కేవీ సబ్ స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని జిల్లాలోని స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని చిల్పూర్ మండలంలోని పల్లగుట్టగ్రామంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా మాజీ ఉపముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎంఎల్ఏ కడియం శ్రీహరి అధ్యక్షతవహించగా ముఖ్య అతి థిగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క హాజరైనారు. ముందుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ఎన్పీడీసీఎల్ ఆధ్వర్యంలో రూ.60.62 కోట్ల వ్యయంతో చేపట్టిన నూతన విద్యుత్ సబ్ స్టేషన్ల కు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. అనంత రం ఇందిరా మహిళా శక్తి పథకం కింద స్వయం సహాయక సంఘాల మహిళలకు కేటాయించిన రైతు సేవా కేంద్రం స్టాల్ ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. అలాగే భువనగిరి సర్కిల్ కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. సభా వేదికపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జ్యోతి ప్రజ్వలన చేశారు.

ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌కు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చిందని, ప్రాజెక్టును వేగవంతంగా పూర్తి చేయ దానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. పదేళ్లపాలనలో రాష్ట్రాన్ని రూ.8లక్షల కోట్ల అప్పులపాలు చేశారని, డిస్కంలను ముంచే సి, ఇప్పుడు కల్లాల్లోకి వస్తామనడం సిగ్గుచేటని, రాష్ట్రం కొంటున్నధాన్యాన్ని కేంద్రంఎఫ్‌సీఐ ద్వారా ఎందుకు కొనడం లేదని ప్రశ్నించారు. హరీష్ రావు రోజుకో అబద్ధాన్ని సృష్టిస్తూ వార్తల్లో ఉండాలని చూస్తున్నారు.త్వరలోనే కోటి 15 లక్షల కుటుంబా లకు రూ. 5 లక్షల ఉచిత బీమా,రాష్ట్రంలో ఒకే విడతలో రూ.22 వేల కోట్ల రైతు రుణమాఫీ, రూ. 22, 500కోట్లతో 4.50లక్షల ఇందిరమ్మఇళ్ల మంజూరు చేయడం జరుగిందనిఅన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నేతలకు రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని నిప్పులు చెరిగారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లపాలన లో రాష్ట్ర సంపదను, వనరులను విచ్చలవిడిగా దోపిడీ చేసిందని భట్టి విక్రమార్క ఆరోపించారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను రూ. 8 లక్షల కోట్ల అప్పుల్లో ముంచేసి వెళ్లారు. ఆ పాపానికి ఇప్పుడు మా కాంగ్రెస్ ప్రభుత్వం ఏటా రూ. 76 వేల కోట్ల రూపాయలను అసలు,వడ్డీల రూపంలో బ్యాంకులకు కట్టాల్సి వస్తోందని, ఆ అప్పులే లేక పోయి ఉంటే 76వేల కోట్లను ప్రజలసంక్షేమానికి అందించి రాష్ట్ర దశ,దిశ మార్చేవాళ్లం అని ఆవేద న వ్యక్తం చేశారు. పదేళ్ల పాటు ఉచిత కరెంట్ ఇస్తున్నామని బీఆర్ఎస్ నేతలు గప్పాలుకొట్టుకున్నారే తప్ప, డిస్కంలకు సకాలంలోబిల్లులుచెల్లించకుండా వాటిని అప్పుల పాలు చేశారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మా క్యాబినెట్ రోజు కు 18 గంటలు ప్రజా సంక్షేమం కోసం శ్రమిస్తుంటే, పదేళ్లు మంత్రిగా పనిచేసిన హరీష్ రావు కేవలం వార్తల్లో ఉండటంకోసం రోజు కొక అబద్ధపు వార్త ను సృష్టిస్తున్నారని అన్నారు.అధికారం పోయింద నే తట్టుకోలేక కట్టుకథలు అల్లుతున్నారని హరీష్ రావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ వ్యాప్తంగా రైతులనుకార్పొరేట్ శక్తుల దయాదాక్షిణ్యాల మీద వదిలేయాలని కేంద్రం చూస్తోందని ఆరోపించారు. మద్దతుధర (ఎంఎస్పి)ప్రకటించిన కేంద్రప్రభుత్వం, రాష్ట్రాలు కొనుగోలు చేస్తున్న ధాన్యాన్ని ఎఫ్సిఐ ద్వారా ఎందుకు సేకరించడం లేదని, గత కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో ఎఫ్‌సీ ఐ ద్వారా కేంద్రమే కొనుగోలుచేసేదని ఇప్పుడెందుకు ఆ వ్యవస్థను నిర్వీర్యం చేశారని సూటిగా ప్రశ్నించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల చివరి ధాన్యపు గింజ వరకూ కొంటుందని చెప్పారు. తెలంగాణలో మొక్కజొన్న ను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసిందని గుర్తు చేశారు. 2023-24లో 15,000 మెగావాట్ల పీక్ డిమాండ్ ఉంటేనే చేతులెత్తేసిన గత పాలకుల నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ, తమ ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరంలో 18,546 మెగావాట్ల రికార్డు స్థాయి పీక్ డిమాండ్ నమోదైనప్పటికీ, కనురెప్ప పాటు కూడా కరెంట్ పోకుండా నిరంతర విద్యుత్తును అందించి ఘనత సాధించిందని కొనియాడారు. హరీష్ రావు వేస్తున్న అభాండాలను ప్రజలంతా గమనిస్తున్నారని, రోజుకో అబద్ధం తో కట్టు కథలల్లి విష ప్రచారం చేస్తున్న వారిని తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



స్టేషన్ ఘన్‌పూర్ సభలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య, టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి, తెలం గాణ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి, తెలంగాణ హజ్ కమిటీ ఛైర్మన్ కుసు పాషా,ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవురి ప్రకాష్ రెడ్డి,కె.ఆర్ నాగరాజు,గండ్ర సత్యనారాయ ణరావు, దొంతి మాధవ రెడ్డి, మామిడాల యశస్వినీరెడ్డి, కుడా చైర్మన్,హనుమకొండ జిల్లా ఇనుగా ల వెంకట్రాం రెడ్డి,జనగామజిల్లా డిసిసి అధ్యక్షురా లు లకావత్ ధన్వంతి, జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాచ్ పాయ్, సియండి ట్రాన్స్‌కో డి కృష్ణ భాస్కర్, సియండి టీజీఎన్పిడిసిఎల్, వరంగల్ కర్నాటి వరుణ్ రెడ్డి, కమీషనర్ ఆఫ్ పోలీసు వరంగల్ సన్ ప్రీత్ సింగ్,డిసిపి జనగామ బి రాజ మహేంద్ర నాయక్,జిల్లాగ్రంథాలయ ఛైర్మన్ మారు జోడు రాంబాబు, స్టేషన్ ఘనపూర్ మునిసిపల్ చైర్మన్ తాటికొండ వినయ్ కుమార్,వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ లావణ్య రెడ్డి, చిల్పూర్ గుట్ట దేవస్థానం, ఛైర్మన్ పొట్లపల్లి శ్రీధర్ రావు, పల్లగుట్ట గ్రామ సర్పంచ్ ఎనగందుల నర్సింహా రెడ్డి, సర్పంచ్ లు పాల్గొన్నారు.

భువనగిరి మండలం హనుమపురం గ్రామంలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ఎదురుగా 2.03 కోట్లతో నిర్మించనున్న 'స్టోర్ కాంప్లెక్స్'కు, అలాగే వలిగొండ మండలం నర్సాపూర్ గ్రామంలో 3.52 కోట్లతో చేపట్టనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, శాసనమండలి సభ్యులు నెల్లికంటి సత్యం, మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి, తడక వెంకటేశం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ వి పాటిల్, కలెక్టర్ అనురాగ్ జయంతి తదితరులు పాల్గొన్నారు.

# పోడు భూమల కోసం రైతుల నిరసన

- రైతులు-అటవీ అధికారుల మధ్య వాగ్వివాదం
- కొందరిని కాగజ్‌నగర్‌కు తరలింపు



చింతలమానేపల్లి జూన్ 9 (జనం సాక్షి) : మండలంలోని దిందా గ్రామంలో పోడు భూముల వివాదం మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. అటవీ పునరుద్ధరణ కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ అధికారులు భూముల్లో మొక్కలు నాటేందుకు వెళ్లగా, స్థానిక పోడు రైతులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎఫ్ఆర్‌వో సుభాష్ ఆధ్వర్యంలో అటవీ శాఖ సిబ్బంది ట్రాక్టర్ల సహాయంతో కార్యక్రమాన్ని చేపట్టేందుకు ప్రయత్నించగా, తమ సాగు భూముల్లో పనులు చేయవద్దంటూ రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకోగా, పరిస్థితి కొంతసేపు ఉద్రిక్తంగా మారింది. నిరసనలో భాగంగా కొందరు గ్రామస్తులు అటవీ శాఖ వాహనాల ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. డీఎస్పీ వైహిదుద్దీన్, సీఐ సంతోష్ కుమార్, ఎస్ఐ కమలాకర్ ఆధ్వర్యంలో భద్రతా చర్యలు చేపట్టి, కొంతమంది పోడు రైతులను అదుపులోకి తీసుకుని కాగజ్‌నగర్ ఫారెస్ట్ డివిజన్ కార్యాలయానికి తరలించారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ సంఖ్యలో పోలీసు, అటవీ సిబ్బందిని మోహరించారు. పోడు భూముల సమస్యపై గత కొంతకాలంగా రైతులు, అటవీ శాఖ అధికారుల మధ్య విభేదాలు కొనసాగుతున్నాయి. అధికారులు అటవీ భూములను పరిరక్షించే చర్యలు చేపడుతుండగా, రైతులు మాత్రం తాము తరతరాలుగా సాగు చేస్తున్న భూములపై హక్కులు కల్పించి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉండగా, మహిళలు, వృద్ధులను సైతం పరిగణనలోకి తీసుకోకుండా తమపై బలప్రయోగం చేసి అక్కడి నుంచి తరలించారని రైతులు ఆరోపించారు. తమ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. మరోవైపు, కాగజ్‌నగర్ ఎఫ్‌డీవో అప్పయ్య మాట్లాడుతూ కర్జెల్లి రేంజ్ పరిధిలో అటవీ భూములు పెద్ద ఎత్తున ఆక్రమణలకు గురయ్యాయని తెలిపారు. దిందా ప్రాంతంలో 1,600 ఎకరాల భూమిలో ఆక్రమణలు ఉన్నాయని, అందులో 800 ఎకరాల్లో తాత్కాలికంగా రైతులు సాగు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆయన వెల్లడించారు.

# మహిళలు ఎదుగుతుంటే ఓర్వలేని బీఆర్ఎస్

- ఫ్రీ బస్సు తీసుకొస్తే కళ్లల్లో నిప్పులు పోసుకున్నారు
- మంత్రి సీతక్క ఘాటు విమర్శలు

హైదరాబాద్, జూన్ 9 (జనంసాక్షి) : మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని కాంగ్రెస్ సర్కార్ కోరుకుంటే బీఆర్ఎస్ ఏడుస్తోందని మంత్రి సీతక్క విమర్శించారు. మహిళలు ఎదిగితే బీఆర్ఎస్ ఓర్వలేకపోతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళల కోసం ఫ్రీ బస్ స్కీమ్ తీసుకొస్తే కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని బీఆర్ఎస్ పై ఫైర్ అయ్యారు. మంగళవారం సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ ప్రభుత్వం మహిళా శక్తి సభ నిర్వహించింది. మంత్రి సీతక్క ఈ సభకు హాజరై ప్రసంగించారు. రాష్ట్రంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలకు రూ.61 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చామని తెలిపారు. రూ.2 వేల కోట్ల వడ్డీ డబ్బులను ప్రభుత్వమే చెల్లింస్తుదని చెప్పారు. మహిళలు వంటింటికే పరిమితం కాకుండా ఉపాధి కల్పిస్తున్నామన్నారు. మూడు వేలకు పైగా మహిళా సంఘాలకు ఐకేపీ సెంటర్లు ఇచ్చామని.. వీటి ద్వారా ఆడబిడ్డలకు గతేడాది రూ.159 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు.

# తెలంగాణ ఆత్మగౌరవ గీతానికి చిరస్మరణీయ నివాళి

- ఘట్కేసర్‌లో 'అందెశ్రీ స్మృతి వనం' ఏర్పాటు
- స్మృతి వనం పనులను పరిశీలించిన మంత్రి అడ్లూరి



హైదరాబాద్, జూన్9 (జనంసాక్షి) : తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని తన కలంతో ప్రజల్లో రగిలించిన మహాకవి, ప్రజా గాయకుడు, రాష్ట్ర గేయ రచయిత అందెశ్రీ స్మృతిని చిరస్థాయిగా నిలిపేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్ పక్కన ఏర్పాటు చేయనున్న 'అందెశ్రీ స్మృతి వనం' స్థలాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమ చరిత్రలో అందెశ్రీది ప్రత్యేక స్థానం అని పేర్కొన్నారు. తన గీతాలు, రచనల ద్వారా తెలంగాణ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి ఆదేశాల మేరకు అందెశ్రీ సేవలకు గుర్తింపుగా ఈ స్మృతి వనాన్ని అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ఘట్కేసర్‌లో ప్రభుత్వం ఎకరం 22 గుంటల భూమిని ఇందుకోసం కేటాయించిందని మంత్రి వెల్లడించారు. ఇది కేవలం ఒక ఉద్యానవనం మాత్రమే కాకుండా, తెలంగాణ సాహిత్య, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే స్మారక క్షేత్రంగా రూపుదిద్దుకోనుందని చెప్పారు. అందెశ్రీ జీవిత విశేషాలు, ఉద్యమంలో ఆయన పాత్ర, సాహిత్య సేవలను భావితరాలకు చేరవేసే విధంగా స్మృతి వనాన్ని అభివృద్ధి చేస్తామని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ చరిత్రను, ఉద్యమ స్ఫూర్తిని యువతకు పరిచయం చేసే జ్ఞాపక చిహ్నంగా ఈ ప్రాంగణం నిలవాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేయడం తన బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి మాట్లాడుతూ... స్మృతి వనం అభివృద్ధి కోసం ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో సుమారు రూ.4 కోట్ల అంచనా వ్యయంతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. త్వరలోనే టెండర్ల ప్రక్రియ ప్రారంభించి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులు పూర్తయిన అనంతరం స్మృతి వనాన్ని నిర్వహణ కోసం హెచ్ఎండీఏకు అప్పగించనున్నట్లు చెప్పారు. స్మృతి వనంలో అందెశ్రీ విగ్రహం, ఆయన జీవిత చరిత్రను ప్రతిబింబించే శిలాఫలకాలు, తెలంగాణ ఉద్యమ గీతాల ప్రదర్శన గ్యాలరీ, సాహిత్య వేదిక, పచ్చదనంతో కూడిన ప్రత్యేక ఉద్యానవనం, సందర్శకులకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని గీతంగా మలిచిన మహాకవి అందెశ్రీకి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ గౌరవం, తెలంగాణ సాంస్కృతిక చరిత్రలో ఒక మైలురాయిగా నిలవనుంది.

# దేవాలయాల్లో చేనేత శాలువాలే అందించాలి

- మంత్రి కొండా సురేఖకు గజం అంజయ్య వినతిపత్రం
- సానుకూలంగా స్పందించిన మంత్రి కొండా సురేఖ
- ఆలయాల్లో చేనేత వస్త్రాల వినియోగం పరిశీలిస్తామని హామీ



హైదరాబాద్, జూన్9 (జనంసాక్షి) : రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో భక్తులకు ఆశీర్వచనంగా చేనేత రంగం ద్వారా తయారు చేసిన శాలువాలను మాత్రమే అందించాలని పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ చేనేత కళాకారుడు గజం అంజయ్య దేవాదాయ ధర్మాదాయ శాఖామంత్రి కొండా సురేఖను కోరారు. ఈ మేరకు మంత్రి కొండా సురేఖను జూబ్లీహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా చేనేతకారులు స్వచ్ఛమైన నూలుతో తయారైన శాలువాతో మంత్రిని సత్కరించారు. యాదాద్రి, భద్రాచలం, బాసర, వేములవాడ తదితర ప్రధాన దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, సేవల్లో పాల్గొనే భక్తులకు అందించే శాలువాలు ప్రస్తుతం పెద్దమొత్తంలో మరమగ్గాలు, మిల్లుల్లో కృత్రిమ నూలుతో తయారవుతున్నాయని ఆయన మంత్రి సురేఖకి వివరించారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా దేవాలయాల్లో ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని నిషేధిస్తున్న పరిస్థితుల్లో సింథటిక్ నూలుతో తయారైన శాలువాల వినియోగాన్ని కొనసాగించడం సముచితం కాదని తన అభిప్రాయాన్ని మంత్రి సురేఖ కి విన్నవించారు. ఈ కార్యక్రమంలో చేనేత రంగానికి చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. విత్రమైన దేవాలయాల్లో భక్తులకు అందించే శాలువాలు స్వచ్ఛమైన పత్తి లేదా పట్టు చేనేత వస్త్రాలతో తయారైతే వాటికి మరింత ఆధ్యాత్మిక, సాంస్కృతిక విలువ చేకూరుతుందని అంజయ్య మంత్రి సురేఖకు తెలిపారు. అదే సమయంలో ఈ నిర్ణయం రాష్ట్రంలోని వేలాది మంది చేనేత కార్మికులకు స్థిరమైన ఉపాధి అవకాశాలను కల్పించడంతో పాటు తెలంగాణ చేనేత సంప్రదాయాల పరిరక్షణకు దోహదపడుతుందని వివరించారు. అందువల్ల రాష్ట్రంలోని అన్ని ప్రధాన దేవాలయాల్లో చేనేతతో తయారైన పవిత్ర శాలువాల వినియోగాన్ని ప్రోత్సహించేలా ప్రభుత్వం తగిన విధాన నిర్ణయం తీసుకోవాలని అంజయ్య మంత్రిగారికి విజ్ఞప్తి చేశారు. గజం అంజయ్య చేసిన సూచనలు, ప్రతిపాదనలను మంత్రి కొండా సురేఖ సానుకూలంగా స్వీకరించారు. ఈ దిశగా కృషి చేస్తున్న గజం అంజయ్యను మంత్రి సురేఖ అభినందించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భారతీయ సంప్రదాయాల సంరక్షణలో చేనేత కార్మికులు పోషిస్తున్న పాత్ర అమూల్యమైనదని ఆమె కొనియాడారు. ఆలయాల్లో చేనేత వస్త్రాల వినియోగాన్ని ప్రోత్సహించడం ద్వారా సంప్రదాయ పరిరక్షణతో పాటు చేనేత కార్మికుల జీవనోపాధికి ఊతం లభిస్తుందని అన్నారు. ఈ అంశాన్ని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి, సాధ్యాసాధ్యాలను పరిశీలించి చేనేత రంగానికి మద్దతుగా తగిన చర్యలు చేపడతామని గజం అంజయ్యకు హామీ ఇచ్చారు.

# తెలంగాణలో ఏసీబీ "రైడ్"

తెలంగాణ రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ గత కొన్ని నెలలుగా అసాధారణమైన చురుకుదనంతో వ్యవహరిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఏసీబీకి పూర్తి స్వేచ్ఛను కల్పించిన నేపథ్యంలో, అవినీతికి పాల్పడిన అధికారులు ఇప్పుడు నిద్రపోలేని పరిస్థితిలో ఉన్నారు. ఒకప్పుడు రాజకీయ అండదండలతో నిర్భయంగా వ్యవహరించిన అధికారులు నేడు చట్టం ముందు తలవంచే స్థితికి చేరుకుంటున్నారు. ఇది తెలంగాణ పాలనా చరిత్రలో ఒక కీలకమైన మలుపు.

తాజాగా వెలుగులోకి వచ్చిన అత్యంత కీలకమైన కేసు రోడ్లు మరియు భవనాల శాఖ, ఇంజనీర్-ఇన్-చీఫ్ మోహన్ నాయక్‌కు సంబంధించింది. ఏసీబీ అధికారులు ఆయన నివాసంపై మాత్రమే కాకుండా, ఆయన కార్యాలయాలు మరియు బంధువుల ఇళ్లపై కూడా ఒకేసారి విస్తృతమైన సోదాలు నిర్వహించారు. ఈ దాడులు తెలంగాణ ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారుల వ్యవస్థలో అవినీతి ఏ స్థాయిలో పాతుకుపోయిందో మరోసారి స్పష్టం చేశాయి.

ఆర్ అండ్ బీ శాఖలో రోడ్ల నిర్మాణం, వంతెనల నిర్మాణం, ప్రభుత్వ భవనాల నిర్మాణం వంటి పనులు జరుగుతాయి. ఈ శాఖలో కాంట్రాక్టులు, టెండర్లు, బిల్లుల చెల్లింపు వంటి వ్యవహారాల్లో అవినీతికి అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇంజనీర్-ఇన్-చీఫ్ స్థాయి అధికారి ఇందులో భాగస్వామి అయ్యాడని ఏసీబీ అనుమానిస్తోంది. ఈ సోదాల్లో భారీ మొత్తంలో నగదు, ఆస్తి పత్రాలు, అనుమానాస్పద లావాదేవీలకు సంబంధించిన పత్రాలు బయటపడినట్లు సమాచారం. ఈ కేసు ముందుముందు మరింత అనేక పెద్ద పేర్లను బయటకు తీసుకొస్తుందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.


గతంలో ఏసీబీ పని తీరుపై తరచూ విమర్శలు వచ్చేవి. రాజకీయ పెద్దల జోక్యం, పై అధికారుల ఒత్తిళ్లు, ఫైళ్లు నత్తనడకన సాగడం వంటి సమస్యలు ఏసీబీ సామర్థ్యాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. అయితే ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏసీబీకి పూర్తి స్వాయత్తత కల్పించింది. ఏ అధికారిపై అయినా, ఏ స్థాయి వ్యక్తిపై అయినా నేరుగా చర్యలు తీసుకునే అధికారం ఏసీబీకి దక్కింది. ఈ నిర్ణయం వల్ల ఏసీబీ అధికారులు ఎటువంటి రాజకీయ ఒత్తిడికి లోనవకుండా స్వతంత్రంగా దర్యాప్తు నిర్వహిస్తున్నారు. సాక్ష్యాలు ఉంటే చాలు, పై నుండి అనుమతి కోసం వేచి చూడాల్సిన అవసరం లేదు. ఈ విధానమే నేడు రాష్ట్రంలో అవినీతి అధికారుల్లో గుండె దడ పుట్టిస్తోంది.

గత రెండు నెలల కాలంలో తెలంగాణ అంతటా ఏసీబీ నిర్వహించిన దాడులు రికార్డు స్థాయిలో ఉన్నాయి. వివిధ శాఖల అధికారులు, సబ్-రిజిస్ట్రార్లు, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు, ఇంజనీర్లు వంటి అనేక మంది ఏసీబీ వలలో చిక్కుకున్నారు. ముఖ్యంగా భూముల రిజిస్ట్రేషన్, ప్రభుత్వ పనులు, నిర్మాణ అనుమతులు వంటి రంగాల్లో లంచగొండితనం ఎక్కువగా బయటపడింది. ఈ దాడుల వల్ల కోట్లాది రూపాయల విలువైన ఆస్తులు, నగదు, బంగారం స్వాధీనమైనట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. ఇవి చూస్తే సామాన్య ప్రజల నుండి ఎంత సంపద దోచుకోబడిందో అర్థమవుతోంది.

ఏసీబీ దాడులు అవినీతికి తాత్కాలిక అడ్డుకట్ట వేయగలవు. కానీ వ్యవస్థాగత అవినీతిని శాశ్వతంగా నిర్మూలించాలంటే కేవలం దాడులు సరిపోవు. పారదర్శకమైన ప్రభుత్వ కొనుగోళ్ల విధానం, డిజిటల్ పేమెంట్ల విస్తరణ, బలమైన విజిల్ బ్లోయర్ రక్షణ చట్టాలు, జవాబుదారీతనం పెంచే సంస్కరణలు వంటివి చేపట్టాల్సిన అవసరం ఉంది. అవినీతిపరులను నేరస్థులుగా గుర్తించి శిక్షించడమే కాకుండా, అవినీతికి అవకాశమే లేకుండా చేసే వ్యవస్థ నిర్మాణం జరగాలి. అదే సమయంలో నిజాయితీపరులైన అధికారులను గుర్తించి వారిని ప్రోత్సహించే విధానాలు రావాలి. లంచం తీసుకోకుండా నైతికంగా పని చేసే అధికారి ఉన్నత పదవులకు చేరుకోగలిగే వ్యవస్థ ఏర్పడాలి. అప్పుడే అవినీతి నిర్మూలన కేవలం నినాదంగా మిగిలిపోకుండా వాస్తవంలో సాధ్యమవుతుంది.

తెలంగాణలో ఏసీబీకి ఫ్రీ హ్యాండ్ ఇవ్వడం ఒక సాహసోపేతమైన నిర్ణయం. ఈ నిర్ణయం కారణంగా అవినీతిపరులు చట్టానికి భయపడే వాతావరణం ఏర్పడుతోంది. మోహన్ నాయక్ వంటి హై-ప్రొఫైల్ కేసులు స్పష్టమైన సందేశం ఇస్తున్నాయి. పదవి ఎంత పెద్దదైనా, రక్షణ ఎంత గట్టిదైనా, అవినీతి చేస్తే పర్యవసానాలు తప్పవు. ప్రభుత్వం ఏసీబీకి ఇచ్చిన మద్దతు నిరంతరంగా కొనసాగాలి. రాజకీయ ప్రమేయం లేకుండా, ఒత్తిళ్లకు తలవంచకుండా ఏసీబీ పని చేస్తూనే ఉండాలి. అప్పుడే తెలంగాణ అవినీతి రహిత రాష్ట్రంగా దేశానికి ఆదర్శంగా నిలుస్తుంది. ఆ రోజు రావాలని లక్షలాది మంది సామాన్య తెలంగాణ ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# 12 వేల ఎకరాలిచ్చినా పరాయివాళ్లమేనా..?



### 'బుల్లెట్ రైల్' జహీరాబాద్ రావాల్సిందేనని భూమిపుత్రుల సమరం..!

కన్నతల్లి లాంటి నల్లరేగడి మట్టిని నమ్ముకున్న ప్రాణాలవి.. రేపటి తరం బాగుంటుందనే ఆశతో, తరతరాల ఎర్రమట్టి అనుబంధాన్ని తెంచుకొని సర్వస్వాన్ని ధారపోసిన గుండెలవి! సంసారం ముక్కలవుతున్నా భరిస్తూ, ఇల్లు వాకిలిని ఇండస్ట్రియల్ హబ్ కోసం త్యాగం చేసిన చరిత్ర జహీరాబాద్ ప్రజలది. కానీ, నేడు ఆ త్యాగాల పునాదులపై ఎదుగుతున్న పారిశ్రామిక సామ్రాజ్యంలో తాము పరాయి వాళ్లం కాకూడదని, ఆ బక్కచిక్కిన బడుగు రైతు నేడు బావురుమంటున్నారు. అందుకే, ప్రతిపాదిత హైదరాబాద్ - ముంబై హైస్పీడ్ (బుల్లెట్) రైల్ కారిడార్ అలైన్‌మెంట్‌ను జహీరాబాద్ మీదుగానే కొనసాగించాలని జహీరా బాద్ భూమిపుత్రులు నేడు ఉవ్వెత్తున సమరశంఖం పూరించారు.

**త్యాగాల పునాదిపై 'నిమ్జ్' స్మార్ట్ సిటీ నిర్మాణం..!**

ఒక చిన్న పరిశ్రమకు పునాది పడాలన్నా వందల ఎకరాల భూమి కావాలి. అలాంటి తరుణంలో ప్రభుత్వ పిలుపుకు స్పందించి రేపటి తరం భవిష్యత్తు కోసం, దేశ ప్రగతి చక్రం మరింత వేగంగా కదలడం కోసం జహీరాబాద్ రైతాంగం కన్నతల్లి లాంటి తమ నల్లరేగడి నేలను ప్రభుత్వానికి అప్పగించింది. జాతీయ పెట్టుబడుల, ఉత్పాదక మండలి (చీ×ఫ్గీ)తో పాటు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ ప్రాజెక్టు స్థాపన కోసం.. తాము ప్రాణప్రదంగా సాకుతూ, రక్తాన్ని చెమటగా మార్చి పండించిన 12,000 ఎకరాల అమూల్యమైన సాగు భూములను నిస్వార్థంగా ధారదత్తం చేసింది. ఈ మహత్తర త్యాగంలో భాగంగా.. తరతరాలుగా తమ కాళ్ల కింద ఉన్న మట్టిని వదిలేస్తూ, ఎంతోమంది అన్నదాతలు తమ ఇల్లు, వాకిలి, బతుకుదెరువును మాత్రమే కాకుండా.. ఆ నేలతో ముడిపడి ఉన్న ఆత్మీయ అనుబంధాలను, తరాల ఆవాసాలను పూర్తిగా కోల్పోయి నేడు నిలువనీడ లేని స్థితికి చేరుకున్నారు.

"మా బతుకులను త్యాగం చేసి ప్రభుత్వానికి సహకరించినప్పుడు, మా బతుకుల్ని, మా భవిష్యత్ తరాలను, ఈ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై లేదా? మమ్మల్ని మా సొంత నేలపైనే పరాయివాళ్లను చేస్తారా? అని స్థానికులు కన్నీళ్లతో ప్రశ్నిస్తున్నారు." ఇలాంటి సమయంలో బుల్లెట్ రైల్ లాంటి ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ఇక్కడికి వస్తే, తమ త్యాగాలకు ఒక సార్థకత లభిస్తుందని, కోల్పోయిన బతుకులకు ఆర్థికంగా ఊతం లభిస్తుందని ఆ బక్క చిక్కిన ప్రాణాలు నమ్ముతున్నాయి.

**జహీరాబాద్ ప్రగతికి బుల్లెట్ రైలే ఊపిరి..!**

నేడు తెలంగాణ పారిశ్రామిక పటంలో అత్యంత వేగంగా, అప్రతిహతంగా దూసుకుపోతున్న ప్రాంతం జహీరాబాద్. నిమ్జ్ రాకతో ఈ ప్రాంతం కేవలం ఒక సాధారణ టౌన్ స్థాయి నుంచి గ్లోబల్ ఇండస్ట్రియల్ హబ్‌గా రూపాంతరం చెందుతోంది. ప్రధాని మోదీ ఆకాంక్షించినట్లుగా.. అత్యాధునిక మౌలిక సదుపాయాలతో కూడిన రేపటి "ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ" గా, భవిష్యత్తులో "మరో హైదరాబాద్" గా విస్తరించడం ఖాయంగా కనిపిస్తోంది.

వేలాది ఎకరాలలో విస్తరిస్తున్న 'నిమ్జ్ ' కారణంగా నేడు వందలాది దేశీయ, అంతర్జాతీయ దిగ్గజ పరిశ్రమలు జహీరాబాద్‌కు క్యూ కడుతున్నాయి. ముఖ్యంగా ఆటోమొబైల్, డిఫెన్స్ (రక్షణ రంగం), ఎలక్ట్రానిక్స్, ఫార్మా వంటి అత్యంత కీలకమైన రంగాలు జహీరాబాద్‌ను తమ ప్రధాన కేంద్ర బిందువుగా చేసుకుంటున్నాయి. ఈ పారిశ్రామికీకరణతో ఇది అంతర్జాతీయ హబ్‌గా మారుతుండటంతో... గ్లోబల్ కంపెనీల ప్రతినిధులు, బహుళజాతి పారిశ్రామిక వేత్తలు, ఉన్నత స్థాయి నిపుణులు నిరంతరం సందర్శించే అత్యంత ప్రాధాన్యత కలిగిన నగరంగా ఇది అవతరించబోతోంది.

ఇప్పటికే జహీరాబాద్ మీదుగా ముంబై జాతీయ రహదారి వెళుతుండడం ఒక ప్లస్ పాయింట్. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన హైదరాబాద్ - ముంబై ఆర్థిక నగరాలను కలిపే ఈ హైస్పీడ్ కారిడార్‌లో జహీరాబాద్ అత్యంత సరైన, వ్యూహాత్మకమైన భౌగోళిక స్థానంలో ఉంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైతో జహీరాబాద్‌కు నేరుగా బుల్లెట్ రైలు కనెక్టివిటీ లభిస్తే.. ఇక్కడి పరిశ్రమల ఉత్పత్తుల రవాణా, అంతర్జాతీయ వ్యాపార లావాదేవీలు ఊహించని స్థాయికి చేరుకుంటాయి. ముంబై వంటి నగరంతో హైస్పీడ్ అనుసంధానత ఏర్పడటం ద్వారా... ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు పెరిగి, రైతన్నల కుటుంబాల మెరుగైన జీవన విధానానికి, ఆర్థిక వృద్ధికి సరికొత్త బాటలు పడతాయని స్థానిక సమాజం బలంగా ఆశిస్తోంది.

**అలైన్‌మెంట్ మార్పుతో.. నీరుగారిపోనున్న 'బుల్లెట్ రైల్' ప్రాజెక్టు లక్ష్యం..!**

జహీరాబాద్ ప్రాంతానికి ఉన్న పారిశ్రామిక ప్రాధాన్యతను, దాని అపారమైన భవిష్యత్తును ముందే గుర్తించి, గతంలో ఈ ప్రతిష్టాత్మక బుల్లెట్ రైలు అలైన్‌మెంట్‌ను జహీరాబాద్ మీదుగానే ఖరారు చేస్తూ ప్రతిపాదించారు. కానీ, అంతా సజావుగా సాగుతుందనుకున్న తరుణంలో.. ప్రస్తుతం ఈ మార్గాన్ని హఠాత్తుగా, అనాలోచితంగా వికారాబాద్ వైపునకు మార్చడం వెనుక ఉన్న అసలు వ్యూహం ఏంటో, ఎవరి ప్రయోజనాల కోసం ఈ నిర్ణయం తీసుకున్నారో ఎవరికీ అర్థం కావడం లేదు.

రాబోయే రోజుల్లో దేశంలోనే అత్యంత రద్దీగా మారబోయే పారిశ్రామిక హబ్ జహీరాబాద్. అలాంటి ల్యాండ్‌మార్క్ ప్రాంతాన్ని కాదని, పూర్తిగా భిన్నమైన వేరే మార్గానికి ఈ అలైన్‌మెంట్‌ను తరలించడం అనేది ముమ్మాటికీ చారిత్రాత్మక తప్పిదమే అవుతుంది. దీనివల్ల అటు ప్రభుత్వానికి రావాల్సిన భారీ ఆదాయానికి గండి పడటంతో పాటు.. కనెక్టివిటీ, పారిశ్రామిక రవాణా వేగాన్ని పెంచాలనే బుల్లెట్ రైలు ప్రాజెక్టు యొక్క అసలు లక్ష్యమే పూర్తిగా నీరుగారిపోతుందని పారిశ్రామిక, రవాణా రంగ నిపుణులు సైతం హెచ్చరిస్తున్నారు.

**జహీరాబాద్ వాసిగా నా కళ్లముందు కదలాడుతున్న సత్యం!**

ఒక జర్నలిస్టుగా, అన్నింటికీ మించి ఈ జహీరాబాద్ నేల మీద పుట్టి పెరిగిన ఇక్కడి ప్రాంత వాసిగా.. గత కొన్ని రోజులుగా జహీరాబాద్ వేదికగా సాగుతున్న ఆందోళనలను, ఇక్కడి ప్రజల గుండెల్లో మండుతున్న సెగను నేను నిశితంగా గమనిస్తున్నాను. నిమ్జ్ కోసం, ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ కోసం ప్రభుత్వానికి వేలాది ఎకరాల భూములు ఇచ్చి, సర్వస్వాన్ని త్యాగం చేసిన ఇక్కడి రైతులు, మేధావులు, స్థానిక ప్రజలు నేడు రోడ్లపైకి వచ్చి ఆందోళన బాట పట్టారు.

సొంత ఇల్లు, వాకిలిని దేశ ప్రగతి కోసం రాసిచ్చిన అమాయక రైతన్నల బతుకులను ఈ అలైన్‌మెంట్ మార్పు తీవ్రంగా కలచివేస్తోంది. జహీరాబాద్ మీదుగా రావాల్సిన బుల్లెట్ రైలు రూట్‌ను హఠాత్తుగా మార్చడం అంటే.. కేవలం ఒక రైలు మార్గాన్ని మార్చడం కాదు, నమ్మి భూములిచ్చిన జహీరాబాద్ రైతుల్ని అవమానించడమే! వారి బతుకులను, భవిష్యత్తును మరింత అగాధంలోకి నెట్టేయడమే ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోంది స్థానికులు వ్యక్తపరుస్తున్న ఆందోళనలో వంద శాతం న్యాయముందనిపిస్తోంది. తమ కళ్లముందే పుడుతున్న ఆధునిక పారిశ్రామిక సామ్రాజ్యంలో తాము నిరుపేద కూలీలుగా మిగిలిపోతామా అన్న భయం వారి కళ్లలో స్పష్టంగా కనిపిస్తోంది. ఈ తరుణంలో ప్రాంతీయ ప్రయోజనాలే లక్ష్యంగా స్థానిక న్యాయకత్వం చొరవ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**పాలకులారా స్పందించండి - బుల్లెట్ రైలు పాత అలైన్‌మెంట్‌ను పునరుద్ధరించండి!**

జహీరాబాద్‌కు బుల్లెట్ రైలు, మెట్రో వంటి అత్యాధునిక రవాణా వ్యవస్థలు కేవలం విలాసం కాదు.. ఈ నేల మనుగడకు అత్యవసరం. రేపటి తెలంగాణ ఆర్థిక వృద్ధిని శాసించబోయే ప్రధాన పారిశ్రామిక ఇంజన్ జహీరాబాద్. దేశ, రాష్ట్ర ప్రగతి కోసం 'నిమ్జ్' (చీ×ఫ్గీ) నిర్మాణానికి 12 వేల ఎకరాల సాగు భూములను, తమ సర్వస్వాన్ని త్యాగం చేసిన భూమిపుత్రుల ఆర్థిక శ్రేయస్సును గుర్తించాల్సిన కనీస నైతిక బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. అంతర్జాతీయ స్థాయికి విస్తరిస్తున్న ఇక్కడి పారిశ్రామిక రంగానికి తగ్గట్టుగా రవాణా వ్యవస్థను కూడా అదే వేగంతో బలోపేతం చేయాలి.

అందుకే, ప్రస్తుత వికారాబాద్ రూట్ ప్రతిపాదనను తక్షణమే పునఃసమీక్షించి, జహీరాబాద్ మీదుగానే బుల్లెట్ రైలు వెళ్లేలా పాత అలైన్‌మెంట్‌ను పునరుద్ధరించాలి. ఈ క్లిష్టసమయంలో స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే, జిల్లా మరియు ఇన్చార్జి మంత్రులు రాజకీయాలకు అతీతంగా ఒకే తాటిపైకి రావాలి. రైల్వే బోర్డు, చీనా=జూ మరియు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తెచ్చి సాంకేతిక మార్పులు చేయించడమే ఈ ఉమ్మడి నాయకత్వానికి అసలైన అగ్నిపరీక్ష. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ భవిష్యత్తును రక్షించేలా, రైతన్నలకు న్యాయం జరిగేలా పాత అలైన్‌మెంట్‌పై అధికారిక ప్రకటన చేయాలని ఈ ప్రాంత ప్రజానీకం ముక్తకంఠంతో డిమాండ్ చేస్తోంది!



పరమేశ్వర్ నాగిరెడ్డిపల్లి
సీనియర్ జర్నలిస్ట్
(9010601375)



# ప్రభుత్వాల అసమర్థతపై యువత ఆగ్రహం

ప్రపంచవ్యాప్తంగా యువత రోడ్లపైకి వచ్చి ఉద్యమిస్తోంది. చదువుకున్న వారు సైతం, కలలు కన్న యువతకు ఉద్యోగాలు, ఉపాధి దొరకడం లేదు. ఆర్థిక సంక్షోభం, ద్రవ్యోల్బణం, అసమానతలు, అవినీతి వారి భవిష్యత్తును ముట్టడిస్తున్నాయి. భారతదేశంలో కూడా ఈ ఆగ్రహం తీవ్రరూపం తీసుకుంది. జాతీయ అర్హత సమగ్ర ప్రవేశ పరీక్ష (నీట్), సంయుక్త ప్రవేశ పరీక్ష (జేఈఈ) వంటి జాతీయ స్థాయి పరీక్షలలో ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల అస్తవ్యస్తతలు లక్షలాది విద్యార్థుల ఆశలను ధ్వంసం చేశాయి. యువత "కాక్రోచ్ జనతా పార్టీ" వంటి ఉద్యమ పార్టీని స్థాపించి, "సామాజిక మీడియా ఉద్యమాల" ద్వారా విద్యా మంత్రి రాజీనామాను డిమాండ్ చేస్తూ, దేశవ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధమవుతోంది. ఇది కేవలం ఒక పరీక్ష సమస్య మాత్రమే కాదు. ఇది దీర్ఘకాలిక నిరుద్యోగం, పాలనా వైఫల్యాలపై యువత చూపిస్తున్న తీవ్ర వ్యతిరేకత కాక్రోచ్ జనతాపార్టీ రూపంలో వ్యక్తం చేస్తున్నారు.

2025-26లో ప్రపంచవ్యాప్తంగా జెనరేషన్-జెడ్ (జెన్-జెడ్) ఉద్యమాలు ఊపందుకున్నాయి. నేపాల్, ఇండోనేషియా, మొరాకో, బంగ్లాదేశ్, కెన్యా వంటి దేశాల్లో యువత రోడ్లపైకి వచ్చి అవినీతి, యువ నిరుద్యోగం, ఆర్థిక అసమానతలకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్ఓ) నివేదికల ప్రకారం, ప్రపంచ యువ నిరుద్యోగ రేటు సుమారు 12.4 శాతం వద్ద ఉంది. 260 మిలియన్ యువకులు విద్య, ఉపాధి లేదా నైపుణ్య శిక్షణ లేకుండా ఉన్నారు. మహిళలు, గ్రామీణ యువత మరింత దారుణ స్థితిలో ఉన్నారు. కృత్రిమ మేధ (ఏఐ), స్వయంచాలక వ్యవస్థల వల్ల ప్రవేశ స్థాయి ఉద్యోగాలు తగ్గుతున్నాయి. కోవిడ్ తర్వాత ఆర్థిక పునరుద్ధరణ సాధారణ ప్రజలకు చేరలేదు. ధరల పెరుగుదల, ఉపాధి లోపం యువతను నిరాశకు గురి చేస్తున్నాయి.

భారతదేశంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంది. ప్రపంచంలో అతి పెద్ద "యువ జనాభా" కలిగిన దేశం కావడం వల్ల ...ఈ జనాభా వల్ల కలిగే లాభాన్ని పొందే అవకాశం కూడా ఉంది. కానీ ... మన దేశంలో 12 సంవత్సరాల మోదీ పాలనలో ఆ అవకాశం వృధా అవుతోంది. అధికారిక గణాంకాల ప్రకారం యువత నిరుద్యోగం 10 శాతం పైనే ఉంది. స్వతంత్ర అంచనాల ప్రకారం 15 శాతం పైన చూపిస్తున్నాయి. పట్టణ యువత, మహిళల్లో ఇది మరింత ఎక్కువ. ఇంజనీర్లు, మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ), అండర్ గ్రాడ్యుయేట్లలో సగం మంది ఉద్యోగాలు లేకుండా ఉన్నారు. సాంకేతిక రంగంలో నియామకాలు నెమ్మదిగా ఉన్నాయి. కృత్రిమ మేధ (ఏఐ) వల్ల ప్రవేశ స్థాయి ఉద్యోగాలు తగ్గుతున్నాయి. మేధావుల్లో , తల్లితండ్రుల్లో కూడా తమ పిల్లల భవిష్యత్తుపై ఆందోళన తీవ్రమవుతోంది. చదువుకున్న వారు, డబ్బు ఉన్నవారు ఉద్యోగ, ఉపాధి కోసం విదేశాలకు వెళ్తున్నారు. పేదలు, మధ్యతరగతి యువత నిరాశలో దేశంలో దీనావస్థలో మగ్గిపోతున్నారు.

ఈ నేపథ్యంలో జాతీయ అర్హత సమగ్ర ప్రవేశ పరీక్ష-యూజీ 2026 పేపర్ లీక్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) ఫలితాల అస్తవ్యస్తత వంటి సంఘటనలు ఉమ్మగా గాడి తప్పాయి. లక్షలాదిమంది విద్యార్థుల సంవత్సరాల కష్టం వృధా కావడంతో వారిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. నేషనల్ స్టూడెంట్స్ యూనియన్ ఆఫ్ ఇండియా, ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ వంటి సంస్థలు, "కాక్రోచ్ జనతా పార్టీ" వంటి సామాజిక ఉద్యమాలు విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను డిమాండ్ చేస్తున్నాయి. ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా వ్యాపించే అవకాశం ఉంది. ఇది కేవలం ఒక విద్యా మంత్రి అసమర్థ సమస్య మాత్రమే కాదు. ఇది విద్యా వ్యవస్థ, జాతీయ పరీక్షల నిర్వహణలో సంస్థల (ఎన్‌టీఏ) మూకుమ్మడి వైఫల్యం. అలిగే ఈ బీజేపీ ప్రభుత్వ అసమర్థతపై యువకులు అనేక ప్రశ్నలు లేవనెత్తారు. ప్రధాన మంత్రి ఈ సమస్యలపై మాట్లాడక పోవడం యువత అసహనాన్ని మరింత పెంచుతోంది.

12 సంవత్సరాల మోదీ పాలనలో భారత దేశంలో ఆర్థిక పరిస్థితులు పూర్తిగా దిగజారాయి. రూపాయి విలువ ఎన్నడూ లేనంతగా పతనం చెందింది. ఇంకా ఎంత మేరకు దిగజారుతుందో ఊహించ లేకుండా పోయింది. ఆకాశాన్ని అంటే ధరల పెరుగుదల, పేదరికం పెరుగుదల జనాల జీవనాన్ని కష్టతరం చేశాయి. కొద్ది మంది కుబేరులు మాత్రమే సుఖంగావున్నారు. మిగిలిన జనాభా కులం, మతం పేరుతో విభేదాలు పెరిగి దేశ వ్యాప్తంగా సమాజాన్ని చీల్చేస్తున్నాయి. ఉపాధి లేకపోవడం వల్ల యువతీ,యువకులు పెళ్లిళ్లు చేసుకోవటానికి భయపడుతున్నారు. కొందరు యువ జంటలు కూడా సంతానోత్పత్తిను విధిలేక వాయిదా వేసుకుంటున్నారు. రోజు రోజుకు గ్రామీణ, పట్టణ పేదరికం పెరిగిపోతుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగాలు, ఉపాధిని సృష్టించడంలో విఫలమవుతున్నాయి." నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్‌లు, మేక్ ఇన్ ఇండియా" వంటి పథకాలు కేవలం ప్రకటనలకు మించి ఫలితాలను ఇవ్వడంలేదు. పరిజ్ఞానం కలిగిన ఉద్యోగాలు కూడా తగ్గుతు న్నాయి. అసంఘటిత రంగంలో ఉన్నవారి దుస్థితి మరింత దారుణంగా ఉంది.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కూడా ఈ సవాళ్ల మధ్య ఉంది. ప్రపంచ వృద్ధి రేటు కూడా నెమ్మదిగా ఉంది. వాణిజ్య ఉద్రిక్తతలు, ద్రవ్యోల్బణం, యుద్ధాలు,రుణభారాల సమస్యలు, ఇంధన అభద్రత అనేక దేశాలను ముట్టడిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో యువత ఎక్కువగా ప్రభావితమవుతోంది. సామాజిక మీడియా ద్వారా యువత తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తూ, ఒకరినొకరు ప్రేరేపిస్తున్నారు. బంగ్లాదేశ్‌లో 2024లో జరిగిన ఉద్యమం ఇతర దేశాలకు స్ఫూర్తి అయింది. కానీ అధికారులు ఇంకా పాత పద్ధతిలోనే ఉన్నారు. వయసు మీరిన రాజకీయ నాయకులు యువత సమస్యలను అర్థం చేసుకోవడంలో విఫలం అవుతున్నారు.

ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ప్రమాద తీవ్రత ఎక్కువగా ఉంటుంది. యువత నిరాశలో మునిగితే సామాజిక అస్థిరత పెరుగుతుంది. భారతదేశం తన జనాభా వల్ల కలిగే లాభాన్ని కోల్పోతుంది. ప్రభుత్వాలు తక్షణం చర్యలు తీసుకోవాలి. విద్యా వ్యవస్థను సంస్కరించి, పరీక్షల సమగ్రతను కాపాడాలి. ఉద్యోగాల సృష్టి, నైపుణ్యాభివృద్ధిపై నిజమైన దృష్టి సారించాలి. అసమానతలను తగ్గించి, సమాన అవకాశాలు కల్పించాలి. ధరల నియంత్రణ, ఆర్థిక స్థిరత్వం కోసం సమగ్ర విధానాలు అవసరం. ప్రధాన మంత్రి, అధికార ప్రతినిధులు యువత ఆవేదనను అర్థం చేసుకుని మాట్లాడాలి. హామీలు కాదు, నిజమైన చర్యలు కావాలి. యువత భవిష్యత్తు ప్రమాదంలో ఉంది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి అవహేళనగా , వ్యంగ్యంతో కూడిన కామెంట్స్ చేయటం కూడా వారిలో ఆగ్రహాన్ని, మొండి తనాన్ని పెంచింది. వారి ఉక్రోషం న్యాయమైనది. అయితే తన ఉద్దేశం అది కాదు అని ప్రకటించారు. అయినా ఈ ఉద్యమాన్ని ఏలా అణచివేయాలి అనేది ప్రభుత్వ లక్ష్యం కాకూడదు. ఈ సమస్యలకు పరిష్కారాలు చూపడం పాలకుల బాధ్యత. లేని పక్షంలో ఈ ఉద్యమాలు మరింత తీవ్రరూపం తీసుకుని, సామాజిక మార్పుకు దారి తీయవచ్చు. ప్రపంచం యువత గొంతుకను ఆయా దేశాల ప్రభుత్వాలు తప్పకుండా వినాలి. భారత ప్రభుత్వం ముందు ఉన్న ఈ సవాలు భారీగా ఉంది. దాన్ని ఒక అవకాశంగా మార్చాలి.

డాక్టర్.కోలాహలం రామ్ కిశోర్.
ramkishore.1504@gmail.com

# సమాజమా.. నీ నిశ్శబ్దం ఇంకెన్నాళ్ళు?



ఈ అనంతమైన భూమిపై అత్యంత ప్రమాదకరమైన ఆయుధం ఏది అని అడిగితే వెంటనే అందరికీ తుపాకులు, క్షిపణులు, లేదా అణ్వాయుధాలు గుర్తుకొస్తాయి. కానీ నిజానికి వాటన్నింటికంటే వంద రెట్లు ప్రాణాంతకమైన, సమాజాన్ని నిలువునా దహించివేసే ఒక ఆయుధం మన మధ్యే ఉంది. అదే మీ మౌనం. అవును, మీరు విన్నది నిజమే. మీ కళ్ళముందు అన్యాయం జరుగుతున్నా పెదవి విప్పకుండా, ఏమీ పట్టనట్టు కళ్ళు మూసుకుని, చెవులు మూసుకుని, మనస్సాక్షిని చంపుకుని జీవించే ఆ శూన్యమైన నిశ్శబ్దమే ఈ ఆధునిక యుగంలో అత్యంత క్రూరమైన హింస.

మనం చరిత్రను ఒకసారి నిదానంగా తిరగేసి చూద్దాం. ప్రపంచాన్ని కుదిపేసిన ప్రతి నియంతా, ప్రతి దోపిడీదారూ, సామాన్యులను పీడించిన ప్రతి అన్యాయ వ్యవస్థా దేని ఆధారంగా అంత కాలం నిలబడగలిగాయి? కేవలం సైనిక బలగం మీదో, బందూకుల మీదో కాదు. సమాజంలో మెజారిటీగా ఉన్న సామాన్య మానవుడి చేతకాని మౌనం మీద మాత్రమే అవి సింహాసనాలు వేసుకున్నాయి. మీరు అన్యాయాన్ని చూసి తలవంచుకున్న ఆ క్షణంలోనే, అధర్మానికి పట్టాభిషేకం జరుగుతుంది. ఇది నా సమస్య కాదు కదా, నాకెందుకులే అని మీరు నిట్టూర్చి పక్కకు తప్పుకున్న ప్రతిసారీ, దౌర్జన్యం మరింత బరితెగించి విందు చేసుకుంటుంది. మరి అలాంటి క్లిష్ట సమయాల్లో సామాన్యులమైన మనం ఏం చేశాం? కేవలం మిన్నకుండిపోయాం. ఏ గొడవలకు పోకుండా ప్రశాంతంగా బతకడమే గొప్ప అనుకున్నాం. కానీ ఒక్కటి ఆలోచించండి.. సమాజం తగలబడిపోతుంటే, మన ఇల్లు మాత్రం సురక్షితంగా ఉంటుందని ఎలా ఆశించగలం? ఈ నిశ్శబ్దం ఖచ్చితంగా ఒక అక్షరాలా నేరమే అవుతుంది. అసలు మౌనం అనేది మనిషిలో పుట్టుకతోనే వస్తుందా? ఖచ్చితంగా కాదు. మౌనం అనేది సహజమైన పిరికితనం నుండి పుట్టదు అది వ్యవస్థీకృతమైన అలవాటు నుండి పుడుతుంది. మన సమాజంలో చిన్నప్పటి నుంచే పిల్లల మనసుల్లో ఒక విషబీజం నాటబడుతోంది. ఇళ్లల్లో పెద్దవాళ్ళు ఎప్పుడూ ఒకటే చెబుతుంటారు. పెద్దవాళ్ళు ఏం చెప్పినా నోరెత్తకుండా వినాలి, ఎదురు ప్రశ్నలు వేయకూడదు. ఆ తర్వాత బడికి వెళ్తే పాఠశాలల్లో ఉపాధ్యాయులు నేర్పిస్తారు. నువ్వు బుద్ధిగా చదువుకుని కేవలం మంచి ర్యాంకు తెచ్చుకో, మిగతా సామాజిక విషయాలు నీకు అనవసరం. చివరకు బయటకు వస్తే ఈ సమాజం బోధిస్తుంది. సమాజంలో తలవంచి జీవించు, అనవసరంగా తల ఎత్తినవాళ్ళు తుపాకి గుండ్లకు బలవుతారు లేదా ఇబ్బందులు కొనితెచ్చుకుంటారు.

ఇలా తరం తరంగా, ఒక క్రమ పద్ధతిలో మనిషిలోని ప్రశ్నించే నైజాన్ని, తిరగబడే గొంతును ఎటువంటి శస్త్రచికిత్స లేకుండానే సమాజం విజయవంతంగా తొలగించింది. అందుకే మీరు ఈ రోజు సమాజంలో జరుగుతున్న దారుణాలను చూసి కూడా గొంతు ఎత్తలేకపోతున్నారంటే, అది మీ ఒక్కరి తప్పు మాత్రమే కాదు. అది ఈ వ్యవస్థ మీకు చేసిన అన్యాయం, మిమ్మల్ని ఒక రోబోలా మార్చేసిన పద్ధతి. కానీ, ఆ తప్పును తెలుసుకున్న తర్వాత కూడా, ఈ కుళ్ళిన వ్యవస్థను ప్రశ్నించకుండా అలాగే మౌనంగా ఉండిపోవడం మాత్రం ఖచ్చితంగా మీ తప్పే అవుతుంది. వ్యవస్థ మీ అసలైన గొంతును చిన్నప్పుడే కొట్టేసి ఉండవచ్చు, కానీ ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా మీరు ఒక కొత్త గొంతును, ప్రశ్నించే నైజాన్ని పెంచుకోకపోవడం మీ ఆత్మకు మీరు చేసుకునే ద్రోహం.

గమనించండి, మీ పక్కింటి మహిళ గృహహింసతో నరకం అనుభవిస్తూ అరుస్తున్నప్పుడు, మీరు కిటికీలు వేసుకుని చెవులు మూసుకుంటారు. అది వాళ్ళ కుటుంబ రగడ, మనకెందుకు పరాయి విషయాలు అని సరిపెట్టుకుంటారు. మీ ఊరి పొలిమేరల్లో ఉన్న దట్టమైన అడవిని, పచ్చని చెట్లను కొందరు స్వార్థపరులు నరికేస్తుంటే మీరు తలవంచుకుని వెళ్ళిపోతారు. ప్రభుత్వ అధికారులే పట్టించుకోనప్పుడు సామాన్యులమైన మనం ఏం చేయగలం? అని సమర్థించుకుంటారు. మీ పిల్లలు చదివే పాఠశాలలోనో, కళాశాలలోనో యాజమాన్యం ఫీజుల పేరుతో దోపిడీ చేస్తుంటే, అవినీతికి పాల్పడుతుంటే మీరు మౌనంగా నోరు మూసుకుని డబ్బులు కడతారు. మనకెందుకు అనవసరమైన చిక్కులు, పిల్లోడి భవిష్యత్తు పాడవుతుంది అని భయపడతారు. మౌనం సమాజాన్ని నాశనం చేస్తే, కేవలం మాట, ఆ గొంతుక మాత్రమే సమాజాన్ని బ్రతికించింది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ నాటి సామాజిక పరిస్థితుల్లో ఎంతో గంభీరంగా ప్రశ్నించారు మేమంతా ఈ దేశంలో సమానమైన మానవులుగా జీవించడానికి వీల్లేదా? అని. నాడు సమాజం ఆయనను మాట్లాడవద్దని అణచివేయాలని చూసినా, ఆయన లొంగకుండా నిలబడి మాట్లాడాడు. ఆ మాటల సముద్రమే, ఆ పోరాటమే నేడు మనమంతా రక్షణగా భావిస్తున్న భారత రాజ్యాంగమైంది. అలాగే, అల్లూరి సీతారామరాజు తెల్లదొరల సాయుధ బలగాలెదుట నిలబడి గర్జించాడు ఈ జల, జంగల్, జమీన్ మావి ఈ అడవిపై హక్కు మాది కాదా? అని. బ్రిటీష్ వారి ఆధునిక తుపాకులు ఎదురుగా ఉన్నా ఆయన వెన్ను వంచలేదు, ధైర్యంగా గొంతు విప్పాడు. మహాకవి శ్రీశ్రీ సమాజంలోని పేదరికాన్ని, కార్మికుల కష్టాలను చూసి ఆవేశంతో అరిచాడు మరో ప్రపంచం, మరో ప్రపంచం, మహాప్రస్థానం కావాలి! అని. ఎన్ని అణచివేతలు ఉన్నా ఆయన కలం ఆగిపోలేదు, ప్రజల గొంతుకై నిలిచింది. మరి ఈ రోజు మన పరిస్థితి ఏమిటి? మనకు అంబేద్కర్ ఇచ్చిన గొప్ప రాజ్యాంగం ఉంది, భావప్రకటన స్వేచ్ఛ ఉంది, ప్రపంచంతో కనెక్ట్ అవ్వడానికి సోషల్ మీడియా ఉంది, చేతిలో అధునాతన స్మార్ట్‌ఫోన్ ఉంది అన్యాయాన్ని ఎండగట్టడానికి అన్ని ఆయుధాలు మన చేతిలోనే ఉన్నాయి. కానీ మనం ఇంకా మౌనంగానే ఉన్నాం. ఆ ఒక్కరూ మీతో కలిసి మాట్లాడినప్పుడు చుట్టూ ఉన్న పది మందికి నోరు విప్పే శక్తి వస్తుంది. అలా మొదలైన ఒక చిన్న గొంతుక, క్రమంగా వందల నోళ్ళుగా, వేల నోళ్ళుగా మారి, చివరకు కోట్ల గొంతుల విప్లవ వరదగా మారి అన్యాయమైన వ్యవస్థలను సైతం కొట్టుకుపోయేలా చేస్తుంది. ఈ ప్రపంచంలో జరిగిన పెద్ద పెద్ద విప్లవాలన్నీ ఎక్కడో పుట్టలేదు ఎవరో ఒకరు, ఒకానొక నిశ్శబ్ద క్షణంలో నిజాయితీగా మాట్లాడిన ఆ మొదటి మాటతోనే మొదలయ్యాయి. మిమ్మల్ని ఒక ప్రశ్న అడగాలని ఉంది.. మీ నిజజీవితంలో ప్రస్తుతం ఏ అన్యాయం జరగడం లేదా? మీ పిల్లలు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజుల పేరుతో పీల్చివేయబడుతున్నప్పుడు మీరు కనీసం యాజమాన్యాన్ని ప్రశ్నించారా? మీరు నివసించే గ్రామంలోనో, డివిజన్ లోనో త్రాగునీరు రాక ప్రజలు అల్లాడుతుంటే స్థానిక నాయకులను అడిగారా? మీ ఇంట్లోని లేదా మీ చుట్టుపక్కల సమాజంలోని మహిళలు రాత్రి పూట రోడ్లపై సురక్షితంగా నడవలేకపోతుంటే మీరు గొంతు విప్పారా? మనకు అన్నం పెట్టే రైతులు అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యలు చేసుకుంటుంటే మీరు కేవలం పేపర్ లో వార్త చూసి బాధపడ్డారా, లేక వారి కోసం ఏదైనా ఒక చిన్న నిరసన స్వరాన్ని వినిపించారా? కేవలం మూలన కూర్చుని ఏడవడం వల్ల ఉపయోగం లేదు ఇక్కడ కావాల్సింది ధైర్యంగా మాట్లాడటం. అన్యాయాన్ని తీవ్రంగా నిరసించడం, హక్కుల కోసం పోరాడటం చాలా ముఖ్యం. మీ జీవితంలో మీరు పాటించిన మౌనం ఒక్కసారైనా సమాజంలో జరుగుతున్న ఏదైనా ఒక అన్యాయాన్ని ఆపగలిగిందా? ఖచ్చితంగా లేదు. మౌనం ఎప్పుడూ అన్యాయాన్ని ఆపదు సరే కదా, దానికి పరోక్షంగా సహకరిస్తుంది. మీరు సమాజంలో జరుగుతున్న అన్యాయాలను చూస్తూ మాట్లాడకుండా మౌనంగా ఉండిపోయే ప్రతి రోజూ, మీలోని ఆ చైతన్యవంతమైన మొలక క్రమంగా చనిపోతూనే ఉంటుంది. అదే మీరు భయాన్ని వీడి మాట్లాడిన ప్రతి రోజూ ఆ మొలక ఒక మహా వృక్షంలా బలంగా మారుతుంది. గుర్తుంచుకోండి, సమాజంలో మౌనంగా ఉండటం అనేది మీ వ్యక్తిగత ఎంపిక కావచ్చు, కానీ మీ ఆ మౌనమే రేపు అన్యాయస్థులకు, అవినీతిపరులకు మీరు రాసిచ్చే బహిరంగ అనుమతిపత్రం (లైసెన్స్) అవుతుంది. కాబట్టి ఇకనైనా నిశ్శబ్దాన్ని వీడండి. మీ చుట్టూ జరుగుతున్న అక్రమాలపై మాట్లాడండి కఠినంగా, స్పష్టంగా, నిర్భయంగా మాట్లాడండి. ఎందుకంటే. మౌనం దౌర్జన్యానికి బలమైన ఆహారం మీ గొంతే దానికి ప్రాణాంతకమైన విషం. ఈ వ్యాసం కేవలం చదివి వదిలేయడానికి కాదు, ప్రతి తెలుగు మనిషి గుండెను, హృదయాన్ని తట్టి లేపి, ఒక నూతన చైతన్య స్వరాన్ని సమాజంలో నింపడానికి రాయబడింది. మనమంతా కలిసి మన గొంతుకలను వినిపిద్దాం, మెరుగైన సమాజాన్ని నిర్మిద్దాం.

డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

# నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలి

- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

**గద్వాల నడిగడ్డ, జూన్ 9 (జనం సాక్షి) :** జిల్లాలో నేరాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతూ, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మంత్లీ క్రైమ్ రివ్యూ సమావేశంలో జిల్లా ఎస్పీ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పనితీరు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేరాల నియంత్రణ చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, ప్రతి కేసులో క్వాలిటీ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని, నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీగా దర్యాప్తు చేయాలని సూచించారు. బాధితులకు న్యాయం చేయడం పోలీసుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. అదేవిధంగా సి.సి.టి.ఎన్.ఎస్. (2.0) వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రతి కేసును సకాలంలో నమోదు చేసి, సంబంధిత వివరాలను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయడం ద్వారా దర్యాప్తు మరింత వేగవంతం అవుతుందని



తెలిపారు. సి.సి.టి.ఎన్.ఎస్.లో అందుబాటులో ఉన్న అన్ని టూల్స్, ఫీచర్లను పూర్తిస్థాయిలో వినియోగించడం ద్వారా పారదర్శకత, సమాచార సమన్వయం, సేవల నాణ్యత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలు, ఆర్థిక నేరాలు, ఆన్లైన్ మోసాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని, ముఖ్యంగా సైబర్ నేరాల నివారణ కోసం గ్రామ స్థాయి వరకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అక్రమ గంజాయి రవాణా, మట్కా, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల వ్యవస్థను విస్తరించి, అవి నిరంతరం పనిచేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్స్‌ను గుర్తించి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ తగిన నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరుస్తూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ స్థాయి పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని, విలేజ్ పోలీస్ అధికారులు గ్రామాల్లో తరచూ పర్యటిస్తూ ప్రజలతో మమేకమై సామాజిక సమస్యలను తెలుసుకుని ముందస్తు సమాచార సేకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ కె. శంకర్, గద్వాల డీఎస్పీ వై. మొగిలయ్య, సర్కిల్ ఇన్స్పెక్టర్లు, జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఎస్సైలు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## ఈవీఎం గోదాంను తనిఖీ చేసిన కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 9 (జనం సాక్షి) :** నారాయణపేటలో మంగళవారం ఈవీఎం గోదాంను జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈవీఎం గోదాంను గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో త్రైమాసిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాం సీల్‌ను పరిశీలించారు. గోదాంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, అగ్నిప్రమా దాల నివారణ కోసం ఏర్పా టు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఇతర భద్రతా పరిక రాలను తనిఖీ చేశారు. అత్యవసర పరిస్థితులు తలెత్తిన సందర్భంలో అనుసరించాల్సిన భద్రతా చర్యలపై సంబంధిత సిబ్బందికి సూచనలు జారీ చేశారు. గోదాం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబ స్తు, భద్రతా రిజిస్టర్లు,సంద ర్శకుల నమోదు పుస్తకాలను పరిశీలించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి అలసత్వం ప్రదర్శించరాదని భద్రతా సిబ్బందిని ఆదేశించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాలు, మార్గదర్శకాల మేరకు ఈవీఎంలు, వీవీ ప్యాట్ల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియ లో పారదర్శకతను నిర్ధా రించేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీ ఎం గోదాం తనిఖీలు నిర్వహి స్తున్నామని పేర్కొన్నారు. ఈవీఎంల భద్రత విషయం లో ఎటువంటి రాజీ లేకుండా 24 గంటలు భద్రతా ప్రమా ణాలను పకడ్బందీగా అమ లు చేస్తున్నామని అన్నారు.గోదాంలోని భద్రతా ఏర్పాట్ల ను నిరంతరం పర్యవేక్షిస్తు న్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను,ఎలక్షన్ సెల్ సూపరింటెం డెంట్ జయ సుధ, తహసీల్దార్ అమరేంద్ర కృష్ణ, మున్సిపల్ కమిషనర్ శంకర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతిని ధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## రాజకీయ ప్రయోజనాల కోసమే ఫోన్ ట్యాపింగ్

- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి
- మాజి మేయర్ తోటకూర అజయ్ యాదవ్ డిమాండ్



**బోడుప్పల్, జూన్ 9 (జనంసాక్షి) :** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ మంగళవారం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఎదుట విచారణకు హాజరయ్యారు. గత తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో తన ఫోన్ నంబర్ ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించిన నేపథ్యంలో ఆయనను విచారించినట్లు సమాచారం. విచారణ అనంతరం మీడియాతో మాట్లాడిన అజయ్ యాదవ్ 2023 అక్టోబర్ నెలలో తన ఫోన్ నంబర్ ట్యాప్ చేసినట్లు సిట్ అధికారులు తనకు వివరించినట్లు తెలిపారు. ఆ సమయంలో తన తండ్రి తోటకూర వజ్రేష్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎన్నికల బరిలో ఉండటంతో రాజకీయ ప్రయోజనాల కోసం తన ఫోన్‌ను నిఘాలో పెట్టినట్లు అనుమానాలు వ్యక్తం చేశారు.ప్రజాస్వామ్య వ్యవస్థలో రాజకీయ ప్రత్యర్థులను ఎదుర్కొనేందుకు ప్రజల తీర్పును గౌరవించాల్సి ఉంటుందని కానీ కొందరు అధికార దుర్వినియోగానికి పాల్పడి నిఘా వ్యవస్థలను రాజకీయ అవసరాలకు ఉపయోగించుకున్నారని ఆయన ఆరోపించారు.గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు అక్రమ మార్గాలను ఆశ్రయించిందని విమర్శించారు.తన తండ్రి విజయం దిశగా సాగుతుండటాన్ని తట్టుకోలేక అప్పటి అధికార వర్గాలు కుట్రపూరితంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డాయని ఆరోపించిన అజయ్ యాదవ్,ఈ వ్యవహారంలో పూర్తి స్థాయి దర్యాప్తు జరిపి వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలని కోరారు.ప్రజాస్వామ్యంలో రాజకీయ పోరాటం ప్రజల విశ్వాసం,మద్దతుతో జరగాలని,ఫోన్ ట్యాపింగ్‌లు,నిఘా వ్యవస్థల దుర్వినియోగం వంటి చర్యలకు ఎలాంటి స్థానం లేదని స్పష్టం చేశారు.ఈ కేసులో ప్రమేయం ఉన్న అధికారులు,రాజకీయ నాయకులు ఎవరైనా వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని సిట్‌ను డిమాండ్ చేశారు.

## విగ్రహాల ఏర్పాటును అడ్డుకోవడం దుర్మార్గం

- కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ మండిపాటు



**మిడ్జిల్, జూన్ 9 (జనం సాక్షి) :** మండల కేంద్రంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు మన్యం వెంకట్‌రెడ్డి విగ్రహావిష్కరణకు శంకుస్థాపన చేసేందుకు మంగళవారం ఏర్పాట్లు చేయగా, అధికారులు అడ్డుకోవడంతో బీఆర్ఎస్ నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుల రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే విగ్రహ ఏర్పాటుకు అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి సాయన్న, తహసీల్దార్ రాఘవేందర్‌రెడ్డి, ఎస్సై శ్రీనివాసులు, ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి శంకుస్థాపన స్థలానికి చేరుకుని అనుమతులు లేవని చెప్పడంతో బీఆర్ఎస్ శ్రేణులు అధికారులను ప్రశ్నించాయి. గ్రామంలో ఇప్పటికే పలు విగ్రహాలు ఏర్పాటు చేసినప్పుడు లేని నిబంధనలు ఇప్పుడు మాత్రమే గుర్తుకు రావడం వెనుక అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లు ఉన్నాయని ఆరోపించారు. ఎమ్మెల్యే అనిరుద్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు ప్రజాభిమానాన్ని చూసి భయపడుతున్నారని, అందుకే వెంకట్‌రెడ్డి విగ్రహ ఏర్పాటును అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. గ్రామాభివృద్ధికి కృషి చేసిన నాయకుల విగ్రహాలను సైతం సహించలేని స్థితికి కాంగ్రెస్ నాయకులు దిగజారారని మండిపడ్డారు. ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. అనంతరం మహాత్మాగాంధీ విగ్రహం వద్ద రోడ్డుపై ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. అధికారులు నచ్చజెప్పడంతో అనుమతులు వచ్చిన తర్వాతే శంకుస్థాపన చేపడతామని ప్రకటించారు. అలాగే వెంకట్‌రెడ్డి విగ్రహంతో పాటు మాజీ సర్పంచ్‌లు ఎలుగొండ శివకుమార్‌రెడ్డి, కమ్మరి సాయిబాబా విగ్రహాల ఏర్పాటుకు కూడా అనుమతులు కోరుతూ దరఖాస్తులు సమర్పించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కుచూరి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకులు మన్యం బాల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు పాండు, మాజీ ఎంపీపీ సుదర్శన్, మాజీ జెడ్పీటీసీ శశిరేఖ బాలు, గంజి కృష్ణ, నారాయణ్‌రెడ్డి, జంగారెడ్డి, జగన్ గౌడ్, శేఖర్, కరుణాకర్‌రెడ్డి, రాఘవేందర్, భాస్కర్ నాయక్, తిరుపతినాయక్, సురేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రీని వేగవంతం చేయాలి

- రైతుల శ్రేయస్సుకు చిత్తశుద్ధితో పనిచేయాలి
- నకిలీ విత్తనాలు అమ్మే డీలర్లపై కఠిన చర్యలు
- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల నడిగడ్డ, జూన్ 9 (జనం సాక్షి) :** రైతుల శ్రేయస్సుకు పెస్టిసైడ్స్ డీలర్లు కట్టుబడి ఉండాలని, వ్యవసాయశాఖ అధికారులు ఫార్మర్ రిజిస్ట్రీని వేగవంతం చేసేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో జిల్లాలోని పెస్టిసైడ్ దుకాణాల డీలర్లు, సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశమై మాట్లాడారు. ప్రభుత్వం వ్యవసాయ శాఖకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని, డీలర్లు, అధికారుల కారణంగా రైతులకు ఏ చిన్న సమస్య వచ్చినా సహించేది లేదన్నారు. ఫెయిల్ అయిన, విడిగా ఉండే, గడువు ముగిసిన విత్తనాలను విక్రయించకూడదన్నారు. ప్రతి పెస్టిసైడ్ దుకాణాల వద్ద సంబంధిత డీలర్లు స్టాక్, ధరల పట్టిక, తదితర వివరాలను విధిగా ప్రదర్శించాలన్నారు. విత్తనాలు, ఎరువులు అమ్మేందుకు కొత్తగా లైసెన్సు తీసుకునేవారు, రెన్యువల్ చేసుకోవాల్సిన డీలర్లు నిబంధనలను పాటించాలన్నారు. యూరియా కొరత, కాంప్లెక్స్ ఎరువుల ధరలు పెరిగినందున అన్నదాతలు నానో యూరియాపై దృష్టి సారించేలా సహకరించాలన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు తరచూ పెస్టిసైడ్స్ దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని, నిబంధనలు పాటించని సంబంధిత దుకాణాల డీలర్ల పై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వ్యవసాయ శాఖ అధికారులతో ప్రత్యేకంగా సమావేశమై మాట్లాడారు. ఫార్మర్ రిజిస్ట్రీలో జోగులాంబ గద్వాల జిల్లా ప్రస్తుతం 68 శాతంతో రాష్ట్రంలో 28వ స్థానంలో ఉందని, వంద శాతం పూర్తి చేసేందుకు ఏఈవోలు నిబద్ధతతో పనిచేయాలన్నారు. మండల వ్యవసాయ శాఖ అధికారులు కూడా ప్రత్యేక చొరవ తీసుకొని ఫార్మర్ రిజిస్ట్రీ వేగవంతం అయ్యేందుకు రెండు రోజులకోసారి తమ పరిధిలోని ఏఈవో లపై పర్యవేక్షణ చేస్తుండాలన్నారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని, వారికి అవసరమైన సలహాలు, సూచనలు ఇస్తూ అన్నదాతల సంక్షేమానికి కృషి చేయాలన్నారు. పిఎండిడికేవై కు



జోగులాంబ గద్వాల జిల్లా ఎంపికవడంతో వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాల్లో రైతులు సాంకేతికతను వినియోగిస్తూ ఆర్థికంగా ఎదిగేలా చూడాలన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ పలువురు ఏఈఓలతో వారి క్లస్టర్ పరిధిలోని గ్రామాల రైతుల ఫార్మర్ రిజిస్ట్రీ గురించి మాట్లాడారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వీరప్ప, అదనపు ఎస్పీ శంకర్, ఆత్మ డిప్యూటీ పిడి జగ్గు నాయక్, ఏడిఏ సంగీతలక్ష్మి, ఆయా మండలాల వ్యవసాయ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యా, ఉపాధ్యాయ రంగ సమస్యలను పరిష్కరించండి

- ఎస్టీయూ అధ్యక్షులు శ్రీధర్ రావు




**నాగర్‌కర్నూల్, జూన్ 9 (జనంసాక్షి) :** నాగర్‌కర్నూల్ ఎస్‌టియు ఎనభై యవ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నాగర్ కర్నూలు జిల్లా అధ్యక్షులు కొత్త శ్రీధర్ రావు సంఘ కార్యాలయంలో జెండా విష్కరణ చేసినారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేట్ టీచర్స్ యూనియన్(ఎస్టీయూ)తన 79 సంవత్సరాల ప్రస్థానాన్ని పూర్తి చేసుకుందని, ఈ సంఘం 1947 జూన్ లో స్థాపించబడి ఉపాధ్యాయుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం మరియు విద్యా అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తోందని అన్నారు. ఉపాధ్యాయుల వేతనాలు, పదోన్నతులు, సేవా భద్రత వంటి అంశాలపై అలుపెరగని పోరాటాలు చేసిందని ప్రభుత్వ పాఠశాలల బలోపేతం మరియు నాణ్యమైన విద్య అందించేందుకు కృషి చేస్తుందని, విద్యా రంగంలో వచ్చిన అనేక మార్పులు, సంస్కరణలలో ఎస్టీయూ కీలక పాత్ర పోషించింది. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారాల కోసం కృషి చేసిందన్నారు. ఇంకాగ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి మరియు విద్యార్థుల శ్రేయస్సుకు సేవలు అందించింది. 80 సంవత్సరాల చరిత్రలో అనేక మంది నాయకులు, కార్యకర్తలు సంఘాన్ని బలోపేతం చేశారు.భవిష్యత్తులో కూడా ఉపాధ్యాయ సంక్షేమం, విద్యా నాణ్యత పెంపు, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం లక్ష్యాలుగా కొనసాగుతామని పేర్కొన్నారు. 40 రోజుల కిందట ముఖ్యమంత్రి గారు ఇచ్చిన తక్షణ హామీలలో పీఆర్సీ గానీ, హెల్త్ కార్డులు గానీ, సీపీ యస్ విషయం గానీ, అమలు కాకపోగా 16 వేల ప్రాథమిక బడులలో 4వేల వరకు ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించాలనడం, క్షేత్రస్థాయిలో పబ్లిక్ స్కూల్స్‌కు తగిన ఏర్పాట్లు, వసతులు కల్పించకుండానే అడ్మిషన్లు అయ్యే సమయంలో ప్రారంభిస్తామనడం సరి కాదని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధుసూదన్ రెడ్డి, పూర్వ అధ్యక్షులు మురళి, ఎస్ టి యు రాష్ట్ర నాయకులు రమేష్, అనిల్ కుమార్ రెడ్డి, ప్రభాకర్, జిల్లా మండల ప్రతినిధులు ఎ. హన్మంత రెడ్డి, మద్దిలేటి, ఈశ్వర్, కర్ణాకర్ రెడ్డి, బాలస్వామి, హన్మంతు, నర్సింహ్మ, సురేష్ బాబు, సత్యనారాయణ, వెంకటస్వామి, రాజన్ గౌడ్, నారాయణ, రాజేష్, లక్ష్మి నరసింహ రెడ్డి మొదలైన ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

## గర్భిణీల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



**ఫరూక్‌నగర్, జూన్ 9 (జనంసాక్షి) :** రంగారెడ్డి జిల్లా ఫరూఖ్ నగర్ మండలం చించోడులో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ప్రోగ్రాం మన భారతదేశంలో ప్రారంభించి ఈరోజుకు 10 సంవత్సరముల నిండిన సందర్భంగా,చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ స్రవంతి ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ప్రోగ్రాం కు వచ్చిన గర్భవతులకు ప్రతినెల 9వ తారీకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం లో, గర్భవతులకు అందించే సేవల గురించి వివరంగా తెలియజేశారు. ప్రతి నెల 9వ తేదీన ప్రభుత్వాసుపత్రిలో గర్భిణీలకు అన్ని రకాల పరీక్షలు ఫ్రీ ఆ సేవలు అందిస్తున్నామని తెలియజేశారు. పి హెచ్ సి యు అందించే సేవలు హైరిస్క్ గర్భిణీల వ్యక్తిగత పర్యవేక్షణ గురించి , సురక్షిత ప్రసవం యొక్క పాలో అప్ గురించి, గర్భిణీలకు 102 వాహనం ద్వారా అందే ఉచిత రవాణా సౌకర్యం గురించి, సురక్షిత ప్రసవం కోసం సమీప ఫస్ట్ రిఫరల్ యూనిట్ గురించి, అధిక ప్రమాద గర్భధారణల గుర్తింపు గురించి, ప్రభుత్వాసుపత్రుల కాన్పుల గురించి, ప్రభుత్వాసుపత్రిలో ఇచ్చే వ్యాక్సిన్ ల గురించి, గర్భిణీ స్త్రీలకు అందించే ఐ ఎఫ్ ఏ మాత్రల గురించి,ప్రత్యేక గర్భిణీ సేవలను ఉచితంగా అందిస్తున్నామని డాక్టర్ స్రవంతి గర్భవతులకు తెలియజేశారు. తదుపరి హెల్త్ ఎడ్యుకేటర్ జె శ్రీనివాసులు మాట్లాడుతూ స్త్రీలు గర్భం దాల్చిన మూడు నెలల్లోపు ఏ.ఎన్.ఎమ్ ల దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి అని, గర్భవతులు రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారందరికీ వెంటనే మూత్ర పరీక్షలు ,రక్తం పరీక్షలు, బీ.పీ పరీక్షలు, థైరాయిడ్ పరీక్ష మరియు షుగర్ పరీక్షలు నిర్వహించి వారికి తగిన చికిత్స ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా అందిస్తారని జె శ్రీనివాసులు తెలియజేశారు. గర్భవతులు అందరూ కూడా మంచి పోషకాహారము అనగా తాజా ఆకుకూరలు,తాజా కూరగాయలు, ఉడకబెట్టిన గుడ్లు, తాజా పండ్లు, పాలు ఆహారంలో భాగంగా తీసుకోవాలని జె.శ్రీనివాసులు చెప్పారు. ప్రతి గర్భిణి స్త్రీ ప్రతినెల తప్పకుండా చెకప్ లు చేయించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి వైద్య అధికారి డాక్టర్ సంధ్య, హెల్త్ సూపర్వైజర్ శ్రీ రామ, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, డీ.ఈ.వో విజయ, ఏ.ఎన్.ఎమ్.లు మధువాణి పాల్గొన్నారు.

# ఓటు హక్కు పరిరక్షణలో బీఎల్ఏల పాత్ర కీలకం

**తాండూరు, జూన్ 9 (జనంసాక్షి) :** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సర్ కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం తాండూరు పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్లు (బిఎల్ ఎ)ల కోసం ప్రత్యేక శిక్షణ శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సర్ రాష్ట్ర కన్వీనర్, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి , డీసీసీ అధ్యక్షుడు ధారసింగ్, టిపిసిసి నియమించిన ప్రత్యేక ట్రైనర్ వెంకట రమణ, సర్ నియోజకవర్గ కన్వీనర్ పురుషోత్తం రావు, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ బాల్ రెడ్డి సర్ విధివిధానాలు, ఓటరు జాబితా, సవరణ ప్రక్రియ, బిఎల్‌ఎల బాధ్యతలు మరియు చేపట్టాల్సిన కార్యాచరణపై సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎంఆర్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం.సార్ ప్రక్రియ ప్రజాస్వామ్యంకు ముప్పు. 1951–2004 వరకు దాదాపు 8 సార్లు ఓటరు విశ్లేషణ జరిగింది.కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కూడ సర్ ప్రక్రియ జరిగింది, కానీ ఈ సారి జరిగినట్టుగా ఎప్పుడు జరగలేదు.బీజేపీ ప్రభుత్వం చెబుతున్నట్లు సర్ ప్రక్రియ అనేది ప్రజాస్వామ్యం బలపడేట్లు జరగడం లేదు, ఈ సారి జరిగే సర్ ప్రక్రియ బీజేపీ ప్రభుత్వం కనుసైగలో ప్రజాస్వామ్యంకు ముప్పు తేచ్చే విధంగా




కొనసాగుతుంది.సర్ ప్రక్రియలో ముఖ్యంగా నకిలీ ఓట్లు, డబుల్ ఓట్లు తొలగించడం జరగాలి, కానీ ఇప్పటికే సర్ ప్రక్రియ జరిగిన బీహార్, పశ్చిమ బెంగాల్ తో పాటు పలు రాష్ట్రాలను మనం గమనిస్తే అక్కడ నకిలీ ఓట్లు, డబుల్ ఓట్లు తొలగించడం ప్రక్కన పెడితే బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించడం పనిగా పెట్టుకున్నారు.రాజ్యాంగం బద్దంగా కేంద్రం ఎన్నికల సంఘం పరివేక్షణలో జరిగే సర్ ప్రక్రియ బీజేపీ ప్రభుత్వం కనుసైగలో జరుగుతుంది కావున, మీరు (బిఎల్ఎ)/లు మీము (ప్రజాప్రతినిధులం) దానికి అడ్డు కట్టవేయడానికీ సిద్దంగా ఉండాలని పిలుపునిచ్చారు .కాబట్టి ఈ నెల జూన్ 25 నుండి జూలై 24 వరకు బిఎల్ ఓ లు ఇంటింటికి [illegible] ఓటర్ల వివరాలు స్వీకరిస్తారు.ఈ నెల రోజుల వ్యవది అనేది మనకి చాల ముఖ్యమైనది. ఈ సమయంలో మన పార్టీ తరుపున నియమించిన బిఎల్ ఎ లు వారితో కలిసి పని చేయాల్సిన అవసరం ఉంటుంది.మీ పై పూర్తి నమ్మకం ఉంచి పార్టీ బిఎల్‌ఎలు గా మీకు అవకాశం కల్పించింది, కావున ఓటరు జాబితా పరిశీలన డూప్లికేట్ ఓట్ల గుర్తింపు, అర్హులైన ఓటర్ల నమోదు, చిరునామా మార్పు అనేది పూర్తిగా పార్టీ పరంగా మీరు భాద్యత తీసుకోవాలన్నారు.సార్ ప్రక్రియపై ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా మీకు పూర్తి అవగాహనా వచ్చిందని నేను బావిస్తున్నాను ఇక్కడ నేర్చుకున్న ప్రతి అంశం మీరు ఓటర్లకు తేలియపర్చాలని సూచించారు. గ్రామంలో చర్చ జరగాలి, సార్ ప్రక్రియ కు అవసరమైన డాక్యుమెంట్స్, పత్రాలు సిద్ధం చేయాలి. అవసరం ఉన్న సందర్భంలో ఆన్ లైన్ లో కూడ అప్లోడ్ చేయండి సార్ ప్రక్రియలో బిఎస్ ఎలు కేవలం ఫోటోలకు పరిమితం కాకుండా పనిలో నిమ్నగం అవ్వాలని సూచించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని 269 బూత్‌ల బిఎల్ ఎలు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, మున్సిపల్ మరియు మార్కెట్ కమిటీ ప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉద్యమంలో కంచర్ల బద్రి పాత్ర అభినందనీయం



**ముషీరాబాద్, జూన్ 9 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రం కోసం విద్యార్థి ఉద్యమంలో చురుకుగా పాల్గొని, కేసులు, జైలు జీవితాన్ని సైతం అనుభవించిన కంచర్ల బద్రి నేటికి తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు సంక్షేమం కొరకై అహర్నిశలు కృషి చేయడం అభినందనీయమని టి యు జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల ప్రఫుల్ రామిరెడ్డి అన్నారు. ఈ వేరకు మంగళవారం టియు జెఎసి కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుల ఆధ్వర్యంలో టియు జెఎసి రాష్ట్ర అధికార ప్రతినిధి కంచర్ల బద్రి జన్మదిన వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల ప్రఫుల్ రామిరెడ్డి మాట్లాడుతూ.. నేటికీ తెలంగాణ అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం, పీడిత ప్రజల కొరకై విద్యార్థి ఉద్యమాలు, సామాజిక ఉద్యమాలకు బద్రి నాయకత్వం వహించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా కంచర్ల బద్రి మాట్లాడుతూ తన జన్మదిన వేడుకలు నిర్వహించిన టియుజెసి రాష్ట్ర నాయకత్వానికి ఉద్యమ సహచర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో టీయూజేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రన్న ప్రసాద్, రాష్ట్ర నాయకులు లక్ష్మక్క, ఇందిరక్క, కాంపల్లి సాయిలు, వెంకన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
10 జూన్ 2026

# ఎత్తిపోతల పథకాల భూ సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలి

- నెట్టెంపాడు భూ సేకరణ 45 రోజుల్లోగా పూర్తవ్వాలి
- సమీక్ష సమావేశంలో ఆర్ అండ్ ఆర్ కమిషనర్, కలెక్టర్ ఆదేశాలు



**గద్వాల నడిగడ్డ, జూన్ 9 (జనం సాక్షి) :** జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా వివిధ ప్యాకేజీల పరిధిలో సేకరించాల్సిన 534 ఎకరాలలో ఎలాంటి ఇబ్బందులు లేని భూ సేకరణ ప్రక్రియను ప్రభుత్వ ఆదేశాల మేరకు 45 రోజుల్లోగా పూర్తి చేయాలని ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు అన్నారు. జిల్లాలోని నెట్టెంపాడు, గట్టు ఎత్తిపోతల పథకాలతో పాటు మల్లమ్మ కుంట రిజర్వాయర్ కు అవసరమైన భూ సేకరణ పై మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో కమిషనర్ తో పాటు జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ప్రాజెక్టులపై సమీక్ష చేసేందుకు ఇటీవల పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి గద్వాల జిల్లా పెండింగ్ ప్రాజెక్టులపై మాట్లాడారన్నారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలో భూ సేకరణ ఆలస్యం కావడంపై ముఖ్యమంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారని, ఏమైనా సమస్యలు ఉంటే పరిష్కరించి ముందుకెళ్లాల్సిందిగా ఆదేశించారన్నారు. గట్టు ఎత్తిపోతల పథకంకు సంబంధించి 462 ఎకరాలను, ఆర్డీఎస్ పరిధిలోని తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకంలో భాగంగా ఫేజ్2 కింద నిర్మిస్తున్న మల్లమ్మ కుంట రిజర్వాయర్ కు 567 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభమై చాలా ఏళ్లు కావడంతో భూసేకరణ విషయంలో దీనికి మొదటి ప్రాధాన్యత ఇస్తూ ముందుకెళ్లాలన్నారు. నెట్టెంపాడు పరిధిలో మొత్తం 534 ఎకరాల్లో కోర్టు కేసులు, ఇతర సమస్యలు లేని సుమారు 220 ఎకరాలకు ఈనెల 15వ తేదీలోగా ప్రిలిమినరీ డిక్లరేషన్ ఇవ్వాలన్నారు. ఆయా ప్రాజెక్టుల పరిధిలో భూసేకరణ పూర్తయితేనే ఎత్తిపోతల పథకాల పనులను సకాలంలో పూర్తిచేసి సంబంధిత ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించేందుకు వీలుంటుందన్నారు. జిల్లాలోని వివిధ రిజర్వాయర్లలో ముంపుకు గురైన గ్రామాల ప్రజలకు పునరావాస కేంద్రాలలో ఆవాసం కల్పించినందున అక్కడ వారికి కల్పిస్తున్న కనీస మౌలిక వసతులలో పెండింగ్ లో ఉన్న పనులను పూర్తిచేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా పథకాలకు సంబంధించి వివిధ మండలాల పరిధిలో సంబంధిత గ్రామాల్లో సేకరించాల్సిన భూ సేకరణ పై అధికారులతో క్షుణ్ణంగా మాట్లాడారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ జిల్లాలోని ఆయా ఎత్తిపోతల పథకాలకు అవసరమైన భూ సేకరణ విషయంలో ఎవరైనా రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైతే ప్రభుత్వ అవసరాలు, ప్రాజెక్టుల ఆవశ్యకతను గురించి వారికి వివరించి ఒప్పించాలన్నారు. రెవిన్యూ, సర్వే, ఇరిగేషన్ శాఖల అధికారులు ప్రత్యేక టీములుగా ఏర్పడి భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఇరిగేషన్ శాఖ సిఈ రహీముద్దీన్, సర్వే ఏడి నూకరాజు, కలెక్టరేట్ ఏవో భూపాల్ రెడ్డి, వివిధ మండలాల తహసిల్దార్లు, నీటి పారుదల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు



**మల్దకల్, జూన్ 9 (జనంసాక్షి) :** మండల పరిధిలోని నేతువానిపల్లి గ్రామంలో మంగళవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో సర్పంచు అధ్యక్షతన గ్రామ స్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య గా జిల్లా బాలల సంరక్షణ ప్రతినిధి ప్రకాష్ హాజరై మాట్లాడుతూ బాలల పరిరక్షణ కమిటీ అనేది జిల్లాలో కొంత మంది వ్యక్తులతో ఏర్పడే బృందం బాలలపై ఏవిధమైన వేధింపులు,అకృత్యాలు, హింస జరగకుండా ఉండటంతో పాటు పిల్లలంతా ఆనందంగా ఉండేలా మార్చడం ఈ కమిటీ ఉద్దేశం. బాల్యం పిల్లల హక్కు అని వారందరూ కూడా స్వేచ్ఛయుత వాతావరణంలో పెరగాలన్నారు,బాల్య వివాహాలు,బాల కార్మికులు బాలల పై జరిగే శారీరక,మానసికలైంగిక వేదింపులు నుండి రక్షణకై చైత్యనం అవ్వాలని ఇట్టి సమాచారాన్ని 1098 కాల్ చేసి సమాచారం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ ప్రతినిధి ప్రకాష్ ,సర్పంచ్ పద్మమ్మ , వెంకటేష్ ,పంచాయతీ కార్యదర్శి నరేష్,ఉప సర్పంచ్ ముని,స్కూల్ హెడ్ హెడ్మాస్టర్ నాగరాజ్, మహిళా సంఘం అధ్యక్షురాలు శారదమ్మ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# వాహనాలకు లోడింగ్ అన్లోడింగ్ త్వరితగతిన పూర్తి చేయాలి

- రైస్‌మిల్ యజమానులను ఆదేశించిన కలెక్టర్ ఆదర్శ్ సురభి



**శ్రీరంగాపూర్, జూన్ 9 (జనం సాక్షి) :** గోదాములు, మిల్లుల వద్ద వరి ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ శ్రీరంగాపురం మండలం పరిధిలోని లక్ష్మి వారహి ఇండస్ట్రీ, పెబ్బేరు పరిధిలో రాధాకృష్ణ ఇండస్ట్రీస్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా మిల్లుల గోదాముల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గోదాములు, మిల్లుల వద్ద వరి ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లుల్లో వేగంగా దించుకోవాలని స్పష్టం చేశారు. లారీలలో ఉన్న ధాన్యం పై టార్పాలిన్లు కప్పి ఉంచాలన్నారు. మిల్లుల వద్ద లారీలను ఎక్కువ సమయం వేచి ఉంచకుండా తగ్గించేందుకు గాను హమాలీల (కార్మికుల) సంఖ్యను పెంచుకోవాలని మిల్లర్లకు చెప్పారు. మిల్లుకు వచ్చిన ధాన్యం లారీలను ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేస్తూ రోజువారీ అన్లోడ్ సామర్థ్యాన్ని పెంచాలని, ఎక్కడా లారీలు ఎక్కువ సమయం వేచి ఉండకుండా చూడాలని అధికారులను, మిల్లర్లను ఆదేశించారు. ఇంకా ధాన్యం నిల్వ చేయడానికి గోదాములను సిద్ధం చేయాలని పౌర సరఫరాల అధికారికి సూచించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, శ్రీరంగాపూర్ తాసిల్దార్ వరలక్ష్మి రెవెన్యూ సిబ్బంది , తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# అసంపూర్తి రోడ్డును వెంటనే పూర్తి చేయాలి




**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 9 (జనం సాక్షి) :** నారాయణపేట నియోజకవర్గం లోని అప్పక్ పల్లి కోటకొండ,కోయిల్ కొండ అసంపూర్తి రోదును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేపడుతున్నట్లు సీపీఐ ఎం ఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము,డివిజన్ కార్యదర్శి కాశినాథ్ తెలిపారు. మంగళవారం నారాయణపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతునారాయణపేట జిల్లా కేంద్రం నుండి మహబూబ్నగర్ జిల్లా కేంద్రాని కలిపే ప్రధానమైన రెండు వరుసల రోడ్డును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంద న్నారు. కొడంగల్ నియోజక వర్గం రోడ్డు పనులన్నీ వెంట వెంటనే పూర్తవుతాయి. కానీ నారాయణపేట నియోజక వర్గ రోడ్లు ఎందుకు అసంపూ ర్తిగా మిగులుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. నారాయణపేట కొడంగల్ రెండు నియోజకవర్గాలు రెండు కళ్ళలాగా నాకు ఉంటాయి అని పిసిసి అధ్యక్ష హోదాలో రేవంత్ రెడ్డి ఎన్నికల సభలో మాట్లాడారనీ గుర్తు చేశారు. కొడంగల్ రోడ్లు మాత్రమే పూర్తి అవుతున్నాయి. కొడంగల్ నియోజకవర్గంలో పని చేస్తే బిల్లులు తొందరగా వస్తాయని కాంట్రాక్టర్లు అక్కడి రోడ్లనే పూర్తి చేస్తున్నారు. నారాయణపేట నియోజకవర్గ రోడ్లను కాంట్రాక్టర్లు పట్టించుకోవడం లేదన్నారు. అసంపూర్తిగా పనులు చేశారు. అప్పకుపల్లి నుండి కోటకొండ మధ్యలో నాలుగు కిలోమీటర్లు, కోటకొండ గ్రామంలో రెండు కిలోమీటర్లు, కోటకొండ కోయిలకొండ మధ్యలో ఆరు కిలోమీటర్లు రోడ్డును పూర్తి చేయాల్సి ఉందన్నారు. అధికారులకు, ప్రజాప్రతిని ధులకు ఎన్నిసార్లు విన్న వించినా చలనం లేదని అన్నారు. దీంతో సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 15న ఉదయం 9 గంటలకు కోటకొండ భగత్ సింగ్ విగ్రహం నుండి పాదయాత్ర ప్రారంభమై నారాయణపేట జిల్లా కలెక్టరేట్ కు చేరుకుంటుందన్నారు. 16న నారాయణపేట జిల్లా కేంద్రం అంబేద్కర్ చౌరస్తా లో రాస్తారోకో, 17న ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొని పై మూడు రోజుల అప్పక్ పల్లి, కోటకొండ, కోయిలకొండ రోడ్డు సాధన ఉద్యమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి యాద గిరి, మండల కార్యదర్శి బి నరసింహ, గ్రామ కార్యదర్శి హాజీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ప్రశాంత్, రైతు సంఘం జిల్లా నాయకులు బాలకృష్ణ, టియుసిఐ జిల్లా నాయకులు ఎదురింటి నరసింహులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు వెంకట్ రాములు, పి వై ఎల్ నాయ కులు సలీం,మంగలి హనుమంతు, నారాయ ణపేట టౌన్ నాయకులు నజీర్ అహ్మద్, హరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# సూర్యఘర్ పథకం గ్రామీణ కుటుంబాలకు వరం

- అర్హులందరూ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



**చిన్నంబావి, జూన్ 9 (జనం సాక్షి) :** చిన్నంబావి మండల కేంద్రంలోని పెద్దదగడ గ్రామంలో ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన ద్వారా గ్రామీణ కుటుంబాలు విద్యుత్ వ్యయాన్ని తగ్గించుకోవడంతో పాటు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. కొల్లాపూర్ నియోజకవర్గంలోని పెద్ద ధగడ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని పథకం ప్రయోజనాలను గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సూర్య ఘర్ పథకం గ్రామీణ కుటుంబాలకు వరం అని గ్రామంలో ఉన్న 630 కుటుంబాల్లో 469 కుటుంబాలను ఈ పథకానికి అర్హులుగా గుర్తించినట్లు తెలిపారు. అర్హులైన కుటుంబాలు సౌర విద్యుత్ వ్యవస్థలను ఏర్పాటు చేసుకుని ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ ప్రయోజనాలను పొందాలని సూచించారు. సౌర విద్యుత్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను గృహ అవసరాలకు వినియోగించుకోవడంతో పాటు, మిగులు విద్యుత్‌ను విద్యుత్ సంస్థలకు విక్రయించి అదనపు ఆదాయం పొందవచ్చని మంత్రి తెలిపారు. ఒక్కో యూనిట్‌కు సుమారు రూ. 2.50 చొప్పున చెల్లింపులు అందే అవకాశం ఉందని వివరించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు కుటుంబాల ఆర్థిక భారం తగ్గించడంలో ఈ పథకం కీలకంగా మారుతుందని మంత్రి పేర్కొన్నారు. గ్రామస్థులు ఈ అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకుని స్వయం విద్యుత్ ఉత్పత్తిదారులుగా మారాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ కో డిజిఎం భాస్కర్ రెడ్డి, గ్రామ సర్పంచ్ ఉడుతల భాస్కర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, కృష్ణ ప్రసాద్ యాదవ్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీలత రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి, తూర్పుంటి కురుమూర్తి, యూత్ కాంగ్రెస్ నాయకులు విభీషణ్ యాదవ్, కిరణ్ కుమార్ గౌడ్, మధు గౌడ్, విద్యుత్ శాఖ, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# దామిని లైటింగ్ అలర్ట్ యాప్‌ను ఉపయోగించుకోండి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల నడిగడ్డ, జూన్ 9 (జనం సాక్షి) :** పిడుగుల ప్రమాదాలపై ముందస్తు హెచ్చరికలు అందించే "దామిని -- లైట్నింగ్ అలర్ట్" యాప్‌ను ప్రజలందరూ తప్పనిసరిగా వినియోగించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలంలో పిడుగుల కారణంగా సంభవించే ప్రమాదాల నుంచి ప్రజలు అప్రమత్తంగా ఉండేందుకు కేంద్ర ప్రభుత్వ భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ రూపొందించిన "దామిని -- లైట్నింగ్ అలర్ట్" మొబైల్ యాప్‌ను ప్రజలందరూ డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించాలని జిల్లా కలెక్టర్ కోరారు. పిడుగులు పడే అవకాశాన్ని జీపీఎస్ ఆధారంగా ముందుగానే గుర్తించి హెచ్చరికలు అందించడం ద్వారా ప్రాణనష్టాన్ని నివారించడంలో ఈ యాప్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గూగుల్ ప్లే స్టోర్ లేదా యాపిల్ యాప్ స్టోర్‌లో https://play.google.com/store/apps/detailsidRcom.lightening.app.damini "దామిని : లైట్నింగ్ అలెర్ట్ "పేరుతో ఈ యాప్ ఉచితంగా అందుబాటులో ఉందని తెలిపారు. యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్న తర్వాత మొబైల్ నంబర్,చిరునామా తదితర వివరాలతో నమోదు చేసుకుని జీపీఎస్ లొకేషన్‌కు అనుమతి ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. అనంతరం వినియోగదరుడు ఉన్న ప్రాంతం చుట్టూ సుమారు 20 నుంచి 40 కిలోమీటర్ల పరిధిలో పిడుగుల పరిస్థితిని యాప్ పర్యవేక్షిస్తూ అవసరమైన హెచ్చరికలను అందిస్తుందని వివరించారు. పిడుగుల ప్రమాద స్థాయిని గుర్తించేందుకు యాప్‌లో రంగుల ఆధారిత హెచ్చరిక వ్యవస్థను ఏర్పాటు చేశారని తెలిపారు. మీ ప్రాంతంలో సుమారు 7 నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉంటే ఎరుపు రంగు, 10 నుంచి 15 నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉంటే పసుపు రంగు, 18 నుంచి 25 నిమిషాల్లో పిడుగు పడే అవకాశం ఉంటే నీలం రంగు ద్వారా యాప్ ముందస్తు హెచ్చరికలు తెలియజేస్తుందని తెలిపారు. ఈ అలర్ట్‌లను గమనించి ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లి పిడుగుల ప్రమాదాల నుంచి తమను తాము రక్షించుకోవచ్చని అన్నారు. చదువుకోలేని వారు కూడా అలర్ట్ సౌండ్ ద్వారా ప్రమాదాన్ని సులభంగా గుర్తించగలరని,పిడుగుల సమయంలో తీసుకోవాల్సిన భద్రతా చర్యలపై కూడా యాప్ మార్గనిర్దేశం చేస్తుందని వివరించారు. పిడుగులు సంభవించే సమయంలో చెట్ల కింద,విద్యుత్ స్తంభాల సమీపంలో లేదా బహిరంగ మైదానాల్లో ఉండకుండా వెంటనే సురక్షిత భవనాల్లోకి వెళ్లాలని సూచించారు. ప్రజల ప్రాణ రక్షణలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొంటూ ప్రతి కుటుంబం తమ మొబైల్ ఫోన్‌లో దామిని యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని, గ్రామాలు, పాఠశాలలు, కళాశాలలు,రైతు వేదికలు మరియు ప్రజా సంస్థల ద్వారా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించారు.

# మొగుడంపల్లిలో మహిళా సంఘాల బస్సు ప్రారంభం

**మొగుడంపల్లి, జూన్ 9 (జనం సాక్షి) :** మండలంలోని మహిళా సంఘాలు ఇందిరా మహిళా శక్తి పథకం కింద రూ. 36 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన బస్సును ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం టిక్య నాయక్, సర్పంచ్ రాజు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాక్స్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు జెండా ఊపి బస్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు ఈ బస్సు దోహదపడుతుందని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవడంతో పాటు సంఘాల ఆదాయ వృద్ధికి కూడా ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాల సభ్యులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.




# మాదిగలు అన్నిరంగాల్లో ముందుండాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మైసగల్ల బుచ్చేంద్ర



**హత్నూర, జూన్ 9 (జనం సాక్షి) :** మాదిగలు అన్నిరంగాల్లో ముందుండాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మైసగల్ల బుచ్చేంద్ర పిలుపునిచ్చారు. మాదిగలను చైతన్యం చేయాలనే ఉద్దేశ్యంతో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ తలపెట్టిన గో టూ విలేజ్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మార్పీఎస్ బృందం సోమవారం రాత్రి మండలంలోని ముచ్చర్ల గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ విద్య,ఉద్యోగ,రాజకీయ రంగాల్లో మాదిగలు ముందడుగు వేయాలని సూచించారు. ఎస్సీ వర్గీకరణ కోసం మందకృష్ణ మాదిగ గత మూడు దశాబ్దాలుగా పోరాటం చేసి సాధించుకున్న వర్గీకరణ ఫలాలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. రాష్ట్రంలో జనాభా గణాంకాల ప్రకారం మాదిగలు అధిక సంఖ్యలో ఉన్నప్పటికీ సామాజికంగా,ఆర్థికంగా చాలా వెనుకబడ్డారని వారు తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసిస్తూ వివిధ రంగాల్లో ఉద్యోగాలు సాధించాలని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మీనంపల్లి గణేష్,విక్రమ్,గంధ గల వీరయ్య,ఆవుల మల్లేష్,శ్రీశైలం,రాకేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# బివిఆర్ఐటిలో మైక్రోవేవ్ సింపోజియం సదస్సు



**నర్సాపూర్, జూన్ 9 (జనం సాక్షి) :** నర్సాపూర్ పట్టణ సమీపంలోని బీవీఆర్ఐటీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ స్థాయి 5వ ఐఈఈఈ వైర్లెస్, యాంటెన్నాస్ మైక్రోవేవ్ సింపోజియం (వామ్స్ 2026)సదస్సు మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. జూన్ 10 నుండి 13, 2026 వరకు జరగనున్న ఈ సదస్సుకు ముందు నిర్వహించిన ప్రీ-కాన్ఫరెన్స్ వర్క్‌షాప్ ఐఈఈఈ డిస్టింగ్విష్డ్ లెక్చరర్ టాక్స్ కార్యక్రమాలు విశేష ఆదరణ పొందాయి. బీవీఆర్ఐటీ క్యాంపస్‌లోని రతన్ టాటా బ్లాక్‌లో నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌లో ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు పరిశ్రమ నిపుణులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ సి. జె. రెడ్డి, అధ్యక్షులు, ఐఈఈఈ యాంటెన్నా ప్రసరణ సంఘం , అమెరికా ప్రొఫెసర్ క్రిస్టోఫ్ ఫ్యూమాక్స్, మాజీ అధ్యక్షులు, ఐఈఈఈ యాంటెన్నా, ప్రసరణ సంఘం, ఆస్ట్రేలియా ప్రొఫెసర్ ఫ్రాన్సెస్కో పి. ఆండ్రియుల్లీ, అధ్యక్ష పదవికి ఎన్నికైనవారు , ఇటలీ ప్రొఫెసర్ నెల్సన్ ఎనీవేవ్స్, ఫ్రాన్స్ ప్రొఫెసర్ చౌ-యెన్ డెస్మండ్ సిమ్, ఐఈఈఈ యాంటెన్నా చాప్టర్ చైర్, తైవాన్ డా. సుధాకర్ రావు, , ఐఈఈఈ , లైఫ్ ఫెలో, అమెరికా ప్రొఫెసర్ సతీష్ కుమార్ శర్మ, ఐఈఈఈ , లైఫ్ ఫెలో సాన్ డియాగో స్టేట్ యూనివర్సిటీ, అమెరికా యోగేష్ కె. వర్మ, డిఆర్‌డిఓ-ఆర్‌సిఐ,హైదరాబాద్, భారతదేశం ఎం. బాలాచారి, ఆస్ట్రా మైక్రోవేవ్ ప్రొడక్ట్స్ లిమిటెడ్, భారతదేశం దేవప్రసాద్ బరాద్, భారతదేశం డా. అమిత్ కుమార్ సింగ్, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఐఐటీ పాట్నా, భారతదేశం వామ్స్ సదస్సు లో పాల్గొన్న నిపుణులు అధునాతన యాంటెన్నా సాంకేతికతలు, 6+ భవిష్యత్ వైర్లెస్ కమ్యూనికేషన్ వ్యవస్థలు, వేరబుల్ యాంటెన్నాలు, ఉపగ్రహ అంతరిక్ష కమ్యూనికేషన్ యాంటెన్నాలు, ఫేజ్డ్-అరే యాంటెన్నాలు, సంప్రదాయ యాంటెన్నాల నుంచి ఇంటెలిజెంట్ స్మార్ట్ యాంటెన్నా వ్యవస్థల వరకు జరిగిన పరిణామాలు, వైర్లెస్ కమ్యూనికేషన్ రంగంలో తాజా పరిశోధనలు పరిశ్రమ అవసరాలు వంటి అత్యాధునిక అంశాలపై ప్రసంగాలు చేశారు. వామ్స్ 2026 సదస్సుకు డా. బి.ఆర్.సంజీవ రెడ్డి జనరల్ చైర్ గా వ్యవహరిస్తున్నారు. ప్రొఫెసర్ డా.పి.ఎస్.ఆర్. చౌదరి, డా.సమీర్ చక్రవర్తి, ఐఈఈఈ కార్యనిర్వాహక మండలి సభ్యులుపాల్గొన్నారు. ఈ సందర్భంగా బీవీఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబె మాట్లాడుతూ, "ప్రపంచ ప్రఖ్యాత యాంటెన్నా వైర్లెస్ కమ్యూనికేషన్ నిపుణులు వామ్స్ అంతర్జాతీయ స్థాయి పరిజ్ఞానాన్ని అందిస్తాయి" అని అన్నారు. సంస్థ డైరెక్టర్ డా. కె. లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ, " విద్యార్థులు, అధ్యాపకులు యువ ఇంజినీర్లు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి, అంతర్జాతీయ నిపుణులతో మమేకమయ్యే అరుదైన అవకాశాన్ని కల్పిస్తోంది" అని పేర్కొన్నారు. ప్రధాన సదస్సు వామ్స్ 2026 జూన్ 10 నుండి 13 వరకు నిర్వహించబడనుంది. ఈ సదస్సుకు దేశ విదేశాల నుండి పరిశోధకులు, అధ్యాపకులు, పరిశ్రమ నిపుణులు విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరుకానున్నారు. వైర్లెస్ కమ్యూనికేషన్స్, యాంటెన్నాలు మైక్రోవేవ్ ఇంజినీరింగ్ రంగాల్లో విజ్ఞాన మార్పిడి, సంయుక్త పరిశోధనలు సాంకేతిక ఆవిష్కరణలకు ఈ సదస్సు ప్రముఖ వేదికగా నిలవనుంది. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, డీన్లు, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగ అధ్యాపకులు, విద్యార్థులు, కళాశాల మేనేజర్ బాపిరాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎనుమాముల మార్కెట్ యార్డు సందర్శించిన జిల్లా కలెక్టర్



**వరంగల్ ప్రతినిధి,జూన్ 9 (జనంసాక్షి):** ఆసియా ఖండంలోనే పెద్దదైన ఎనుమాముల మార్కెట్లో జరుగుతున్న క్రయ విక్రయాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం మార్కెట్ యార్డును సందర్శించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎర్ర ప్రియాంక జిల్లా కలెక్టర్ సత్య శారద కు పూల బొకేతో స్వాగతం పలికారు. అనంతరం మార్కెట్ యార్డులోని పలు అంశాలపై జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి సురేఖ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రవీంద్ర రెడ్డి, వైస్ చైర్మన్ జనార్ధన్, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బస్సుల అద్దెతో మహిళా సంఘాలకు ఆర్థిక పరిపుష్టి

- పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



పాలకుర్తి, జూన్ 09(జనంసాక్షి) టీఎస్ ఆర్టీసీకి అద్దె బస్సులను సమకూర్చడం ద్వారా స్వయం సహాయక సంఘాలకు ఆర్థిక పరిపుష్టి కల్పించే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట పాలకుర్తి, రాయపర్తి మండలాల ఇందిరా మహిళా శక్తి సంఘాలకు ప్రభుత్వం మంజూరి చేసిన బస్సులను ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా శక్తి పథకాన్ని రూపొందించిందని అన్నారు. పేరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) పొదుపు నిధులను సమకూర్చిందని గుర్తు చేశారు. ప్రభుత్వం మంజూరి చేసిన బస్సులను టీఎస్ ఆర్టీసీకి బస్సులను అద్దెకు ఇవ్వడం వల్ల సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయని అన్నారు. ఈ బస్సులను మహిళల సేవా కార్యక్రమాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్పర్సన్ లావుడ్యా మంజుల, మహిళా కమీషన్ సభ్యురాలు చిట్యాల శ్వేత, ఏపీఎం కారుపోతుల వెంకన్న, సీసీలు శోభ, యాదగిరి, సిబ్బంది మంజుల, శోభ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందాలి

- నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతులు కల్పించాలి
- నిర్మల్ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, జూన్09 (జనంసాక్షి) :** ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యతో పాటు మెరుగైన వసతులు, నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించే విధంగా బోధన సాగించాలని, పదో తరగతి ఫలితాల మెరుగుదలకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. పాఠశాలలు, వసతి గృహాలు, వంటశాలల్లో పరిశుభ్రత పాటించాలని, విద్యార్థులకు ప్రతిరోజూ మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాలని ఆదేశించారు. గడువు ముగిసిన ఆహార పదార్థాలు వినియోగించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. మెస్ కమిటీల ద్వారా ఆహార నాణ్యతను పర్యవేక్షించాలని, వంట సిబ్బంది పరిశుభ్రత పాటిస్తూ మాస్కులు, ఏప్రాన్‌లు, తల టోపీలు ధరించాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణ కోసం వసతి గృహాల్లో ఏఎన్ఎంలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీఈవో భోజన్న, సంక్షేమ శాఖల అధికారులు, ఎంఈఓలు తదితరులు పాల్గొన్నారు.

# జనగణన విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయుడి మృతి

- కుటుంబానికి రూ. కోటి పరిహారం ఇవ్వాలని డిమాండ్



**రెబ్బెన,జూన్ 9 (జనం సాక్షి):** జనగణన విధులు నిర్వహిస్తూ తీవ్ర వేసవి తాపానికి గురై మృతి చెందిన ఉపాధ్యాయుడు రేగళ్ల వెంకటేశ్వర్లు రాము కుటుంబానికి ప్రభుత్వం రూ. కోటి నష్టపరిహారం అందించాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మే 11 నుంచి జూన్ 9 వరకు ఉపాధ్యాయులు జనగణన విధులు నిర్వహించారు. ఈ సమయంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నప్పటికీ, జనగణనను సకాలంలో పూర్తి చేయాలని అధికారులు ఒత్తిడి చేయడంతో ఉపాధ్యాయులు తీవ్ర ఎండలను లెక్కచేయకుండా విధులు నిర్వర్తించినట్లు సంఘం నాయకులు తెలిపారు. రెబ్బెన మండలంలోని నెర్పల్లి ఎంపీపీఎస్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు రేగళ్ల వెంకటేశ్వర్లు ఆదివారం జనగణన విధులు ముగించుకుని ఇంటికి వెళ్లిన అనంతరం వడదెబ్బతో అస్వస్థతకు గురయ్యారు. వాంతులు, విరేచనాలతో బాధపడడంతో మొదట ప్రాథమిక చికిత్స అందించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. డీహైడ్రేషన్ కారణంగా కార్డియాక్ అరెస్ట్‌కు గురైన వెంకటేశ్వర్లు సోమవారం రాత్రి 11.55 గంటలకు మృతి చెందారు. జనగణన విధుల నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉపాధ్యాయుడి కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని, రూ. కోటి నష్టపరిహారం ప్రకటించాలని పీఆర్టీయూటీఎస్ నాయకులు ఏటుకూరి శ్రీనివాసరావు, సునార్కర్ అనిల్ కుమార్, ఉప్పుల నరసింహాచారి, బత్తుల సదానందం, జాడి జ్ఞానేశ్వర్, మేకర్తి వెంకటేశ్వర్లు, గాజుల రవీందర్ కోరారు.

# ఉపాధి కూలి పనిలోనూ వివక్ష తప్పదా?



**ఆత్మకూరు, 09, (జనం సాక్షి):** ఆత్మకూరు మండలంలో ఉపాధి హామీ పనులు మే నెల మాసం అనే ఉద్దేశంతో మండల వ్యాప్తంగా ఉపాధి పనులు గ్రామ గ్రామాన జోరందుకున్నవి. ప్రస్తుతం గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ కార్యదర్శి ద్వారా ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నవి. బిల్ కలెక్టర్లు కొందరిని మేట్లుగా నియమించుకొని కూలీలకు పని చూపిస్తున్నారు. ఇలా అయితే బాగానే ఉంటుంది. కొన్ని ప్రాంతాలలో రాజకీయ జోక్యం నడుస్తున్నది. కార్యకర్తలు పని చేయకున్నా ఫోటోలు దింపే మేట్లుగా చలామణి అయ్యే కొందరు డబ్బులు ఇస్తేనే ఫోటో దింపు తున్నారని కూలీలు వాపోతున్నారు. ఫోటో దించే వ్యక్తులు పని చేయరు పనిచేసిన వారిని ఫోటో దింపుట్లో వివక్ష చూపుతున్నారు . ఫోటో దింపే వారిలో ఎస్సీలు ఉన్నానూ అగ్రవర్ణాల వారిని ముందుగా దింపుచున్నారు. ఇదేమి అని అడిగితే అంతా మా ఇష్టం అన్నట్లు ప్రవర్తిస్తున్నారని కూలీలు తెలుపుతున్నారు. వీరికి డబ్బులు ఇవ్వడానికి మా దగ్గర లేవు కదా అని కొందరు కూలీలు మానసిక క్షోభకు గురవుతున్నారు. మేము ఉపాధి కూలీలుగా కూడా వివక్షను ఎదురుకోవలసిన పరిస్థితి దాపురించందని కన్నీరు మున్నీరు అవుతున్నారు. అధికారులు చొరవ తీసుకొని ఫోటో దింపే మేటీలను కూడా పనిచేపించి, ప్రభుత్వ నియమిత వ్యక్తుల చేత ఫోటోలు దించుకోవాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

# పూర్తయిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం

- 24 అంతస్తుల భవనం 14 వ అంతస్తు వరకు వైద్య సేవలు
- 2200 పడకలు,500 మంది డాక్టర్లు 1000 మంది స్టాఫ్
- 56 ఎకరాల్లో హాస్పటల్ భవన నిర్మాణం
- హాస్పిటల్ ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్న పరిస్థితి





**వరంగల్ బ్యూరో, జూన్ 09 (జనం సాక్షి) :** ప్రజల ఆరోగ్యాలను కాపాడే ఆరోగ్య ప్రధాయిని, ఉత్తర తెలంగాణ జిల్లాలకు ఒక సంజీవిని, దేశంలోనే అత్యంత ఖరీదైనటువంటి వరంగల్లోని సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్. వరంగల్ సెంట్రల్ జైల్ స్థానంలో 56 ఎకరాల 39 గుంటల భూమిలో 2021 జూన్ 21న అప్పటి టిఆర్ఎస్ ప్రభుత్వం వరంగల్ లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. సుమారు 1150 కోట్ల ఖర్చుతో ఈ హాస్పిటల్ నిర్మాణం జరుగుతుంది. ఇందులో 2200 పడకలు, 500 మంది డాక్టర్లు, 1000 మంది స్టాఫ్ పనిచేయనున్నారు. ప్రభుత్వం నిర్మిస్తున్న అత్యంత భారీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వరంగల్లో నిర్మాణం అవుతుండడం, ఆ నిర్మాణం కూడా పూర్తి కావస్తుండడం ప్రజల అదృష్టంగా భావిస్తున్నారు. ఇందులో ఇన్బైడ్ వర్క్స్, వైద్య పరికరాలు, ఆపరేషన్ థియేటర్స్ నిర్మాణం జరిగాయి.

## మొత్తం 24 అంతస్తుల భవనం

సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో మొత్తం 24 అంతస్తుల భవనాలను నిర్మించారు. ఇందులో 1 నుంచి 14 వరకు వైద్య సేవల కోసం, 15 నుండి 24 వరకు తొమ్మిది అంతస్తులు ఆయా ఫ్యాకల్టీలకు(వైద్యులకు) కేటాయించినట్లు సమాచారం. ప్రధానంగా గ్రౌండ్ ఫ్లోర్లో మెడికల్, ఆంకాలజీ, అత్యవసర సేవలు, కలర్ ఆర్థోపెడిక్, ఐసీయూ, ఫార్మసీ, స్కాన్, ట్రామా ,ఐసియు, ఎంఆర్ఐ, అల్ట్రా స్కాన్, మొదలైనవి ఏర్పాటు చేశారు. ఇక 1 వ ఫ్లోర్లో ఈ ఎన్ టి రుమటాలజీ, ఓపి, డెర్మటాలజీ, ఎక్రే, జనరల్ సర్జన్. 2 వ ఫ్లోర్ లో పిల్లల అత్యవసర విభాగం, ఐసీయూ, నియోనటాల్, ఎక్రే, ఉంటాయి. 3 వ ఫ్లోర్లో ఐ వి ఎఫ్, ఆర్ సి వి, ట్రాన్స్ ప్లాంట్, ఆపరేషన్ థియేటర్స్ ఉంటాయి. 4 వ ఫ్లోర్లో ఈఎన్టీ, గ్యాస్ట్రో, ట్రాన్స్ ప్లాంట్, ఐసియు, మొదలైనవి ఉన్నాయి. 5 వ ఫ్లోర్లో డెంటల్, బోనుమారో, జనరల్, సర్జికల్, జనరల్ మెడిసిన్ ఉంటాయి. 6 వ ఫ్లోర్లో ఆర్థోపెడిక్ ఎమర్జెన్సీ, 7వ ఫ్లోర్ లో ఎలక్ట్రికల్, ప్లంబింగ్ సేవలు, 8 వ ఫ్లోర్లో ఒబెసిటీ, గైనకాలజీ, పీడియాట్రిక్ సేవలు, 9 వ ఫ్లోర్లో మెడికల్ ఆంకాలజీ, శ్వాసకోశ వ్యాధుల సేవలు, 10 వ ఫ్లోర్లో ప్లాస్టిక్ సర్జరీ, డెర్మటాలజీ, సేవలు, 11 వ ఫ్లోర్లో ఎండోక్రైనాలజీ, మానసిక, డ్రగ్స్ మొదలైన చికిత్సల సేవలు ఉంటాయి. 12 ఫ్లోర్లో సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ మానసిక రోగాల వార్డులు ఉంటాయి. 13,14 ఫ్లోర్లో సెమీ విఐపి ప్రైవేట్ గదులు ఉన్నాయి.15 వ ఫ్లోర్లో బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేయనున్నారు.

## ప్రారంభించేందుకు వేగంగా ఏర్పాట్లు..!

దేశంలోనే అత్యున్నతమైన ఒక మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వరంగల్లో నెలకొల్పడం వరంగల్ ప్రజలే కాకుండా ఉత్తర తెలంగాణలోని జిల్లాల వాసులకు ఎంతో ఉపయోగకరంగా ఈ హాస్పటల్ మారనుంది. అత్యవసరమైనటువంటి సేవలకు హైదరాబాద్ వెళ్లాల్సిన అవసరం లేకుండా అన్ని ఈ హాస్పిటల్ లోనే అందుబాటులో ఉండే విధంగా వైద్య సేవలు అందనున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తోపాటు వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి తోపాటు పలువురు నేతలు హాస్పిటల్ ను ప్రజలకు అందుబాటులో తెచ్చే విధంగా పనులు వేగంగా జరిగేలా నిరంతరం పాటుపడుతున్నారు. మరో రెండు మూడు నెలల్లో ఈ హాస్పిటల్ లో అన్ని విధాలుగా ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా ఏర్పాట్లు జరుగుతున్నట్లు సమాచారం. ఏది ఏమైనా వైద్య సేవలు అన్ని విధాలుగా అందేందుకు ఈ మల్టీ లెవెల్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ త్వరగా ప్రారంభమై ప్రజల ఆరోగ్యాలకు ఆరోగ్యప్రదాయనిగా నిలవాలని ప్రజలు లక్షల కళ్ళతో ఎదురుచూస్తున్నారు.

# గ్రామీణ యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్న చిన్నబోయినపల్లి గ్రంథాలయం

- గ్రంథాలయాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ఏటూరునాగారం, జూన్ 09(జనంసాక్షి) :** చిన్నబోయినపల్లి గ్రామ యువతకు పోటీ పరీక్షల సన్నద్ధతలో అండగా నిలుస్తున్న గ్రంథాలయాన్ని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మంగళవారం పరిశీలించారు. గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న పుస్తకాలు, యువత వినియోగం, సాధించిన ఫలితాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన కానిస్టేబుల్ ధూపాటి సతీష్ 2024 సంవత్సరంలో గ్రామీణ యువతకు నాణ్యమైన అధ్యయన వనరులు అందించాలనే లక్ష్యంతో స్వచ్ఛందంగా ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాలకు వెళ్లి వేలాది రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకోలేని నిరుద్యోగ యువతకు గ్రామంలోనే పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. గ్రంథాలయంలో సుమారు రూ.1.50 లక్షల విలువైన పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచారు. గ్రూప్స్, పోలీస్, రైల్వే, బ్యాంకింగ్, ఉపాధ్యాయ నియామకాలు తదితర ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన అధ్యయన సామగ్రిని యువత ఉచితంగా వినియోగించుకుంటున్నారు. ఈ గ్రంథాలయం ద్వారా చదువుకున్న యువతలో ఇద్దరు ఉపాధ్యాయులు, ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. అలాగే చిన్నబోయినపల్లి గ్రామానికి చెందిన హజారుద్దీన్ ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై గ్రామ యువతకు ఆదర్శంగా నిలిచారు. గ్రామీణ ప్రాంత యువత అభివృద్ధికి ధూపాటి సతీష్ చేస్తున్న కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. వ్యక్తిగత చొరవతో విద్య, ఉపాధి అవకాశాల కోసం చేపడుతున్న ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని తెలిపారు. యువత తమ లక్ష్యాలను సాధించేందుకు గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ధూపాటి సతీష్ గ్రంథాలయ నిర్వహణ, యువతకు అందిస్తున్న సేవల గురించి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. జిల్లా కలెక్టర్ ఆయనను అభినందించి, భవిష్యత్తులో మరింత మంది యువతకు ఉపయోగపడే విధంగా గ్రంథాలయాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్య శాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఎనుమాముల ఈవీఎం గోదాం తనిఖీ

**వరంగల్ ప్రతినిధి, జూన్ 9 (జనంసాక్షి):** త్రైమాసిక తనిఖీ షెడ్యూల్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మంగళవారం ఎనుమాముల మార్కెట్ యార్డ్‌లోని ఈవీఎం గోదామును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోదాంలో భద్రపరిచిన ఈవీఎంల నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, సీసీటీవీ పర్యవేక్షణ వ్యవస్థ, ప్రవేశ నియంత్రణ చర్యలను పరిశీలించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి.సంధ్యారాణి, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, ఎన్నికల విభాగ డిటి రంజిత్, సంబంధిత అధికారులు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**బెల్లంపల్లి, జూన్ 9 (జనంసాక్షి) :** ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం ఆయన బెల్లంపల్లి పట్టణంలోనీ రాంనగర్ ప్రాంతంలో చేపట్టిన పట్టణ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని, సకల సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అల్పాహారం, మధ్యాహ్న భోజనం పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. బెల్లంపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరైన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలో భాగంగా బెల్లంపల్లిలో చేపట్టిన పాఠశాల పనులను పరిశీలించారు. కన్నేపల్లి మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి వార్డులు, మందుల నిల్వలు, పరిసరాలను పరిశీలించారు. వైద్య రంగాన్ని అభివృద్ధి చేస్తూ ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని, వైద్యులు, సిబ్బంది విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్నందున అంటు వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు వివరించాలని తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి పాఠశాలలో కొనసాగుతున్న భోజనశాల, ప్రహరీ గోడ నిర్మాణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. అనంతరం నెన్నెల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి భోజనశాల, అదనపు గదుల నిర్మాణాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట సంబంధిత అధికారులు ఉన్నారు.

## పోలీసుల దాడిపై మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన బాధితుడు




**మల్హర్, జూన్ 09(జనంసాక్షి) :** కొయ్యూరు పోలీస స్టేషన్‌లో తనపై జరిగిన పోలీసుల దాడి ఘటనపై తాడిచెర్ల గ్రామానికి చెందిన మేరుగు రమేష్ తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌కు మంగళవారం లిఖితపూర్వక ఫిర్యాదు సమర్పించినట్లు తెలిపారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం, ఈ నెల 5న కుటుంబ వివాదానికి సంబంధించిన కేసు విచారణ నిమిత్తం తనను కొయ్యూరు పోలీస్‌స్టేషన్‌కు పిలిపించారని స్టేషన్‌లో తనపై శారీరక దాడికి పాల్పడటంతో తీవ్ర గాయాలయ్యాయని బాధితుడు తెలిపాడు. దాడి కారణంగా కాలికి తీవ్ర గాయం కావడంతో భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు, వైద్యులు ఫ్రాక్చర్‌గా నిర్ధారించి ప్లాస్టర్ వేశారని బాధ్యులైన పోలీసుల పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో మానవ హక్కుల కమిషన్ కు వివరించారు.

# బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు పాటించాలి

- జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- బయో మెడికల్ మేనేజ్మెంట్ పై అవగాహన సదస్సు




**వరంగల్ బ్యూరో, జూన్ 09 (జనం సాక్షి) :** ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అటవీ, పర్యావరణ పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించేందుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు వరంగల్ ఐఎంఏ హాల్‌లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో బయోమెడికల్ వ్యర్థాల శాస్త్రీయ నిర్వహణ కీలకమని అన్నారు. ఆసుపత్రుల్లో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను మూలస్థాయిలోనే వేరు చేయడం, నిర్దేశిత రంగుల కవర్లు, డబ్బాల్లో నిల్వ చేయడం, సురక్షితంగా తరలించి నిర్వీర్యం చేయడం వంటి అంశాల్లో వైద్య సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ నిబంధనలను ప్రతి వైద్య సంస్థ కచ్చితంగా పాటించాలని, ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలు వ్యక్తిగత భద్రతా చర్యలను తప్పనిసరిగా అనుసరించాలని కలెక్టర్ తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించి, క్లాత్ బ్యాగుల వినియోగాన్ని ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ కుమార్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బయోమెడికల్ వ్యర్థాల వర్గీకరణ, రంగుల వారీగా వ్యర్థాల నిల్వ, సేకరణ, రవాణా, నిల్వ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల గురించి సవివరంగా వివరించారు. పసుపు, ఎరుపు, నీలం, తెలుపు రంగుల కవర్లు, డబ్బాల్లో వేర్వేరు రకాల వ్యర్థాలను వేరు చేసి నిల్వ చేయాల్సిన విధానం, పదునైన వ్యర్థాల నిర్వహణ, సోడియం హైపోక్లోరైట్ వినియోగం, వ్యర్థాల సురక్షిత నిల్వపై అవగాహన కల్పించారు. ఆసుపత్రుల్లో వ్యర్థాలు ఎక్కువసేపు నిల్వ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, నిల్వ కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. సాంబశివరావు, ఎన్ఐటీ వరంగల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద్ కుమార్, కాలుష్య నియంత్రణ మండలి అధికారి సునీత, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ, జిల్లా అధికారులు, ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ నరేష్ కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు, ప్రోగ్రాం అధికారులు, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉద్యోగం సాధించిన విద్యార్థినికి అభినందనలు



**శ్రీరాం పూర్ (జనంసాక్షి):** శ్రీరాంపూర్ సింగరేణి పాలిటెక్నిక్ కాలేజీలో చదువు పూర్తి చేసుకొని సాఫ్ట్ వేర్ ఉద్యోగం సాధించిన మంచాల అక్షయకు కళాశాల ప్రిన్సిపాల్ కూర్మ రాజేందర్, ఏరియా సింగరేణి డీజీఎం అనిల్ కుమార్ అభినందనలు తెలిపారు. సింగరేణి పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ డిప్లొమో కోర్సు పూర్తిచేసి 2023-2026 లో కంప్యూటర్ ఇంజనీరింగ్ పూర్తిచేసిన అక్షయ క్యాంపస్ ఇంటర్వ్యూలో 16.43లక్షల వార్షిక వేతనంతో ప్రముఖ ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ రంగ సంస్థ హెచ్ఎస్బీసీ లో సాఫ్ట్వేర్ ఉద్యోగం సాధించింది.

# ప్రజల నమ్మకమే ప్రభుత్వానికి బలం

- బురద జల్లే రాజకీయాలను తిప్పి కొట్టిన ఓటర్లు
- మీడియా సమావేశంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి



**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 9 (జనం సాక్షి) :** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రజా సంక్షేమమే పరమావధిగా పనిచేస్తోందని, ప్రజల్లో ప్రభుత్వంపై ఉన్న నమ్మకం, విశ్వాసానికి పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన 'ప్రజా దర్బార్' విజయవంతం కావడమే నిదర్శనమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రఘురామ్ రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మూడో సంవత్సరంలోకి అడుగుపెట్టిన సందర్భంగా చేపట్టిన 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ జూలై 12 నాటికి పూర్తి కాబోతోందని వెల్లడించారు. పాలేరు నియోజకవర్గాన్ని 14 క్లస్టర్లుగా వర్గీకరించి, గత 25 నుండి 30 రోజులుగా 'ప్రజల వద్దకే ప్రభుత్వం' అనే నినాదంతో ప్రజా దర్బార్ నిర్వహించినట్లు మంత్రి తెలిపారు. సోమవారంతో ఆఖరి విభాగం పూర్తయిందని, ఈ కార్యక్రమాల ద్వారా దాదాపు 25వేల మంది ప్రజలను తాను వ్యక్తిగతంగా కలిసి, వారి సమస్యలను స్వయంగా కళ్లారా చూసి, చెవులారా విన్నానని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రజా దర్బార్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుండి మొత్తం 24వేల పైచిలుకు దరఖాస్తులు వచ్చాయన్నారు. అందులో అత్యధికంగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 11,000 అర్జీలు, ఆసరా పింఛన్ల కోసం 5,200 అర్జీలు అందినట్లు వివరించారు. అలాగే గృహజ్యోతి పథకం దరఖాస్తులతో పాటు అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, తాగునీరు వంటి స్థానిక సమస్యలపై కూడా ప్రజలు పెద్ద ఎత్తున వినతులు సమర్పించారని చెప్పారు. గత ప్రభుత్వం ధరణి చట్టం తెచ్చే ముందు సాదాబైనామాల అప్‌లోడ్‌కు అవకాశం ఇచ్చి, ఆ తర్వాత చట్టంలో చేర్చకుండా రైతులను గాలికి వదిలేసిందని మంత్రి మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న 9,26,000 సాదాబైనామా దరఖాస్తుల సమస్యను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని మంత్రి మండలి నిబంధనలను సవరించిందని తెలిపారు. గతంలో భూమి అమ్మిన వారి సమ్మతి కూడా కావాలనే నిబంధన ఉండేదని, కానీ రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, అమ్మిన వారి సమ్మతి అవసరం లేకుండా నిబంధనలు మార్చామన్నారు. ఇప్పటికే ఐదున్నర లక్షల దరఖాస్తులను గుర్తించి నోటీసులు ఇచ్చామని, మిగిలిన వాటికి మరో 15 రోజుల్లో నోటీసుల ప్రక్రియ పూర్తవుతుందని, చట్టప్రకారం 30 రోజుల నోటీసు గడువు తర్వాత అర్హులైన అన్ని సాదాబైనామాలను పరిష్కరిస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. తరతరాలుగా భూమి సాగులో ఉన్నా పట్టా పుస్తకాలు రావట్లేదని ఆవేదన చెందుతున్న రైతుల కోసం రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతగా ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను ఎంపిక చేసి ఆధునిక భూ సర్వే నిర్వహిస్తున్నట్లు మంత్రి తెలిపారు. పాలేరు నియోజకవర్గంలోని తిరుమలాయపాలెం (కాకరవాయి) గ్రామంలో ఇప్పటికే ఈ సర్వే విజయవంతంగా పూర్తయిందన్నారు. క్షేత్రస్థాయిలో సాగులో ఉన్న వారికే పట్టా పుస్తకాలు ఇస్తూ, లేని వారివి రద్దు చేసే చట్టాన్ని తెచ్చామని, ప్రజా దర్బార్‌లో వచ్చిన 4,300 భూ సమస్యల దరఖాస్తుల్లో దాదాపు 2,300 అప్లికేషన్లను ప్రత్యేక కార్యాచరణ ద్వారా త్వరలోనే పరిష్కరించబోతున్నామని స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వ అవసరాల కోసం కొంత భూమి సేకరిస్తే ఆ సర్వే నెంబర్ మొత్తం నిషేధిత జాబితాలో పెట్టే పాత విధానాన్ని సవరించి, పట్టా భూములను ఆ నిషేధిత జాబితా నుంచి తొలగించే ప్రక్రియను దాదాపు పూర్తి చేశామన్నారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి అధికారుల యంత్రాంగాన్ని విభజించి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కనీసం 45 రోజుల సమయం పడుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి అర్హులైన వారి దరఖాస్తులను విడతలవారీగా అందజేస్తామని, అలాగే ఇళ్ల స్థలాల కోసం 1,500 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇళ్ల స్థలాల కోసం సేకరించిన భూములను గుర్తించాలని అధికారులను ఆదేశించామని, ఎక్కడైతే నివాసానికి యోగ్యమైన ప్రభుత్వ స్థలాలు ఉన్నాయో వాటిని సేకరించి రాబోయే కొద్ది రోజుల్లో ఇళ్ల స్థలాల సమస్యను కూడా పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ ప్రజాప్రతినిధులు, పదేళ్ల దొరపాలన సాగించిన మాజీ మంత్రులు రాజకీయ దురుద్దేశంతో, స్వలాభం కోసం ప్రభుత్వంపై బురదజల్లుతున్నారని, వారి మాటల్లో ఎలాంటి నిజం లేదని మంత్రి కొట్టిపారేశారు. ప్రతిపక్షాలు చేసే విమర్శల్లో ప్రజలకు ఉపయోగపడే న్యాయమైన అంశాలు ఉంటే పంతాలకు పోకుండా సానుకూలంగా తీసుకుని తక్షణమే పరిష్కరిస్తామని చెప్పారు. ప్రజా దర్బార్‌కు వచ్చిన వారు కేవలం కాంగ్రెస్ శ్రేణులు మాత్రమే కాదని, అన్ని పార్టీలకు చెందిన పేద ప్రజలు ప్రభుత్వంపై పూర్తి నమ్మకంతో వచ్చారని మంత్రి అన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సహకరించకపోయినా ఈ ప్రభుత్వం ఖచ్చితంగా మా సమస్యలు తీరుస్తుందనే అచంచల విశ్వాసం ప్రజల్లో కనిపించిందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, ఉప ఎన్నికలు.. ఏవైనా సరే ఓటరు స్పష్టమైన తీర్పుతో ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించడానికి సిద్ధంగా ఉన్నారని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.

## అమృత్ ట్యాంకుల నిర్మాణం వేగవంతం చేయాలి



**హాలియా, జూన్ 9 (జనం సాక్షి) :** అమృత్ పథకం కింద హాలియా మున్సిపాలిటీలో నిర్మాణంలో ఉన్న నీటి నిల్వ ట్యాంకుల పనులను నల్లగొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మంగళవారం పరిశీలించారు. పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం కాంట్రాక్టర్‌తో మాట్లాడిన కలెక్టర్, నాలుగు ట్యాంకుల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైన మేరకు అదనపు కార్మికులను నియమించి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ చింతల చంద్రారెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్ రెడ్డి, వైస్ చైర్మన్ గౌని రాజా రమేష్ యాదవ్, 2 వ వార్డు కౌన్సిలర్ సలహాదారు నకిరేకంటి సైదులు, 4 వ వార్డు కౌన్సిలర్ సలహాదారు కడమంచి శ్రీను,5 వ వార్డు కౌన్సిలర్ సలహాదారు చిట్టిపోలు కరుణాసాగర్, 8 వ వార్డు కౌన్సిలర్ సలహాదారు ఎండి . మజార్ మొయినుద్దీన్, 9 వ వార్డు కౌన్సిలర్ చెరుపల్లి ముత్యాలు, 10 వ వార్డు కౌన్సిలర్ సలహాదారు పిల్లి ఆంజనేయులు, 11 వ వార్డు కౌన్సిలర్ దీపావత్ ప్రసాద్ నాయక్, 12 వ వార్డు కౌన్సిలర్ సలహాదారు ఎడవల్లి రంజిత్, కోఆప్షన్ సభ్యులు వర్కాల శేఖర్ రెడ్డి, ఎండి రషీద్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీఐ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎస్పీ



**దేవరకొండ, జూన్ 09 (జనం సాక్షి) :** నల్లగొండ జిల్లా పోలీసు శాఖలో పరిపాలనా పనితీరు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఐపీఎస్ మంగళవారం దేవరకొండ సీఐ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలో నిర్వహిస్తున్న గ్రేవ్ కేసుల క్రైమ్ ఫైల్స్, పెండింగ్ కేసుల రికార్డులు, ఇతర దర్యాప్తు సంబంధిత ఫైల్స్‌ను సవివరంగా పరిశీలించారు.బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.అలాగే హత్యలు, దోపిడీలు, మహిళలు మరియు చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తు పురోగతిపై సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న గ్రేవ్ కేసులను త్వరితగతిన ఛేదించాలని, ప్రతి కేసులో పటిష్టమైన ఆధారాలు సేకరించి నిందితులకు చట్టపరమైన శిక్షలు పడేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.సీసీటీఎన్ఎస్ నమోదు విధానం, డిజిటల్ రికార్డుల నిర్వహణ, కోర్టు డిస్పోజల్ కేసుల ఫాలోఅప్, వారెంట్ల అమలు తదితర అంశాలపై కూడా ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ప్రజలకు పోలీసు శాఖపై మరింత నమ్మకం పెరిగేలా ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో డిఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వెంకట్ రెడ్డి, ఇతర పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## రైస్ మిల్లులను అకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్




**పెబ్బేరు, జూన్ 9 (జనం సాక్షి) :** గోదాములు, మిల్లుల వద్ద వరి ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ శ్రీరంగాపురం మండలం పరిధిలోని లక్ష్మి వారహి ఇండస్ట్రీ, పెబ్బేరు పరిధిలో రాధాకృష్ణ ఇండస్ట్రీస్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా మిల్లుల గోదాముల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ ప్రక్రియను ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గోదాములు, మిల్లుల వద్ద వరి ధాన్యాన్ని ఎలాంటి ఆలస్యం లేకుండా త్వరగా అన్‌లోడ్ చేసుకోవాలని ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లుల్లో వేగంగా దించుకోవాలని స్పష్టం చేశారు. లారీలలో ఉన్న ధాన్యం పై టార్పాలిన్లు కప్పి ఉంచాలన్నారు. మిల్లుల వద్ద లారీలను ఎక్కువ సమయం వేచి ఉంచకుండా తగ్గించేందుకు గాను హమాలీల (కార్మికుల) సంఖ్యను పెంచుకోవాలని మిల్లర్లకు చెప్పారు. మిల్లుకు వచ్చిన ధాన్యం లారీలను ఎప్పటికప్పుడు అన్‌లోడ్ చేస్తూ రోజువారీ అన్లోడ్ సామర్థ్యాన్ని పెంచాలని, ఎక్కడా లారీలు ఎక్కువ సమయం వేచి ఉండకుండా చూడాలని అధికారులను, మిల్లర్లను ఆదేశించారు. ఇంకా ధాన్యం నిల్వ చేయడానికి గోదాములను సిద్ధం చేయాలని పౌర సరఫరాల అధికారికి సూచించారు. జిల్లా పౌర సరఫరాల అధికారి కాశీ విశ్వనాథ్, రెవెన్యూ అధికారులు, తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# పెన్షన్ - టెన్షన్

- జూన్ 2 నుండి రెండు లక్షల కొత్త పెన్షన్‌లు ఇస్తామని ప్రభుత్వ ప్రకటన
- కార్యాలయాల చుట్టూ అర్హులైన ఆశవాహుల ప్రదక్షిణలు
- సైట్ ఓపెన్ కాలేదంటున్న అధికారులు

**మిర్యాలగూడ, జూన్ 9 (జనంసాక్షి) :** రాష్ట్రం లో కొత్త పెన్షన్ లు ప్రజలను టెన్షన్ పెడుతున్నాయి.జూన్ 2 వ తారీఖు న రాష్ట్ర వ్యాప్తంగా 2 లక్షల కొత్త పెన్షన్ లు ఇస్తామని తెలంగాణ ప్రభుత్వం తరుపున శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక శాఖ మంత్రి చెప్పడం జరిగింది దీంతో రాష్ట్రా వ్యాప్తంగా ఎంతో మంది వయో వృద్దులు,వికలాంగులు, వితంతువులు మరియు ఒంటరి మహిళలు పెన్షన్ దరఖాస్తు చేసుకోవడానికి అటు గ్రామ పంచాయతీ కార్యాలయాల చుట్టూ , ఇటు మండలపరిషత్ ఆఫీస్ ల చుట్టూ తిరుగుతున్నారు.గత బి ఆర్ఎస్ ప్రభుత్వం 2018 లో 2వసారి అధికారం లోకి వచ్చిన తరువాత నుండి 2023 ఎన్నికల వరకు నూతన పెన్షన్ లను మం జూరు చేయలేదు.ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత నైనా కొత్త పెన్షన్ లు ఇస్తారేమో అని ఎదురు చూడక తప్పలేదు. చివరకు గత మార్చి లో బడ్జెట్ ప్రవేశ పెట్టిన సందర్భంలో స్వయానా ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ప్రకటించిన నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2 నుండి కొత్త పెన్షన్లు అయినటువంటి వృద్దాప్య మరియు వికలాంగుల,ఒంటరి మహిళల పెన్షన్ మంజూరు అవుతాయని ఆశతో ఉన్నారు.ప్రభుత్వ పెద్దలంతా సభల్లో,సమావేశల్లో ప్రకటించడం తో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అర్హులైన నిరుపేదలంతా ఎంతో సంతోషపడ్డారు. ఆ రోజు నుండి మీ సేవ కేంద్రాలకు వద్దకు వెళ్లి అందుకు కావాల్సిన పత్రాలను,ఆదాయ ధ్రువీకరణ పత్రాలను సిద్ధం చేసుకొని గ్రామ కార్యదర్శి కి దరఖాస్తులు ఇస్తున్నారు.ఇదే అదును గా భావించిన కొందరు గ్రామ కార్యదర్శులు ఇంటి పన్ను బకాయిలు మొత్తం చెల్లిస్తేనే దరఖాస్తులు తీసుకుంటామని కోర్రీలు పెట్టి ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. ఇంత చేసిన చివరకు మండలపరిషత్ కార్యాలయాల్లో దరఖాస్తులు ఆన్లైన్ చేయడానికి సైట్ ఓపెన్ కావడం లేదు.అదేమిటని అధికారులను అడిగితే మాకు ఇంకా పైనుండి జీవో నే రాలేదు మాకు ఇంకా చెప్పలేదు అంటూ సమాధానం చెప్తున్నారు.




### మాకు ఇంకా జీవోనే రాలేదు

తెలంగాణ ప్రభుత్వం జూన్ 2 నుండి కొత్త పెన్షన్లు ఇస్తామని చెప్పారు కదా ఎందుకు ఆన్లైన్ కావడం లేదు అని మిర్యాలగూడ ఎంపిడివో ని సంప్రదించగా మాకు పై నుండి ఇంకా జీవో నే రాలేదు,మార్గదర్శకాలు విడుదల కాలేదు. మేము కార్యదర్శుల కి ఎవరికీ ధరఖాస్తులు తీసుకోమని చెప్పలేదు ,ఇంకా ఆన్లైన్ సైట్ ఓపెన్ కావడం లేదు అని అన్నారు.

**శేషగిరి శర్మ, మిర్యాలగూడ ఎంపిడివో**

## హాలియాలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



**హాలియా, జూన్ 9 (జనం సాక్షి) :** పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోపు విద్యాసంస్థలు, విద్యార్థుల వసతి గృహాల్లోని చిన్నచిన్న మరమ్మతులు పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం అనుముల మండల కేంద్రం హాలియాలో పలు విద్యాసంస్థలు, వసతి గృహాలను ఆకస్మికంగా పరిశీలించారు. ముందుగా నూతనంగా నిర్మించిన సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్, అవసరమైన వైద్య పరికరాలు, సిబ్బంది నియామకం తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అవసరమైన పరికరాల ఏర్పాటును వేగవంతం చేసి కేంద్రాన్ని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అనంతరం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని పరిశీలించి మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయాలు సిద్ధంగా ఉంచాలని, పాఠశాల ప్రారంభానికి ముందే మరమ్మతులు పూర్తి చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, బీసీ బాలికల వసతి గృహాలను సందర్శించిన కలెక్టర్, పెండింగ్‌లో ఉన్న పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ఎస్సీ బాలికల వసతి గృహంలో నీరు నిల్వ ఉండటాన్ని గమనించి, నిల్వ నీరు తొలగించడంతో పాటు నీరు ఇంకిపోయే గుంతలు ఏర్పాటు చేయాలని పురపాలక అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల్లో సున్నం వేయించి పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయాలు వినియోగానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిపోయిన తాగునీటి నిల్వ ట్యాంకు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే డిగ్రీ కళాశాల ప్రాంగణంలో తెలంగాణ ప్రజా పాఠశాల ఏర్పాటుకు అనువైన స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

## డ్రాగన్‌ఫ్రూట్ తోటకు మంటలు

- రైతుకు తీవ్ర నష్టం
- ప్రభుత్వం ఆదుకోవాలని విజ్ఞప్తి



**శ్రీరంగాపూర్, జూన్ 9 (జనం సాక్షి) :** శ్రీరంగాపూర్ మండలం తాటిపాముల గ్రామానికి చెందిన అంకె బాలయ్య తన వ్యవసాయ పొలంలో ఎకరాన్నర విస్తీర్ణంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేస్తున్నారు. తోటలో మంటలు ఎలా వ్యాపించావో తెలియదు గానీ ,పంటలోని గడ్డికి మంటలు వ్యాపించి తోటంతా దెబ్బతిని నష్టం వాటిల్లడంతో రైతు కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపుగా రూ. 10 లక్షలదాకా పంటపై పెట్టుబడి పెట్టి ఒక్కసారిగా దగ్ధం కావడంతో బోరున విలపిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు, గ్రామస్తులు కోరుతున్నారు.

## ఐకేపీ కేంద్రంలో నిలిచిన వడ్ల కొనుగోళ్లు

- హైవేపై రైతుల రాస్తారోకో
- కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్




**మాడుగులపల్లి, జూన్ 9 (జనం సాక్షి) :** ప్రభుత్వ వైఫల్యం, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నిర్లక్ష్యంపై మాడుగులపల్లి మండల పరిధిలోని అన్నదాతలు రణభేరి మోగించారు గండ్రవాణి గూడెం ఐకేపీ కేంద్రంలో వడ్ల కొనుగోలు ప్రక్రియ పూర్తిగా నిలిచిపోవడంతో ఆగ్రహించిన రైతులు మంగళవారం కుక్కడం వద్ద నార్కట్‌పల్లి–అద్దంకి జాతీయ రహదారిపై భారీ రాస్తారోకో నిర్వహించారు వేములపల్లి పీఏసీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ కేంద్రంలో రోజుల తరబడి పడిగాపులు కాస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు మండిపడ్డారు ఆకాశం మబ్బుపట్టి ఎప్పుడు వర్షం వస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని, ధాన్యం తడిసిపోతే తాము నిలువునా మునిగిపోతామని, తాము రైతు పక్షపాతి అని చెప్పుకునే ఈ ప్రభుత్వానికి రైతుల గోస పట్టదా అని నిప్పులు చెరిగారు యిరైతులు ఒక్కసారిగా హైవేపై బైఠాయించడంతో నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి, ట్రాఫిక్ పూర్తిగా స్తంభించింది సమాచారం అందుకున్న పోలీసులు, స్థానిక అధికారులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని రైతులతో చర్చలు జరిపారు ఉన్నతాధికారులతో మాట్లాడి తక్షణమే, యుద్ధప్రాతిపదికన వడ్ల కొనుగోలు ప్రక్రియను ప్రారంభించి వేగవంతం చేస్తామని అధికారులు గట్టి హామీ ఇవ్వడంతో రైతులు శాంతించి ధర్నా విరమించారు త్వరితగతిన కొనుగోళ్లు పూర్తి చేయకపోతే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని రైతాంగం హెచ్చరించింది.

# దేశానికే ఆదర్శం ఇందిరమ్మ బీమా పథకం

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**యాదాద్రి కరస్పాండెంట్, జూన్ 8 (జనం సాక్షి) :** గత ప్రభుత్వం ధనిక రాష్ట్రమైన తెలంగాణ నిధులను దోపిడీ చేసిందని రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం భువనగిరిలో ఐదు కోట్లతో నిర్మించిన సర్కిల్ ఆఫీస్, వంక మామిడిలో 33/11 కెవి సబ్ స్టేషన్ శంకుస్థాపన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హాజరుకాగా ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఎమ్మెల్యే కుంభ అనిల్ కుమార్ రెడ్డితో ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ అనేక ప్రజా సమస్యలపై పోరాటం చేసి ప్రజల అవసరాలను తీర్చేందుకు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారని అన్నారు. ప్రజల కోసమే అధికారాన్ని ఉపయోగించే గొప్ప నాయకుడు కుంభం అనిల్ కుమార్ రెడ్డి అని అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సోనియా గాంధీ అందించిందని అప్పుడు ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ గత ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున అప్పులు చేయడంతో నేడు ప్రతి సంవత్సరం 75 వేల కోట్ల వడ్డీ అసలు కడుతున్నామని అన్నారు. రాష్ట్రంలో కోటి 15 లక్షల కుటుంబాలు ఉంటే కోటి ఆరు లక్షల కుటుంబాలకు ప్రతి వ్యక్తికి 6 కేజీల సన్నబియ్యాన్ని అందిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తమ ప్రభుత్వంలో 1,25,000 కోట్ల బ్యాంకు రుణాలను అందిస్తామని మహిళలకు బస్సులు, సోలార్ ప్లాంట్లు, క్యాంటీన్లు, పెట్రోల్ పంపులు కోసం రుణాలు అందిస్తున్నామని అన్నారు. అదేవిధంగా మహిళలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, 200 రూపాయల ఉచిత విద్యుత్తు 53 లక్షల కుటుంబాలకు అందిస్తున్నామని రాష్ట్రంలో 30 లక్షల పంప్ సెట్ లకు 14 కోట్ల రూపాయలు డిస్కములకు చెల్లిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం 10 సంవత్సరాలలో ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని ప్రజా పాలన అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందించామని, రాజీవ్ ఆరోగ్యశ్రీ ఐదు లక్షల రూపాయల నుండి పది లక్షల రూపాయలకు పెంచామని అన్నారు. రాష్ట్రంలో నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేశామని రాబోయే రోజుల్లో మరిన్ని ఇందిరమ్మ ఇండ్లు పేదలకు అందిస్తామని అన్నారు. ఫీజు రియంబర్స్మెంట్ నేరుగా విద్యార్థుల అకౌంట్లోకి వేయడంతో పేద విద్యార్థులు చదువుకునే అవకాశం కలిగిందని అన్నారు. కుటుంబ పెద్ద మరణిస్తే కుటుంబం రోడ్డున పడకుండా ఉండేందుకై ప్రభుత్వం తీసుకువచ్చే ఐదు లక్షల రూపాయల ఇందిరమ్మ బీమా దేశంలోనే కాకుండా ప్రపంచ దేశాలలో కూడా లేదని ఇందిరమ్మ భీమా పథకం దేశానికి ఆదర్శవంతం అని అన్నారు. భవిష్యత్తులో కూడా ఈ ప్రాంత అభివృద్ధి కోసం కృషి చేస్తామని ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి అడిగిన నిధులను తప్పక మంజూరు చేయిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీడీసీఎల్ సిఎండి జితేష్ పాటిల్, కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ భాస్కర్ రావు, ఎస్పీ అక్షాంశ యాదవ్, భువనగిరి మున్సిపల్ చైర్ పర్సన్ లు తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ పోచంపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ తడక వెంకటేశం, జిల్లా లైబ్రరీ చైర్మన్ అవేష్ చిస్తి తదితరులు పాల్గొన్నారు.



# విపణి



## రాణించిన సూచీలు

### ఆఖరిలో కొనుగోళ్ల మద్దతు..

**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు లాభాల్లో ముగిశాయి. ఆఖరిలో పీఎస్‌యూ బ్యాంక్, ఫైనాన్షియల్, ఆటో స్టాక్స్‌కు కొనుగోళ్ల మద్దతు లభించడం సూచీలకు కలిసొచ్చింది. మరోవైపు ఇరాన్‌- ఇజ్రాయెల్ మధ్య దాడులు ఆపడం, ఇరాన్‌- అమెరికా మధ్య శాంతి చర్చలు కొనసాగుతున్నాయని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించడం మన సూచీలపై సానుకూల ప్రభావం చూపింది. సెన్సెక్స్ ఉదయం 74,035.41 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,524.26) లాభాల్లో ప్రారంభమైంది. ఆరంభంలో కాసేపు నష్టాల్లోకి జారుకున్నా, తర్వాత కోలుకుంది. చివరికి 394.50 పాయింట్ల లాభంతో 73,918.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 119.10 పాయింట్ల లాభంతో 23,242.10 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.36గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇండిగో, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టైటాన్, ఎన్టీపీసీ, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, టెక్ మహీంద్రా, ఎటర్నల్ షేర్లు నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 92 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4332 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## బజాజ్ ఫిన్‌సర్వ్ బోర్డ్ నుంచి రాజీవ్ బజాజ్ బయటకు

బజాజ్ ఫిన్‌సర్వ్ బోర్డు నుంచి రాజీవ్ బజాజ్ వైదొలగనున్నారు. బజాజ్ ఆటో విభాగంలో పెరిగిన బాధ్యతల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు ఎక్స్ఛేంజీలకు సమర్పించిన ఫైలింగ్స్‌లో కంపెనీ పేర్కొంది.ప్రస్తుతం రాజీవ్ బజాజ్.. బజాజ్ గ్రూప్‌లో ఆటో విభాగానికి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. తాను పూర్తిగా ఆటోమొబైల్ వ్యాపారం పైనే దృష్టిసారించేందుకు.. బజాజ్ గ్రూప్‌లోని ఇతర సంస్థల నుంచి క్రమంగా వైదొలుగుతున్నారు. అలాగే కొత్తగా ఏర్పాటుచేసిన వ్యాపారాల పర్యవేక్షణ వంటి కారణాల రీత్యా కొన్ని బాధ్యతలను తగ్గించుకోవాల్సి వస్తోందని రాజీవ్ తెలియజేశారని, జులై 31న జరగనున్న వార్షిక సర్వసభ్య సమావేశంలో పునర్నియామకం కోరకూడదని ప్రకటించినట్లు ఫైలింగ్స్‌లో ఫిన్‌సర్వ్ పేర్కొంది.

# పెరిగిన నష్టం.. ఈడీ సమన్లు..

### జెప్టో ముసాయిదా పత్రాల్లో కీలక విషయాలు



దిల్లీ: ప్రముఖ క్విక్ కామర్స్ సంస్థ జెప్టో తొలి పబ్లిక్ ఇష్యూకు (జివజూబినీ ఎఖూ) సిద్ధమవుతోంది. ఇందులోభాగంగా సవరించిన తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ముసాయిదా పత్రాలను మార్కెట్ల నియంత్రణాధికార సంస్థ సెబీకి (రాఇఃఎ) సమర్పించింది. దీంట్లో పలు కీలక విషయాలు వెల్లడయ్యాయి. వాటా విక్రయం, నష్టాలు, ఈడీ సమన్లు వంటి అంశాలను కంపెనీ పొందుపరిచింది. ఆ వివరాలు ఇవీ..

వాటా విక్రయానికి ప్రమోటర్లు దూరం

జెప్టో సంస్థ ఐపీఓలో భాగంగా ఫ్రెష్ ఇష్యూ ద్వారా రూ.8,010 కోట్లను సమీకరించనుంది. దీంతోపాటు ఆఫర్ ఫర్ సేల్ ద్వారా వాటాదార్లు తమ షేర్లను విక్రయించనున్నారు. దీంతో జెప్టో ఐపీఓ సైజ్ సుమారు రూ.11వేల కోట్లు ఉండొచ్చని అంచనా వేస్తున్నారు. జులైలో ఐపీఓకు వచ్చే అవకాశం ఉంది. అయితే, ఈ ఐపీఓలో వ్యవస్థాపకులు ఆదిత్ పలీచా, కైవల్య వోహ్రా వాటా విక్రయానికి దూరంగా ఉండనున్నారు. వీరిద్దరికీ రూ.5 ముఖ విలువ కలిగిన 18.47 శాతానికి సమానమైన 230 కోట్ల షేర్లు ఉన్నాయి. అదే సమయంలో వెంచర్ క్యాపిటలిస్టులు మొత్తం 11.35 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఇందులో నెక్సస్ వెంచర్స్ అత్యధికంగా 8.77 కోట్ల షేర్లను అమ్మనుంది. రేజర్ వెంచర్స్ జెప్టో ఎల్ఎల్‌సీ, కాంట్రరీ జెప్ హోల్డింగ్స్ ఎల్ఎల్‌సీ, కైజర్ ఫౌండేషన్ హాస్పిటల్స్, ఐజర్ పర్మినెంట్ గ్రూప్ ట్రస్ట్ వంటి సంస్థలు కూడా ఆఫర్ ఫర్ సేల్ రూపంలో తమ వాటాలను విక్రయించనున్నాయి.

రూ.5,900 కోట్ల నష్టం

2025-26 ఆర్థిక సంవత్సరంలో జెప్టో రూ.5,905.19 కోట్ల నికర నష్టం చవిచూసినట్లు కంపెనీ సెబీకి సమర్పించిన తన ముసాయిదా పత్రాల్లో పేర్కొంది. అంతకుముందు ఏడాది ఈ నష్టం రూ.4,699.71 కోట్లుగా ఉంది. నష్టాలు పెరిగినప్పటికీ కార్యకలాపాల ద్వారా వచ్చే ఆదాయం రూ.11,109 కోట్ల నుంచి రూ.22,623 కోట్లకు పెరిగినట్లు వెల్లడించింది. మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో రూ.1,538 కోట్ల నికర నష్టాన్ని చవిచూసినట్లు వెల్లడించింది.

జెప్టోకు ఈడీ సమన్లు

ప్రమోటర్లైన ఆదిత్ పలిచా, కైవల్య వోహ్రా ఈడీ సమన్లు అందుకున్నట్లు కంపెనీ ముసాయిదా పత్రాల్లో వెల్లడించింది. విదేశీ పెట్టుబడులు, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సమాచారాన్ని ఈడీ కోరినట్లు తెలిపింది. 2026 ఏప్రిల్ 8న ఈ సమన్లు అందుకోగా.. సంబంధిత డాక్యుమెంట్లను ఈడీకి అందజేసినట్లు తెలిపింది. ఏప్రిల్ 17, 22 తేదీల్లో వోహ్రా, ఏప్రిల్ 20, మే 15 తేదీల్లో పలిచా ఈడీ ముందు హాజరైనట్లు వెల్లడించింది. ఈడీ కోరిన సమాచారం అందించామని, ఆపై ఈడీ నుంచి తిరిగి ఎటువంటి సమాచారం రాలేదని పేర్కొంది. 2020లో కిరాణాకార్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్‌గా మొదలైన ఈ సంస్థ తర్వాతికాలంలో జెప్టోగా అవతరించింది. దేశంలో అతిపెద్ద క్విక్ కామర్స్ కంపెనీల్లో ఒకటిగా అత్యంత వేగంగా ఎదిగింది. ఇప్పటికే బ్లింకిట్ మాతృ సంస్థ ఎటర్నల్, స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ మాతృ సంస్థ స్విగ్గీ స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టయ్యాయి. త్వరలో జెప్టో కూడా వాటి సరసన చేరనుంది.

## అరచేతిలో ఆన్‌లైన్...'డార్క్'గా పెడుతోంది రూ.వేల కోట్ల వాత..

దేశంలో ఈకామర్స్ సంస్థలు అనుసరిస్తున్న డార్క్ ప్యాటర్న్స్ వల్ల చేతిచమురు వదులుతోంది. అలా వినియోగదారులపై ఏటా రూ.28వేల కోట్లవరకు వాతపడుతోంది. ఈ మేరకు 'డార్క్ ప్యాటర్న్ ఇన్ ఇండియాస్ ఆన్‌లైన్ మార్కెట్‌ప్లేస్' శీర్షికన మార్కెట్ రీసెర్చ్ సంస్థ డేటమ్ ఇంటెలిజెన్స్ నివేదిక వెల్లడించింది. రహస్య ఛార్జీలు, డ్రిప్ ప్రైసింగ్, ఫాల్స్ అర్జెన్సీ, సబ్‌స్క్రిప్షన్ ఛార్జీల వంటి కారణంగా ఆన్‌లైన్ వినియోగదారుల్లో (రానిశ్రీతినివ బష్ట్రనీజూజూతినిణ) 88 శాతం మంది.. ఒక్కొక్కరు నెలకు రూ.78 నుంచి రూ.87 వరకు కోల్పోతున్నారని పేర్కొంది. వస్తువు లేదా సేవలను అంటగట్టేందుకు అనుసరించే వివిధ పద్ధతులే డార్క్ పాటర్న్స్‌గా వ్యవహరిస్తారు. వినియోగదారుల నిర్ణయాన్ని ప్రభావితం చేయడం, వారిని గందరగోళానికి గురిచేయడం, బలవంతంగా షాపింగ్ చేయించడమే వీటి లక్ష్యం. ఇలాంటి 13 రకాల డార్క్ పాటర్న్స్‌ను సెంట్రల్ కన్జూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (అఅఖం) గతంలోనే గుర్తించింది. వాటిలో కొన్ని..

ఫాల్స్ అర్జెన్సీ: రండి బాబూ రండీ! ఆలస్యం చేస్తే ఆశాభంగం! అంటూ గతంలో వీధుల్లో తిరిగే విక్రేతల ప్రచారం గుర్తుందా. ఆ తరహా ప్రచారానికి ఆధునిక రూపమే ఈ ఫాల్స్ అర్జెన్సీ. ఏదైనా వస్తువును నిర్దేశిత సమయంలో కొనుగోలు చేయకపోతే ఆఫర్‌ను కోల్పోతారని యూజర్‌ను గందరగోళంలోకి నెట్టేయడం దీని ముఖ్య ఉద్దేశం.

సబ్‌స్క్రిప్షన్ ట్రాప్స్: సేవల కోసం సైన్ అప్ చేసుకోమని సూచించడం, ఆపై దాన్ని రద్దు చేయడానికి వీలుకాకుండా చేయడం మరో ఎత్తుగడ. ఒకవేళ క్యాన్సిల్ చేయడానికి ప్రయత్నించినా అనేక దశలు దాటుకుంటూ వెళ్లాల్సి వస్తుంది.

**ఫోర్స్‌డ్ యాక్షన్:**

ఇదోతరహా ట్రిక్కు. కొన్నిసార్లు యూజర్లు అదనంగా వస్తువులను కొనేలా బలవంతం చేస్తారు. లేదా అక్కర్లేని సర్వీసుకు తనకు ఇష్టం లేకపోయినా అంటగడతారు. వారెంటీ, సబ్‌స్క్రిప్షన్ వంటివి ఈ కోవలోకి వస్తాయి. వస్తువును కొనే క్రమంలో వ్యక్తిగత సమాచారాన్ని అవసరం లేకపోయినా తప్పనిసరిగా షేర్ చేయడం కూడా ఫోర్స్‌డ్ యాక్షన్ కిందకే వస్తుంది.

బెయిట్ అండ్ స్విచ్: తక్కువ ధరకే వస్తుంది కదా అని వినియోగదారుడు ఆ వస్తువును కొనుగోలు చేయడానికి ప్రయత్నించగానే అది లేదని చూపి.. దాన్ని పోలి ఉన్న మరో ప్రోడక్టును అధిక ధరకు అంటగట్టడం మరో తరహా మోసం.

## వాహన రిటెయిల్ విక్రయాలు 10% పెరిగాయ్

### ఈవీల వృద్ధి 11% పైనే: ఫాడా

దేశీయంగా వాహన రిటెయిల్ విక్రయాలు ఈ ఏడాది మేలో 25,31,067కు చేరాయని వాహన డీలర్ల సమాఖ్య ఫాడా సోమవారం వెల్లడించింది. 2025 మేలో విక్రయమైన 23,10,451 వాహనాల కంటే ఇవి 9.55% అధికం. ఇదే సమయంలో విద్యుత్ వాహనాల (ఈవీల) అమ్మకాల్లో వృద్ధి తొలిసారిగా 11% శాతం పైనే నమోదైందని పేర్కొంది. గత నెలలో ఇంధన రిటెయిల్ ధరలు పెరగడం, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న నేపథ్యంలో అధిక మైలేజీ ఇచ్చే, హరిత వాహనాల కోసం విచారణలు పెరిగాయని డీలర్లు వెల్లడించారు. గత నెలలో వాణిజ్య వాహనాలు (సీవీలు), ప్రయాణికుల వాహనాలు (పీవీలు-కార్లు, ఎస్‌యూవీలు, వ్యాన్లు), విద్యుత్ వాహనాలు (ఈవీలు) మే నెలలో ఉత్తమ గణాంకాలను నమోదు చేశాయని ఫాడా తెలిపింది. ద్విచక్ర ఈవీల విభాగంలో ఏడాది క్రితం 6.11% వృద్ధి లభించగా, గత నెలలో 9.25 శాతానికి పెరిగిందని పేర్కొంది. ఈనెలలో జాగ్రత్తతో కూడిన ఆశావాదంతో ఉన్నట్లు డీలర్లు చెబుతున్నారు. వృద్ధి నమోదు కావొచ్చని 50.52% మంది, విక్రయాలు మార్పు లేకుండా నమోదు కావొచ్చని 39.90% మంది, క్షీణత ఉండొచ్చని 9.59% మంది భావిస్తున్నారు. రుతుపవనాల కదలికలు, గ్రామీణ నగదు ప్రవాహం, వ్యయ ఒత్తిళ్లు ఇందుకు కారణం కావొచ్చని అంచనా వేస్తున్నారు.

**గుడ్ల ధరలు**

హైదరాబాద్ ₹ 5.40
వరంగల్ ₹ 5.42

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్
₹ 1,45,800 (22 క్యారెట్లు)
₹ 1,59,060 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్
₹ 2,95,000

# ట్రంప్‌నకు బీబీ.. ప్రపంచానికి నెతన్యాహు..

### ఇజ్రాయెల్ ప్రధాని పేరు వెనుక కథ ఇదీ!



ఇరాన్‌తో దౌత్యపరమైన శాంతి ఒప్పందం కుదుర్చుకోవడానికి ఓ వైపు అమెరికా ప్రయత్నాలు చేస్తున్న వేళ.. లెబనాన్, బీరుట్‌లపై ఇజ్రాయెల్ దాడులకు పాల్పడడం అగ్రరాజ్యానికి కోపం తెప్పించింది. ఈ దాడుల వల్ల శాంతి చర్చలకు ఆటంకం కలుగుతోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "బీబీ, చాలా జాగ్రత్తగా ఉండాలి.. లేకపోతే నువ్వు ఒంటరిగా మిగిలిపోతావు' అంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుని ఉద్దేశించి హెచ్చరించారు. ఇరాన్‌పై ఇజ్రాయెల్ మళ్లీ దాడులకు దిగితే, అమెరికా నుంచి ఆశించిన సహకారం ఉండపోవచ్చని సంకేతమిచ్చారు. ఈ క్రమంలో నెతన్యాహుని 'బీబీ' అని సంబోధించడం ఆసక్తిగా మారింది. దీంతో నెతన్యాహుని బీబీ అని ఎందుకు సంబోధించారు? అంటూ నెటిజన్లు తెగ ఆరా తీస్తున్నారు.

బీబీ ముద్దు పేరు..

బెంజమిన్ నెతన్యాహు 1949లో జన్మించారు. చిన్నతనం నుంచే ఆయన కుటుంబ సభ్యులు, స్నేహితులు ముద్దుగా బీబీ అని పిలుచుకునేవారు. చిన్నప్పటి నుంచి అందరూ అలా పిలవడంతో ఆ పేరు స్థిరపడిపోయింది. ఇజ్రాయెల్‌లో ఎంతటి పెద్ద నాయకులకైనా, ప్రముఖులకైనా చిన్ననాటి ముద్దుపేర్లను అధికారికంగా, రాజకీయాల్లో కూడా వాడడం సాధారణం. పైగా హీబ్రూ భాషలో పేర్లను చిన్నవిగా చేయడానికి, ప్రేమగా పిలవడానికి ఒకే అక్షరాన్ని రెండుసార్లు పలకడం, చివర్లో ఐ (ఇ)ని చేర్చడం ఒక అలవాటు. అలా బెంజమిన్‌లో 'బి' కాస్తా బీబీగా మారింది. నెతన్యాహు ప్రధాని అయ్యాక కూడా స్థానిక పత్రికలు, టీవీలు, ప్రజలు ఆయనను 'బీబీ' అని సంబోధించడం విశేషం.

అలా నెతన్యాహు ఇంటి పేరైంది

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు పూర్తి పేరు వెనుకా ఆసక్తికర కథ దాగుంది. వాస్తవానికి బెంజమిన్ కుటుంబం పేరు మిలీకోవ్స్కీ తాత నాథన్ మిలీకోవ్స్కీ పోలాండ్ నుంచి తన కుటుంబంతో కలిసి అప్పటి పాలస్తీనా (ప్రస్తుత ఇజ్రాయెల్) ప్రాంతానికి వలస వచ్చారు. అలా వచ్చిన యూదులు తమ యూరోపియన్ పేర్లను పక్కన పెట్టి, తమ సంస్కృతికి అద్దం పట్టేలా హీబ్రూ పేర్లను మార్చుకునేవారు. ఈ క్రమంలోనే నాథన్ మిలీకోవ్స్కీ తన వ్యాసాలు రాయడానికి నెతన్యాహు అనే కలం పేరు ఎంచుకున్నారు. తర్వాతి కాలంలో అదే వారి కుటుంబం పేరుగా మారింది. అంతేకాదు నెతన్యాహు అంటే హీబ్రూ భాషలో 'దేవుడు ఇచ్చిన కానుక' లేదా 'భగవంతుడి ప్రసాదం' అని అర్థం. ఇక బెంజమిన్ అనేది బైబిల్ (పాత నిబంధన) ప్రకారం.. జాకోబ్ 12వ, చివరి కుమారుడి పేరు. అలా బెంజమిన్ నెతన్యాహు అయ్యారు. బెంజమిన్ తండ్రి బెంజియన్ మైలెకోవ్స్కీ కూడా తన పేరును బెంజియన్ నెతన్యాహుగా మార్చుకున్నారు. ఇజ్రాయెల్ ఆవిర్భావానికి కృషి చేసిన నేతల్లో ఈయన ఒకరు.

## ఊహాశక్తికి పరిమితుల్లేవు

### : సిరి ఏఐ ఆవిష్కరణలో టిమ్‌కుక్ వ్యాఖ్యలు

టెక్ దిగ్గజం యాపిల్ ఏఐ రంగంలోకి దూసుకొస్తోంది. కాలిఫోర్నియాలో నిర్వహిస్తోన్న వరల్డ్‌వైడ్ డెవలపర్స్ కాన్ఫరెన్స్‌లో సిరి ఏఐ ని ఆవిష్కరించింది. యాపిల్ ఇంటెలిజెన్స్ మద్దతుతో సమర్థవంతమైన సహాయకురాలిగా అది వ్యవహరిస్తుందని కంపెనీ అభివర్ణించింది. ఇది యూజర్ సూచనలను బట్టి ఆ వ్యక్తి ఏ పరిస్థితుల్లో ఉన్నారో అర్థం చేసుకొని, మరింత సహజంగా సంభాషిస్తుందని పేర్కొంది. ఈ వార్షిక కార్యక్రమంలో సీఈఓగా వైదొలుగుతున్న టిమ్‌కుక్ తన చివరి ప్రసంగం చేశారు. "సీఈఓగా ఈ కంపెనీలో జరిగిన గొప్ప విషయాల్లో ఈ కార్యక్రమాలు కూడా భాగం. మీతో కొత్త టూల్స్ గురించి పంచుకోవడం, వాటిని మీరు ఎలా ఉపయోగిస్తున్నారో చూడటం గొప్పగా అనిపించేది. ఊహాశక్తికి ఎలాంటి పరిమితులు లేవు" అని పేర్కొన్నారు. టెక్ ప్రపంచంలో యాపిల్ ప్రభావాన్ని ప్రస్తావిస్తూ.. కంపెనీ భవిష్యత్తుపై ఆశాభావం వ్యక్తంచేశారు. "ప్రజలు ఒకరితో ఒకరు అనుసంధానం అయ్యేందుకు, నేర్చుకోవడానికి, ప్రపంచాన్ని అసాధారణమైన మార్గాల్లో చూసేందుకు ఇన్నేళ్లుగా మీరు కృషి చేశారు. ఇలా డబ్ల్యూడబ్ల్యూడీసీల్లో ఆవిష్కరించే కొత్త టెక్నాలజీలు, భవిష్యత్ ఆవిష్కరణలతో మున్ముందు మంచి రోజులు వస్తాయని నేను విశ్వసిస్తున్నాను" అని కుక్ సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. 15 ఏళ్లపాటు కంపెనీని నడిపించిన కుక్.. ఇంకొన్ని నెలల్లో సీఈఓ పదవి నుంచి వైదొలగనున్నారు. ఆ స్థానంలోకి హార్డ్‌వేర్ ఇంజినీరింగ్ విభాగానికి సీనియర్ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న జాన్ టెర్నస్ రానున్నారు. సెప్టెంబర్ ఒకటిన ఆయన బాధ్యతలు స్వీకరిస్తారు.




## చైనాతో పోలిస్తే భారత్‌లో కంపెనీలకు ప్రభుత్వ మద్దతు తక్కువే

### ఓఈసీడీ నివేదిక

దిల్లీ: 2005-2024 మధ్య కాలంలో భారతీయ సంస్థలు తమ చైనా ప్రత్యర్థి కంపెనీల కంటే గణనీయంగా తక్కువ ప్రభుత్వ మద్దతును పొందాయని ఓఈసీడీ (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) నివేదిక వెల్లడించింది. సంస్థలు వాస్తవంగా ఏమి పొందుతున్నాయో (ప్రభుత్వాలు వెల్లడించేది కాదు) ఓఈసీడీ మ్యాజిక్ డేటాబేస్ ఆఫ్ ఇండస్ట్రియల్ సబ్సిడీస్ కొలుస్తుంటుంది. ఇది 2005-24 మధ్య కాలంలో 15 కీలక రంగాల్లో ప్రపంచంలోని 525 అతి పెద్ద తయారీదార్లను పరిగణనలోకి తీసుకుని నివేదిక రూపొందించింది. ఈ కొలత మూడు సాధనాల ద్వారా జరుగుతుంది. అందులో గ్రాంట్లు, ఆదాయపు పన్ను రాయితీలు, మార్కెట్ విలువ కంటే తక్కువ వడ్డీకి రుణాలు ఉన్నాయి. 2005-24 మధ్య కాలంలో చైనా సంస్థలు ఓఈసీడీ ఆధారిత సంస్థల కంటే సగటున 3-8 రెట్లు ఎక్కువగా ప్రభుత్వ మద్దతు పొందాయి. బ్రెజిల్, భారత్, ఇండోనేషియా వంటి ఓఈసీడీ యేతర ఆర్థిక వ్యవస్థల్లోని సంస్థలు పొందిన మద్దతు కంటే ఈ సబ్సిడీలు ఎక్కువగా ఉన్నాయి. ఇది చైనా తయారీ రంగ పోటీతత్వం వెనుక ఉన్న కీలక కారకాలలో ఒకదాన్ని ప్రతిబింబిస్తోందని నివేదిక తెలిపింది. ఓఈసీడీ అనేది ప్రధానంగా అభివృద్ధి చెందిన 38 ఆర్థిక వ్యవస్థలతో కూడిన ఒక అంతర్ ప్రభుత్వ సంస్థ. ఇది సభ్య దేశాల మధ్య ఆర్థిక వృద్ధి, వాణిజ్యం, పెట్టుబడి, విధాన సమన్వయాన్ని ప్రోత్సహించడానికి పని చేస్తుంది. దీని సభ్య దేశాల్లో అమెరికా, యూకే, కెనడా, జర్మనీ, ఫ్రాన్స్, ఇటలీ, జపాన్, దక్షిణ కొరియా, ఆస్ట్రేలియా ఉన్నాయి.

## డ్రైవింగ్ లైసెన్స్ చెల్లుబాటు ఇక 50 ఏళ్లు?

దేశవ్యాప్తంగా లక్షల మంది వాహనదారులకు ఊరట కల్పించేలా కేంద్రప్రభుత్వం కీలక ఆలోచన చేస్తోంది. డ్రైవింగ్ లైసెన్స్ చెల్లుబాటు గడువును 20 ఏళ్ల నుంచి 50 ఏళ్లకు పెంచే అంశాన్ని పరిశీలిస్తోంది. అదే జరిగితే డ్రైవింగ్ లైసెన్స్ కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం తప్పుతుంది. డ్రైవింగ్ లైసెన్స్ కాలపరిమితితో పాటు మరిన్ని ప్రతిపాదనలు రహదారి మంత్రిత్వశాఖ పరిశీలనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.ప్రస్తుతం ఎవరైనా డ్రైవింగ్ లైసెన్స్ తీసుకుంటే 20 ఏళ్ల వరకు మాత్రమే అది చెల్లుబాటు అవుతుంది. ఆపై అవసరమైన పత్రాలు సమర్పించి లైసెన్స్‌ను రెన్యువల్ చేయించుకోవాలి. కొన్ని సందర్భాల్లో వైద్య ధ్రువీకరణ పత్రం కూడా అవసరం పడుతుంది. ఈ క్రమంలోనే కాలపరిమితిని 50 ఏళ్లకు పెంచాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అయితే, దీనివల్ల రెన్యువల్‌పై రావాల్సిన ఆదాయం తగ్గిపోతుందని రాష్ట్ర ప్రభుత్వాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నట్లు సంబంధిత అధికారి తెలిపారు.మరోవైపు వాహన యాజమాన్య హక్కు (వెహికల్ ఓనర్‌షిప్) బదిలీ, పర్మిట్ రెన్యువల్ ప్రక్రియను పూర్తిగా ఆన్‌లైన్ చేయడం వంటి అంశాలనూ పరిశీలిస్తున్నట్లు రవాణా మంత్రిత్వ శాఖ వర్గాలు పేర్కొన్నాయి. దీనివల్ల పేపర్‌వర్క్ తగ్గడంతో పాటు, పౌరులు రవాణా శాఖ కార్యాలయాలకు తరచూ వెళ్లే అవసరం తప్పుతుందని తెలిపాయి. అయితే, ప్రస్తుతం ఈ ప్రతిపాదనలన్నీ పరిశీలన దశలోనే ఉన్నాయని, దీనిపై చర్చలు ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నట్లు పేర్కొన్నాయి.



## కాంగోలో అంతకంతకూ విస్తరిస్తున్న ఎబోలా

19 మంది కోలుకున్నారు. మరో 309 మంది ఎబోలా అనుమానితులు ఐసోలేషన్‌లో ఉన్నారు. ఆదివారం ఒక్కరోజే ఇటురి, నార్త్ కివులలో 35 కొత్త కేసులు నమోదవగా, మరో 10 మంది మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం వైరస్ తీవ్రత పెరుగుతోందని, కొన్నిరోజుల తర్వాత తీవ్రత తగ్గే అవకాశం ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. వ్యాధి నిర్ధరణ.. వైరస్‌కు సరైన టీకా, చికిత్స లేకపోవడం సవాళ్లుగా మారాయని తెలిపారు. కేసుల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండొచ్చని భావిస్తున్నారు. ఈనేపథ్యంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ హెచ్చరికలు జారీ చేసింది. ప్రాంతీయంగా ఈ వ్యాధి మరింత వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంది. ఇక, ఉగాండాలో 19 ఎబోలా కేసులు నిర్ధరణ అయ్యాయి. కాగా.. రెండు మరణాలు చోటుచేసుకున్నాయి.


## స్పేస్‌ఎక్స్ ఐపీఓలో మనమూ డబ్బులు పెట్టొచ్చా?

ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్‌కు చెందిన స్పేస్‌ఎక్స్ ఐపీఓ అమెరికాలో ఆరంభం కానుంది. కంపెనీ విలువను 1.75 లక్షల కోట్ల డాలర్లు (రూ.167 లక్షల కోట్లు)గా పరిగణిస్తూ, ఈ ఇష్యూ ద్వారా సంస్థ 75 బిలియన్ డాలర్లు (దాదాపు రూ.7.27 లక్షల కోట్లు) సమీకరించనుంది. సౌదీ ఆరామ్‌కో 2019లో సమీకరించిన 29.4 బి. డాలర్ల ఇష్యూనే ఇప్పటివరకు అతిపెద్దదిగా ఉండగా, ఇపుడు స్పేస్‌ఎక్స్ అంతకు రెట్టింపునకు పైగా నిధులను మార్కెట్ల నుంచి తీసుకోనుంది. మరి ఈ ఐపీఓలో భారతీయులూ పాల్గొనవచ్చా అన్నదే అసలు ప్రశ్న. సాధ్యమే కానీ..: స్పేస్‌ఎక్స్ షేర్లను భారతీయ మదుపర్లు కొనుగోలు చేయొచ్చు కానీ నేరుగా ఐపీఓ ద్వారా సొంతం చేసుకోలేరు. ఆ షేర్లు స్టాక్ మార్కెట్లలో లిస్ట్ అయ్యాక, సెకండరీ మార్కెట్ల నుంచి దక్కించుకోవచ్చు. అది కూడా ఆర్‌బీఐ తెచ్చిన లిబరలైజ్డ్ రెమిటెన్స్ స్కీమ్(ఎల్ఆర్ఎస్) కింద అంతర్జాతీయ బ్రోకరేజీల ద్వారానే సాధ్యమవుతుంది. ఎల్ఆర్ఎస్ కింద భారతీయ నివాసితులు ఒక ఆర్థిక సంవత్సరంలో విదేశాల్లో 2,50,000 డాలర్ల వరకు (సుమారు రూ.2.42 కోట్లు) పెట్టుబడులు పెట్టొచ్చు.

## గ్రేట్ నికోబార్ ఎయిర్‌పోర్ట్‌కు కేంద్రం అనుమతి

విమానాశ్రయాన్ని విస్తరించే ఆలోచనను పక్కనపెట్టింది. పర్యావరణపరంగా వైవిధ్యమైన ద్వీపంలో రూ.81వేల కోట్లతో ప్రకటించిన గ్రేట్ నికోబార్ ఐలాండ్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఇప్పటికే రాజకీయ దుమారం రేపుతోంది. ఈక్రమంలోనే ప్రభుత్వం నుంచి అనుమతులు రావడం గమనార్హం. పౌర, సైనిక అవసరాలు తీరేలా గలాథియా బే సమీపంలోని చింగెన్ వద్ద ఈ ఎయిర్‌పోర్ట్‌ను నిర్మించనున్నట్లు తెలుస్తోంది. భౌగోళిక పరిమితుల వల్ల ఇప్పటికే ఉన్న ఐఎన్ఎస్ బాజ్ ఎయిర్‌స్టేషన్ వద్ద రన్‌వేను విస్తరించేందుకు దీర్ఘకాలికంగా ఉన్న ప్రణాళికను పక్కనపెట్టాల్సి వచ్చింది. రానున్న ఐదేళ్లలో దీని నిర్మాణం పూర్తికావొచ్చని సమాచారం. నికోబార్ దీవి మలక్కా జలసంధికి అతిసమీపంలో ఉండటంతో జీఎన్ఐ ప్రాజెక్టు వ్యూహాత్మక ప్రాధాన్యం సంతరించుకుందని రక్షణరంగ వర్గాలు వివరించాయి. జలసంధికి సమీపంలోనే యుద్ధ నౌకలు, వైమానిక సదుపాయాలు ఉండటం నిఘాకు ఎంతో కీలకం కానుందన్నాయి.

## ఇక నచ్చినట్టుగా ఇన్‌స్టా ప్రొఫైల్ పోస్టుల ఆర్డర్




ఇన్‌స్టాగ్రామ్ ఎప్పటికప్పుడు కొత్త అప్‌డేట్‌లను తీసుకువస్తుంటుంది. యూజర్లు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న మరో ఫీచర్‌తో ముందుకొచ్చింది ఇన్‌స్టా ప్రొఫైల్‌లోని పోస్టులను డిలీట్ చేయకుండా, రీపోస్టు చేయకుండానే ఇకపై నచ్చినట్టుగా పోస్టుల ఆర్డర్‌ను సెట్ చేసుకోవచ్చు. ఇందుకోసం 'రీ ఆర్డర్ గ్రిడ్' ఆప్షన్‌ను తీసుకొస్తుంది. దీంతో ప్రొఫైల్ పోస్టుల ఆర్డర్‌పై యూజర్లకు పూర్తి నియంత్రణ రానుంది. వారి అభిరుచికి తగినట్టుగా ప్రొఫైల్ గ్రిడ్ మార్చుకోవచ్చు. ఇందుకు సంబంధించిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్ తన బ్లాగ్‌లో పోస్టు చేసింది. ఇంతకుముందు ఇన్‌స్టా ప్రొఫైల్‌లో పోస్టులు క్రమపద్ధతిలో కనిపించేవి. అంటే తాజా కంటెంట్ ముందు వరుసలో దర్శనమిస్తుంది. గతంలో చేసిన పోస్టులు ప్రొఫైల్ గ్రిడ్‌లో ఎక్కడో చివరకు చేరేవి. దీంతో నచ్చిన కంటెంట్‌ను డిలీట్ చేసి మళ్లీ రీపోస్టు చేసుకోవాల్సిన పరిస్థితి. దీనికి చెక్ పెట్టేందుకు ఇన్‌స్టాగ్రామ్ రీ ఆర్డర్ గ్రిడ్ ఆప్షన్ ప్రవేశపెట్టింది. ఈ ఫీచర్‌తో ఇకపై యూజర్ తనకు నచ్చినట్టుగా ప్రొఫైల్ పోస్టుల గ్రిడ్‌ను సెట్ చేసుకోవచ్చు. దీంతో పోస్టుల ఆర్డర్ మాత్రమే మారుతుంది. కంటెంట్ అప్‌లోడ్ సమయాల్లో ఎలాంటి మార్పులు ఉండవు. ఈ ఫీచర్‌ను ఇన్‌స్టాగ్రామ్ రోల్‌ఔట్ చేసింది. దశలవారీగా అందరికీ అందుబాటులోకి రానుంది.


గ్రిడ్ రీఆర్డర్ సెట్ చేయడం ఇలా..

ముందుగా ఇన్‌స్టాగ్రామ్ ఓపెన్ చేసి ప్రొఫైల్ పేజీలోకి వెళ్లాలి. ఆర్డర్ మార్చాలనుకుంటున్న పోస్టుపై లాంగ్ ప్రెస్ చేయగానే ఓ మెనూ వస్తుంది. అందులో రీ ఆర్డర్ గ్రిడ్ ఆప్షన్ ఎంచుకోవాలి. అన్ని పోస్టులు కనిపించే డెడికేటెడ్ ఎడిటింగ్ స్క్రీన్ కనిపిస్తుంది. దీంతో మీకు నచ్చిన ఆర్డర్‌లో పోస్టులను మార్చుకోవచ్చు. ఆ తర్వాత అప్‌డేట్ అయిన ప్రొఫైల్ లేఅవుట్ కనిపిస్తుంది.



- 15 ఏళ్లుగా మార్కెట్ స్థలాన్ని వినియోగిస్తున్న విద్యాసంస్థపై విమర్శలు
- పేద రైతులపై పన్నులు.. కార్పొరేట్ సంస్థలకు మినహాయింపులా?
- బకాయిలు వసూలు చేసి పూర్తి విచారణ జరపాలని డిమాండ్
- స్పందించకపోతే హైకోర్టులో పిల్ వేస్తామని హెచ్చరిక

# మార్కెట్ స్థలంలో ప్రైవేట్ స్కూల్ దౌర్జన్యం



### భిక్కనూరు పంచాయతీకి లక్షల ఆదాయ నష్టం జరిగిందంటూ ఆరోపణలు

**భిక్కనూరు, జూన్ 9 (జనంసాక్షి):** భిక్కనూరు గ్రామపంచాయతీకి చెందిన మార్కెట్ స్థలాన్ని ఓ ప్రైవేట్ విద్యాసంస్థ సంవత్సరాలుగా వినియోగించుకుంటూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు, రుసుములు చెల్లించకుండా లక్షల రూపాయల ఆదాయానికి గండి కొడుతోందని సామాజిక కార్యకర్త బత్తుల భిక్షపతి ఆరోపించారు. కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ మార్కెట్ స్థలాన్ని శ్రీ చైతన్య విద్యానికేతన్ యాజమాన్యం స్కూల్ గ్రౌండ్, బస్సుల పార్కింగ్ స్థలంగా వినియోగిస్తోందని పేర్కొన్నారు. పేద రైతులు తాము పండించిన కూరగాయలు అమ్ముకునేందుకు మార్కెట్‌కు వస్తే గంపకు రూ.20 చొప్పున పంచాయతీ అధికారులు రుసుము వసూలు చేస్తున్నారని, అయితే అదే స్థలాన్ని గత 15 ఏళ్లుగా వినియోగిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థ నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయకపోవడం అన్యాయమని ప్రశ్నించారు. సామాన్యులకు ఒక న్యాయం, కార్పొరేట్ సంస్థలకు మరో న్యాయమా అని నిలదీశారు. భిక్కనూరు మార్కెట్‌లో నెలకు కేవలం నాలుగు రోజులు మాత్రమే అధికారికంగా వ్యాపార కార్యకలాపాలు జరుగుతున్నప్పటికీ, పేద రైతులు, వ్యాపారుల ద్వారా సంవత్సరానికి సుమారు రూ.60 లక్షల వరకు ఆదాయం గ్రామపంచాయతీకి వస్తోందని వివరించారు. అలాంటప్పుడు ఏడాదికి దాదాపు 200 రోజులకు పైగా మార్కెట్ స్థలాన్ని వినియోగిస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థ ఎంత మేర పన్నులు చెల్లించాల్సి ఉంటుందో అధికారులు లెక్కలు వేయాలని సూచించారు. పంచాయతీకి రావాల్సిన భారీ ఆదాయం కోల్పోయిన నేపథ్యంలో సంబంధిత విద్యాసంస్థ నుంచి గత 15 ఏళ్ల బకాయిలను మార్కెట్ రేటు ప్రకారం అపరాధ రుసుముతో సహా వసూలు చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక అధికారుల నిర్లక్ష్యం వల్లే గ్రామపంచాయతీ ఖజానాకు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని ఆరోపించారు. ఇదిలా ఉండగా, పాత బకాయిలు, వివాదాలు పరిష్కారం కాకముందే భిక్కనూరు గ్రామంలోని పలు సర్వే నంబర్లలో కొత్త భవన నిర్మాణం కోసం నాలా కన్వర్షన్ అనుమతులు పొందేందుకు యాజమాన్యం ప్రయత్నాలు చేస్తోందని భిక్షపతి ఆరోపించారు. బకాయిలు చెల్లించని సంస్థలకు కొత్త అనుమతులు ఇవ్వకూడదని మండల రెవెన్యూ అధికారికి అభ్యంతర పత్రం సమర్పించినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ ఆస్తులను పరిరక్షించడంలో అధికారులు విఫలమయ్యారని విమర్శించిన ఆయన, తక్షణమే పూర్తి స్థాయి విచారణ జరిపి ప్రభుత్వానికి జరిగిన నష్టాన్ని అంచనా వేయాలని కోరారు. లేనిపక్షంలో జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా విద్యాశాఖ అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు గౌరవ హైకోర్టులో ప్రజాహిత వ్యాజ్యం (పిల్) దాఖలు చేస్తామని హెచ్చరించారు. పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్న వ్యవహారంపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించి గ్రామ ఆస్తులను, ప్రజా ధనాన్ని కాపాడాలని స్థానిక ప్రజలు కూడా డిమాండ్ చేస్తున్నారు.

# రేషన్ షాపుల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలి

- ప్రజా పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలి
- ఆహార భద్రతా చట్టాన్ని అమలు చేయాలి
- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి



**ముషీరాబాద్, జూన్ 09 (జనం సాక్షి):** నిరంతరం పెరుగుతున్న ధరలు నేపథ్యంలో పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని,ఆ ఇబ్బందులను అధిగమించాలంటే తక్షణమే ప్రజా పంపిణీ వ్యవస్థను పటిష్టం చేసి, రేషన్ షాపుల ద్వారా బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులు అందించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్రకమిటీ పిలుపులో భాగంగా ఆర్.అరుణజ్యోతి అధ్యక్షతన మంగళవారం ఎర్రమంజిల్ లోని సివిల్ సప్లై కార్యాలయం ముందు ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లు లక్ష్మి మాట్లాడుతూ...కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ విధానల వల్ల నిత్యావసనర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని మండిపడ్డారు. 2014 ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ధరలు తగ్గించక పోగా ధరల పెరుగుదలను నియంత్రించటంలో కేంద్ర ప్రభుత్వం కనీస చర్యలు చెపట్టలేదని విమర్శించారు. నిత్యావసర సరుకులు ధరలు, పెట్రోల్, డిజిల్, గ్యాస్ ధరలు, స్కూల్ ఫీజులు పెరుగుతుండటంతో సామాన్య ప్రజల జీవనం భారంగా మారిందని అవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 1 కోటి 5 లక్షల 42 వేల 188 బీపీఎల్ కార్డులు, 3 కోట్ల 39 లక్షల 96 వేల 239 మంది సభ్యులు ఉన్నారన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యక్తికి ఆరు కేజీలు మాత్రమే ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యం అందించబడుతోందన్నారు. ప్రజల ఆహార భద్రతను, జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి బియ్యంతో పాటు, పప్పు రెండు కేజీలు, మంచినూనె రెండు కేజీలు, మొక్క జొన్నలు రెండు కేజీలు, చక్కర ఒక కేజీ, కారం 500గ్రాములు, పసుపు 250గ్రాములు, జీలకర్ర 100గ్రాములు, పామాయిల్ ఒక లీటర్, కొబ్బరి నూనె 25గ్రాములు, ఆవాలు, జొన్నలు, పల్లీలు, సబ్బులు కలిపి 14 రకాల నిత్యావసర సరుకులు రేషన్ షాపుల ద్వారా అందించాల్సిన అవసరం ఉందన్నారు. నిత్యావసర సరుకులు పెరగడం వల్ల మహిళలు సరైన పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోకపోవడం వల్ల 50శాతం రక్తహీనత ఎదుర్కొంటున్నారు. 0.6 ఉన్న పిల్లలకు పౌష్టిక ఆహారం అందక దేశవ్యాప్తంగా లక్షలాది మంది పిల్లలు చనిపోతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) విజ్ఞప్తి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయకార్యదర్శులు కెవెన్ ఆశలత, కె. నాగలక్ష్మి, పి. శశికళ, వై. వరలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బట్టుపల్లి అనూరథ, ఐద్వా నాయకులు లక్ష్మమ్మ, సృజన, నవీన, శాబనాబేగం, మస్తాన్ బీ, ఎమ్. అరుణ, సంధ్య, ఇందిర, లక్ష్మి, లక్ష్మి, వెంకటమ్మ, కవిత, భవాని తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డును ఎత్తేయకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం

- కాలుష్య కొరల్లోకి గండిపేట చెరువు చేరే అవకాశం
- హిమాయత్ నగర్ రెవెన్యూ పరిధిలోని డంపింగ్ యార్డును పరిశీలించిన సబితా ఇంద్రారెడ్డి

**మొయినాబాద్, జూన్ 9 జనం సాక్షి :** జంట నగరాలకు తాగునీరు అందించే జంట జలాశయాల్లో ఒకటైన గండిపేట చెరువు కాలుష్యానికి కారణమయ్యే ఈ డంపింగ్ యార్డును తొలగించకుంటే బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి హెచ్చరించారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ సర్వేనెంబర్ 151 ప్రభుత్వ భూమిలో ఉన్న డంపింగ్ యార్డ్ ను ఆమె స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం మొయినాబాద్ మున్సిపల్ కమిషనర్ తో ఫోన్లో మాట్లాడారు. విలేకరులతో మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో భాగంగా అప్పట్లో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రతి గ్రామంలో పల్లె ప్రకృతి వనాలు, క్రీడా మైదానాలను ఏర్పాటు చేయడం జరిగిందని గుర్తుచేశారు. అయితే తెలంగాణలో అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం వాటిని తొలగించి చెత్తచెదారాలతో డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసి ఇక్కడి ప్రాంతాలను కలుషితం చేస్తున్నారని ఆరోపించారు. ఒక వైపు మూసీ ప్రక్షాళన పేరిట పేదల ఇళ్లు కుల్చుతున్న రేవంత్ రెడ్డి బంగారం లాంటి ప్రాంతాన్ని మురికి కంపగా మారుస్తున్నాడని ఆరోపించారు. హైదరాబాద్ నగరానికి త్రాగు నీరు అందించే జంటజలాశయల్లో ఒకటైన గండిపేట చెరువు ఈ డంపింగ్ యార్డుకు అతి సమీపంలో ఉందని వర్షం కురిస్తే కలుషితమవుతుందని ఆరోపించారు. ఆమె వెంట హిమాయత్ నగర్ మాజీ సర్పంచ్ ముదిగొండ మంజుల రవి యాదవ్, నాయకులు అనంత రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దారెడ్డి వెంకట్ రెడ్డి, శ్రీహరి యాదవ్, కొత్త నరసింహారెడ్డి, మోర శ్రీనివాస్, మోహన్ రెడ్డి, రవుఫ్, కౌన్సిలర్ శ్రీధర్, షాబాద్ మధు, పరమేష్, మోత్కుపల్లి సునీల్, కిరణ్ తదితరులు ఉన్నారు.

# బోడుప్పల్ ప్రాంత అభివృద్ధే మా లక్ష్యం

- మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్
- రూ.80 లక్షలతో బీపీఆర్-ఆర్ఎన్ఎస్ మార్గంలో డ్రైనేజీ పనుల ప్రారంభం

**బోడుప్పల్-జనంసాక్షి :** బోడుప్పల్ సర్కిల్‌ను సమగ్ర అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడమే తమ లక్ష్యమని మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పేర్కొన్నారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన తెలిపారు.మంగళవారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బీపీఆర్ కాలనీ నుంచి ఆర్ఎన్ఎస్ కాలనీ ప్రధాన మార్గం వరకు రూ.80 లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలనీల్లో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఈ పనులు దోహదపడతాయని చెప్పారు.నగర విస్తరణకు అనుగుణంగా మౌలిక వసతులను బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. బోడుప్పల్ ప్రాంత అభివృద్ధికి ఇప్పటికే పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు తీసుకువచ్చి రహదారులు, డ్రైనేజీలు, పార్కులు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులను మరింత మెరుగుపరుస్తామని అజయ్ యాదవ్ తెలిపారు.ప్రజల సహకారంతో బోడుప్పల్‌ను ఆదర్శవంతమైన సర్కిల్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నరసింహ రెడ్డి,బీ-బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్,సీనియర్ నాయకులు బొమ్మకు రమేష్,మాజీ కార్పొరేటర్లు కొత్త దుర్గమ్మ, బొమ్మక్ కళ్యాణ్ కుమార్,కుంభం కిరణ్ కుమార్ రెడ్డి,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు జీ.సమతా యాదవ్,యువజన కాంగ్రెస్ నాయకుడు అసర్ల బీరప్ప,పడతం లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## దుస్తుల దుకాణంలో చోరీ

**పోచారం:** అన్నోజిగూడలోని ఓ దుస్తుల దుకాణంలో గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోచారం ఐటీసీ పోలీసుల కథనం ప్రకారం, నైనకుల మాధవి ఎస్టీ కమ్యూనిటీ హాల్ పక్కన "ఇష్నా కలెక్షన్స్" పేరుతో గత 45 రోజులుగా దుస్తుల వ్యాపారం నిర్వహిస్తున్నారు. సోమవారం రాత్రి 9 గం.ల సమయంలో దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లిన ఆమెకు మంగళవారం పొరుగు దుకాణ యజ మాని నుంచి షాపు షట్టర్ తాళం పగులగొట్టినట్లు సమాచారం. గుర్తుతెలియని వ్యక్తులు షట్టర్ తాళం పగుల గొట్టి దుకాణం లోకి ప్రవేశించి నగదును అపహరించినట్లు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



## ముందు పాపను కాపాడుకుందాం.. నేనున్నా


- ఖమ్మం ఘోరంపై మంత్రి పొంగులేటి తీవ్ర ఆవేదన
- బాధితురాలికి 'నిమ్స్'లో అత్యున్నత వైద్యం..
- నిందితుడికి కఠిన శిక్ష తప్పదు

ఖమ్మం నగరంలో బాలికపై జరిగిన అమానుష దాడి, హత్యాయత్నం ఘటనపై తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి, ఆవేదన వ్యక్తం చేశారు. సమాజం తలదించుకునేలా ప్రవర్తించిన ఆ కఠినాత్ముడిని చట్టపరంగా అత్యంత కఠినంగా శిక్షిస్తామని ఆయన స్పష్టం చేశారు. తల్లంపాడు గ్రామానికి చెందిన రేగళ్ల రమేశ్ కుమార్తెపై జరిగిన ఈ ఘాతుకం తనను తీవ్రంగా కలచివేసిందని, నిందితుడిపై తక్షణమే కఠిన చట్టాల కింద కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించారు.

**బాధితులకు పూర్తి అండ..**

విషయం తెలిసిన వెంటనే మంత్రి పొంగులేటి బాధిత బాలిక తండ్రితో, స్థానిక సర్పంచ్‌తో ఫోన్ లో మాట్లాడి పరామర్శించారు. "ముందు మన పాప ప్రాణాలను కాపాడుకుందాం, అధైర్య పడకండి.. నేనున్నా" అని ధైర్యం చెప్పారు. బాలికకు అత్యున్నత వైద్యం అందించడం కోసం తక్షణమే హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రికి తరలించాలని సూచించారు. పాప వైద్య ఖర్చులన్నింటినీ తానే భరిస్తానని, బాధిత కుటుంబానికి పూర్తి న్యాయం జరిగేలా చూస్తానని మంత్రి పొంగులేటి భరోసానిచ్చారు.

# పసి మొగ్గపై మృగాడి పడగ



### రక్తపు మడుగులో.. విరిగిన ఎముకలతో మృత్యువుతో పోరాటం

భవనం పైనుంచి ఒక్కసారిగా కిందపడటంతో ఆ మైనర్ బాలికకు అత్యంత తీవ్రమైన గాయాలయ్యాయి. కింద పడిన వేగానికి ఆమె వెన్నెముక పూర్తిగా దెబ్బతినడమే కాకుండా, రెండు చేతులు, కాళ్లు విరిగిపోయాయి. పక్కటెముకలు కూడా తీవ్రంగా విరగడంతో ఊపిరి పీల్చుకోవడం కూడా ఆ చిన్నారికి నరకప్రాయంగా మారింది. రక్తపు మడుగులో పడివున్న ఆ బాలికను గమనించిన స్థానికులు వెంటనే తల్లిదండ్రులు, పోలీసులకు సమాచారం అందించారు. ప్రస్తుతం ఆ బాలిక నగరంలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో అత్యవసర విభాగంలో మృత్యువుతో పోరాడుతోంది.

### లైంగిక దాడి చేసి మూడంతస్తుల పైనుంచి తోసివేత

- విరిగిన ఎముకలు.. రక్తపు మడుగులో బాలిక
- కామాంధుడైన లారీ డ్రైవర్‌పై 'పోక్సో' కేసు

**ఖమ్మం బ్యూరో, (జనంసాక్షి) :** శాంతిభద్రతలకు నిలయమైన ఖమ్మం నగరం ఒక్కసారిగా నివ్వెరపోయింది. మానవత్వాన్ని మంటగలిపేలా, కన్నబిడ్డలా చూసుకోవాల్సిన వయసున్న ఓ 12 ఏళ్ల మైనర్ బాలికపై ఒక కామాంధుడు జరిపిన అమానుష దాడి స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. రాపర్తి నగర్ ప్రాంతంలో ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘోరానికి ఒక లారీ డ్రైవర్ ఒడిగట్టడం సమాజం తలదించుకునేలా చేసింది.

**అగమ్యగోచరంగా భద్రత.. ఆక్రందన విన్నా కరగని రాక్షస మనసు**

రక్షణగా నిలవాల్సిన సమాజంలోనే ఒక మృగం సంచరిస్తూ, ఒంటరిగా ఉన్న ఆ అమాయక బాలికను చూసి తన పశువాంఛను తీర్చుకోవడానికి తెగబడింది. ఆ చిన్నారి ఏడుస్తున్నా, భయంతో వణికిపోతున్నా, రక్షించమని ఎంతగా వేడుకున్నా ఆ కామాంధుడి మనసు కరగలేదు. రాక్షసానందం పొందుతూ ఆ మైనర్ బాలికపై తన కర్కశత్వాన్ని ప్రదర్శించాడు. ఈ దారుణమైన దాడి కారణంగా ఆ చిన్నారి శారీరకంగా, మానసికంగా అనుభవించిన నరకం అంతా ఇంతా కాదు.

**సాక్ష్యం లేకుండా చేసేందుకు భవనం పైనుంచి తోసివేత**

లైంగిక దాడికి పాల్పడిన అనంతరం ఆ లారీ డ్రైవర్ మహమ్మద్ గౌస్ పాషాకు తను చేసిన తప్పు బయటపడుతుందనే భయం, పిరికితనం పట్టుకున్నాయి. బాలిక ప్రాణాలతో ఉంటే తన పాపం ఎక్కడ బట్టబయలు అవుతుందోనని, సాక్ష్యం లేకుండా చేయాలనే కుట్రతో ఆ కిరాతకుడు ఒక దుర్మార్గానికి వ్యూహం రచించాడు. వెంటనే ఆ బాలికను సమీపంలోని ఒక మూడంతస్తుల భవనం పైకి తీసుకువెళ్లి, అక్కడి నుండి నిర్దాక్షిణ్యంగా కిందికి తోసేశాడు. పైనుంచి కిందపడితే బాలిక చనిపోతుందని, దాంతో ప్రమాదవశాత్తు పడిపోయిందని నమ్మించవచ్చని ఆ రాక్షసుడు భావించి, ఈ ఘోరానికి ఒడిగట్టిన వెంటనే అక్కడి నుండి పరారయ్యాడు.

**నిందితుడిపై 'పోక్సో' కేసు నమోదు**

ఈ అమానుష ఘటనపై సమాచారం అందుకున్న టూ టౌన్ పోలీసులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధిత బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన లిఖితపూర్వక ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసును అత్యంత తీవ్రమైనదిగా పరిగణించిన పోలీసులు, నిందితుడైన లారీ డ్రైవర్‌పై పోక్సో చట్టం కింద నమోదు చేశారు. నిందితుడిని పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు టూ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ తెలిపారు. లారీ డ్రైవర్ వివరాలను సేకరిస్తూ, నిందితుడి కోసం గాలింపు చర్యలను తీవ్రతరం చేశారు. కాగా పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

## బాచుపల్లి ఫ్లైఓవర్ నిర్మాణం ముమ్మాటికి బిఆర్ఎస్ ఘనతనే

### బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

**నిజాంపేట్ జూన్ 9( జనం సాక్షి) :** బిఆర్ఎస్ ప్రభుత్వహయాంలో శంకుస్థాపన చేసిన పనులను ప్రారంభించడం తప్పా కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని ఒకటి లేదని ఎమ్మెల్యే ఎమ్మెల్యే కె.పి వివేకానంద తెలిపారు సిఎంసి నిజాంపేట్ సర్కిల్ పరిధి బాచుపల్లి చౌరస్తాలో నూతనంగా ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఫ్లై ఓవర్‌ను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పరిశీలించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని, నిర్లక్ష్య ధోరణిని ఎండగట్టారు. అభివృద్ధి పనుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి, అలసత్వాన్ని అసెంబ్లీ వేదికగా పలుమార్లు ప్రశ్నించినందుకే ఈ బాచుపల్లి ఫ్లైఓవర్ పనులు పూర్తయి అందుబాటులోకి వచ్చింది. ప్రభుత్వంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ప్రజల పక్షాన కొట్లాడి అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు అందించేందుకు కృషి చేసే ఏకైక పార్టీ బిఆర్ఎస్. ముఖ్యమంత్రి ఆగ మేఘాల మీద శంకుస్థాపనలు చేసి ఎక్కడో మియాపూర్ లో ఉంటూ బాచుపల్లి ఫ్లైఓవర్ ను ప్రారంభించడం కుత్బుల్లాపూర్ ప్రజలను అవమానించడమే. ఎస్ఎన్‌డిపి, ఎస్ఆర్‌డిపి పేరుతో బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు హెచ్ – సిటి అంటూ పేరు మార్చడం తప్పా చేసింది ఏం లేదు. ఈ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తయిన ఇప్పటివరకు సుచిత్ర – కొంపల్లి ఫ్లైఓవర్ పనులను పూర్తి చేయలేక పోయింది. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని కప్పిపుచ్చుకునేందుకు కేంద్ర ప్రభుత్వంపై రాష్ట్ర ప్రభుత్వం నేపాన్ని నెట్టివేసి చేతులు దోచుకుంటున్నారే తప్పా చేసిందేమీ లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కాలనీల్లో మురుగునీటి సమస్యలు పరిష్కరించాలి

### జలమండలి జీఎంకు మాజీ కార్పొరేటర్ వినతి



**అల్వాల్, జూన్ 9 (జనంసాక్షి):** అల్వాల్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో మురుగునీటి సమస్యలను పరిష్కరించి, నూతన పైప్‌లైన్లను మంజూరు చేయాలని మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కోరారు. మంగళవారం ఆమె జలమండలి (హెచ్‌ఎం డబ్ల్యూఎస్ఎస్బీ) జనరల్ మేనేజర్ (జీఎం)ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముత్యం రెడ్డి నగర్, నాగిరెడ్డి కాలనీ, ఎగ్జిక్యూటివ్ కాలనీ, దినకర్ నగర్, మాధవి నగర్, అయ్యర్ బస్తీ, రాజీవ్ వీకర్ సెక్షన్ కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఆమె జీఎం దృష్టికి తీసుకెళ్లారు. చాలా కాలంగా ఆయా కాలనీల ప్రజలు మురుగునీరు రోడ్లపైకి వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కొత్త పైప్‌లైన్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి పనులను త్వరగా ప్రారంభించాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల పనులపై జీఎంతో కూలంకషంగా చర్చించి, తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందిస్తూ.. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నూతన పైప్‌లైన్లను మంజూరు చేయాలని మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి కోరారు. మంగళవారం ఆమె జలమండలి (హెచ్‌ఎం డబ్ల్యూఎస్ఎస్బీ) జనరల్ మేనేజర్ (జీఎం)ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ముత్యం రెడ్డి నగర్, నాగిరెడ్డి కాలనీ, ఎగ్జిక్యూటివ్ కాలనీ, దినకర్ నగర్, మాధవి నగర్, అయ్యర్ బస్తీ, రాజీవ్ వీకర్ సెక్షన్ కాలనీల్లో నెలకొన్న సమస్యలను ఆమె జీఎం దృష్టికి తీసుకెళ్లారు. చాలా కాలంగా ఆయా కాలనీల ప్రజలు మురుగునీరు రోడ్లపైకి వస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రని, కొత్త పైప్‌లైన్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేసి పనులను త్వరగా ప్రారంభి ంచాలని కోరారు. అలాగే పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా, మురుగునీటి పారుదల పనులపై జీఎంతో కూలంకషంగా చర్చించి, తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై జీఎం సానుకూలంగా స్పందిస్తూ.. సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# అక్రమ నిర్మాణాల సీజ్.. ముడుపుల కోసమేనా?

- గతంలో సీజ్ చేసిన భవనాల్లో గృహప్రవేశాలు!
- టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం




**మల్కాజిగిరి జూన్ 9 (జనంసాక్షి) :** అక్రమ నిర్మాణాల నిరోధానికి చర్యలు చేపట్టాల్సిన టౌన్‌ప్లానింగ్ అధికారులు వాటినే ఒక ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా మౌలాలి సర్కిల్ పరిధిలోని వినాయక నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న ఒక షెడ్‌ను టౌన్‌ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. అయితే, ఈ సీజింగ్‌ల వెనుక అసలు కథ వేరే ఉందంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల చర్యలు కేవలం ముడుపుల కోసమేనని బహిరంగంగానే విమర్శిస్తున్నారు.గతంలో ఇదే సర్కిల్ పరిధిలో అధికారులు భారీ హడావుడి చేస్తూ పోలీస్ బందోబస్తుతో సీజ్ చేసిన పలు భవనాలు ప్రస్తుతం రంగులు మార్చుకుని, ముస్తాబై గృహప్రవేశాలు కూడా జరుపుకోవడం గమనార్హం. అక్రమ నిర్మాణదారులకు నోటీసులు జారీ చేయడం, సీజ్ చేస్తామంటూ భయభ్రాంతులకు గురిచేయడం, ఆపై తెరవెనుక సెటిల్మెంట్లు చేసుకొని వదిలేయడం అధికారులకు పరిపాటిగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు.ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి టౌన్‌ప్లానింగ్ విభాగానికి 10కి పైగా ఫిర్యాదులు వస్తున్నాయి. అయితే ఈ ఫిర్యాదులను అక్రమాలను అరికట్టడానికి కాకుండా, సదరు నిర్మాణదారులను బెదిరించి వసూళ్లకు పాల్పడడానికే అధికారులు ఆసరాగా చేసుకుంటున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. ఫిర్యాదు అందిన వెంటనే క్రింది స్థాయి అధికారులు రంగంలోకి దిగి నిర్మాణదారులతో లాలూచీ పడి వారికి అండగా నిలుస్తున్నట్లు తెలుస్తోంది.మౌలాలి సర్కిల్ పరిధిలో గతంలో సీజ్ చేసిన భవనాలపై, వాటిపై తీసుకున్న తదుపరి చర్యలపై, ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై, వారికి సహకరిస్తూ అవినీతికి పాల్పడుతున్న టౌన్‌ప్లానింగ్ అధికారులపై శాకాపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.






# ఫిట్ లెస్.. బడి బస్

- భద్రతా ప్రమాణాలు కరువు
- పూర్తి కావస్తున్న ఫిట్‌నెస్ టెస్టులు
- విద్యా సంస్థల నిర్లక్ష్యం

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 9 (జనంసాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 15న పాఠశాలలో ప్రారంభం కానున్నాయి. పాఠశాల కు విద్యార్థులను చేర్చే వాహనాల భద్రతపై నమ్మకం సన్నగిల్లుతుంది. ప్రైవేటు పాఠశాల యజమాన్యాలు వారికిచ్చే అనుమతిలో పాఠశాలకు వాహనాలు లేవని చెబుతూనే ఒక్కో పాఠశాల నాలుగైదు బస్సులను నడపడం అధికారుల నిర్లక్ష్యానికి అర్థం పడుతోంది. జూన్ 15 నుండి పాఠశాలలు ప్రారంభం కానున్న సమయంలో బడి బస్సులను ఆర్టీవో అధికారులు తనిఖీ చేసి భద్రత ప్రమాణాలను పాటించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాఠశాలలో తెరుచ్చుకునేందుకు వారం రోజులు మాత్రమే సమయం ఉండగా ఇప్పటివరకు కొన్ని పాఠశాలలు బడి బస్సు ఫిట్నెస్ పై శ్రద్ధ చూపడం లేదని సమాచారం. ఫిట్నెస్ లేకుండా విద్యార్థులను తరలించే క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే ప్రాణ పాయంతో పాటు ఎలాంటి ఇన్సూరెన్స్ వర్తించదని పాఠశాలను సీజ్ చేసే అధికారం సంబంధిత అధికారులకు ఉంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. భవిష్యత్ తరానికి మార్గదర్శకంగా ఉండాల్సిన విద్యాలయాల నిర్వాహకులు బడి బస్సు విషయంలో నిర్లక్ష్య ధోరణి వీడి పిల్లల ప్రాణాలకు భరోసా కల్పించాలని విద్యార్థి సంఘ నాయకులు కోరుతున్నారు. నిబంధనలు పాటించని వాహనాలపై చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించిన కొన్ని పాఠశాలలో యజమాన్యాలు ఆ హెచ్చరికలను పేడ చెవిన పెడుతున్నట్లు తెలుస్తోంది.



**నిబంధనలన్నీ కాగితాలకే...**

బడి బస్సు నిర్వహణపై ఉన్న నిబంధనలను పాటించినట్లుగా కాగితాలపై పేర్కొన్న మినహా భద్రత ప్రమాణాలు మాత్రం కొనసాగించడం లేదని విమర్శలు జిల్లాలో అధికంగా ఉన్నాయి. వాహనంలో కనీసం పిల్లలను చూసుకునేందుకు సహాయకులు లేకపోవడం నిర్లక్ష్య ధోరణికి అర్థం పడుతుంది. ఇలాంటి నిర్లక్ష్య ధోరణితోనే గతంలో సిరిసిల్ల నియోజకవర్గం ముస్తాబాద్ లో ఓ పాఠశాల విద్యార్థిని మృతిచెందగా,కొన్ని సంవత్సరాల క్రితం అత్యంత భయంకరమైన ప్రమాదంలో వేములవాడ నియోజకవర్గం లో ఓ పాఠశాల విద్యార్థులు మృతి చెందారు. ప్రమాదాల నేపథ్యంలో అధికారులు కొంత మేరకు నిబంధనలు కఠినం చేసిన వాటిని యజమాన్యాలు లోపాయికారీగా కాగితాలపై చూపిస్తూ బడి బస్సు ఫిట్నెస్సు పూర్తి చేసుకున్నట్లుగా విమర్శలు ఉన్నాయి. కార్యాలయానికి ఫిట్నెస్ కోసం తెచ్చిన వాహనాలు తనిఖీ చేసి పత్రాలు జారీ చేయడం మాత్రమే తమ పనిగా కాకుండా పాఠశాల ప్రారంభమైన తర్వాత ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం వల్ల విద్యార్థులకు మేలు జరుగుతుందని పాఠశాల యజమాన్యాలు కూడా భద్రత ప్రమాణాలు పాటించే అవకాశం ఉంటుందని తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

**బడి బస్సు నిబంధనలు ఇవే..**

- 15 ఏళ్లు నిండిన బస్సుల్లో పాఠశాల విద్యార్థులను తీసుకెళ్లకూడదు.
- ఈనెల 12లోగా తిరిగి ఫిట్‌నెస్ పరీక్ష చేయించాలి.
- బీమా గడువు పరిశీలించి,తిరిగి పునరుద్ధరించుకోవాలి.
- 60 ఏళ్లలోపు ఉన్న వారినే డ్రైవర్లుగా నియమించాలి.
- అనుభవంతో పాటు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలి.
- బస్సులో పరిమితికి మించి విద్యార్థులను తరలించకూడదు.
- ప్రతి మూడు నెలలకొకసారి డ్రైవర్లకు కంటి పరీక్షలు, రక్తపోటు,మధుమేహం పరీక్షలు చేయించాలి.
- డ్రైవర్ వివరాలు బస్సుకు ఇరువైపులా,విద్యా సంస్థ పేరు, ఫోన్ నంబర్ కనిపించేలా ఏర్పాటు చేయాలి.
- బస్సుకు కేటాయించిన ప్రాంతంలో ఇనుప ఊచలు బిగించడం, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉంచాలి.
- బస్సులో అటెండర్ ఉండాలి. బస్సులో విద్యార్థుల జాబితా అతికించాలి.
- అగ్నిమాపక పరికరాలు అమర్చాలి.అత్యవసర ద్వారం ఏర్పాటు చేయాలి.
- విద్యార్థులకు ప్రత్యేకంగా మెట్లు ఏర్పాటు చేయాలి.

**నిబంధనలు పాటించకుంటే సీజ్ చేస్తాం**

**డిటిఓ శ్రీనివాస్.**

రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పలు విద్యాసంస్థల బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించని వాటిపై కఠిన చర్యలు తీసుకుంటమని అవసర మైతే వాహనాలను సీజ్ చేస్తమని డిటిఓ శ్రీనివాస్ తెలిపారు.15 ఏళ్ల క్రితం వున్న బడి బస్సులు ఎట్టి పరిస్థితుల్లోనూ విద్యార్థుల తరలించేందుకు వినియోగించకూడదన్నారు. వినియోగిస్తే యాజమా న్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.రాజన్న సిరిసిల్ల జిల్లాలో 14 నుండి 15 ఏళ్ల లోపు ఉన్న బస్సులు ఐదు ఉన్నట్లు ఆయన తెలిపారు.

- జిల్లాలో ఉన్న బడి బస్సులు 173.
- ఇప్పటివరకు ఫిట్నెస్ చేసిన బస్సులు 120.
- ఇంకా ఫిట్నెస్ కావాల్సిన బస్సులు 53.
- 14 నుండి 15 ఏళ్లలోపు ఉన్న బస్సులు 5.

# మహిళల ఆర్థిక సాధికారతకు ఆర్టీసీ బస్సులు

- కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం: భూపతిరెడ్డి
- నిజామాబాద్ రూరల్ నియోజకవర్గానికి 7 బస్సుల కేటాయింపు
- మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలతో బస్సుల అందజేత
- సీఎం చేతుల మీదుగా బస్సులు స్వీకరించేందుకు హైదరాబాద్‌కు మహిళల ప్రయాణం



ఇందల్వాయి, జూన్ 9 (జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధిని లక్ష్యంగా పెట్టుకుని కోటిమంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తోందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ ఆర్. భూపతిరెడ్డి అన్నారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాల మహిళా సమాఖ్యలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్టీసీ బస్సులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా స్వీకరించేందుకు మహిళలు మంగళవారం హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ సందర్భంగా ఇందల్వాయి టోల్‌ప్లాజా వద్ద ఎమ్మెల్యే పచ్చజెండా ఊపి బస్సులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి వ్యాపార రంగంలో ముందుకు సాగేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తోందని పేర్కొన్నారు. ఒక్కో బస్సుకు మహిళా సంఘాల నుంచి రూ.6 లక్షల వాటా ఉండగా, మిగిలిన రూ.30 లక్షలను బ్యాంకు లింకేజీ ద్వారా వడ్డీలేని రుణంగా అందిస్తున్నట్లు తెలిపారు.

నియోజకవర్గ పరిధిలోని ఏడు మండలాలకు మొత్తం ఏడు బస్సులు, జిల్లా వ్యాప్తంగా 28 బస్సులను మహిళా సమాఖ్యలకు అందజేస్తున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. ఈ బస్సుల నిర్వహణ ద్వారా మహిళలకు స్థిరమైన ఆదాయం లభించి ఆర్థికంగా మరింత బలోపేతం అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం రుణాల మంజూరుతో పాటు వారు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పిస్తోందని చెప్పారు. హైదరాబాద్‌లోని శిల్పారామంలో మహిళా సంఘాల ఉత్పత్తుల విక్రయాల కోసం ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మహిళల సంక్షేమం, ఉపాధి, ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నవీన్ గౌడ్, మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయరెడ్డి, పొలసాని శ్రీనివాస్, ఉమ్మాజీ నరేష్, బాగా రెడ్డి, వివిధ మండలాల పార్టీ అధ్యక్షులు, సర్పంచ్ ఫోరం ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో టాస్క్ ఫోర్స్ మెరుపు దాడులు

**భారీగా కల్తీ కారంపొడి, సుగంధ ద్రవ్యాల స్వాధీనం**



**కరీంనగర్ బ్యూరో, జూన్ 09 (జనంసాక్షి) :** కరీంనగర్ పట్టణం లోని శనివారం మార్కెట్ పరిధిలో కల్తీ కారంపొడి విక్రయిస్తున్నారనే నమ్మదగిన సమాచారం మేరకు కరీంనగర్ టాస్క్ ఫోర్స్ పోలీసులు మంగళవారం రోజు మెరుపు దాడులు నిర్వహించారు. మార్కెట్లోని "గౌరిశెట్టి రమేష్", "సిద్ధంశెట్టి చక్రపాణి" కిరాణం, సుగంధ ద్రవ్యాల దుకాణాల్లో జరిపిన ఈ సోదాల్లో భారీ మొత్తంలో కల్తీ అనుమానిత నిల్వలను కనుగొన్నారు. ఈ దాడుల సమాచారాన్ని వెంటనే ఫుడ్ సేఫ్టీ అధికారులకు చేరవేయగా, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు అంకిత్ రెడ్డి, రోహిత్ రెడ్డిలు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. టాస్క్ ఫోర్స్ బృందం వారి సమక్షంలో సుమారు 47 బస్తాల కారంపొడి (ప్రతి బస్తా బరువు 50 కిలోలు), 2 బస్తాల పసుపు, 1 బస్తా ధనియాల పొడిని స్వాధీనం చేసుకుని ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు. ఫుడ్ సేఫ్టీ అధికారులు సదరు దుకాణాల నుండి నమూనాలను సేకరించి, పరీక్షల నిమిత్తం ల్యాబొరేటరీకి పంపించారు. ఈ ల్యాబ్ పరీక్షల ఫలితాలు వచ్చే వరకు సదరు స్టాక్‌ను పూర్తిగా సీజ్ చేయడం జరిగిందని, అలాగే ఈ సుగంధ ద్రవ్యాల అమ్మకాల పై పూర్తి నిషేధం విధించినట్లు అధికారులు తెలిపారు. ప్రజల ఆరోగ్యంతో ఆటలాడే కల్తీ వ్యాపారుల పై కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. ఈ దాడుల్లో టాస్క్ ఫోర్స్ ఏసీపీ వాసాల సతీష్ , ఎస్సైలు మామిడాల సురేందర్, శ్రీకాంత్, కానిస్టేబుల్ సాయిదీప్ లు పాల్గొన్నారు.



# పూరిగుడిసెలు లేని జిల్లాగా కామారెడ్డి

***అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే లక్ష్యం: కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్***

- వడ్డెర కాలనీలో పూరిగుడిసెలను సందర్శించిన కలెక్టర్
- రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై ప్రత్యేక దృష్టి
- బడిబాట కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల నమోదు పరిశీలన

**కామారెడ్డి, జూన్ 9 (జనంసాక్షి):** జిల్లాలో ఒక్క పూరిగుడిసె కూడా లేకుండా కామారెడ్డిని "పూరిగుడిసెలు లేని జిల్లాగా" తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ సూచించారు. మంగళవారం రామారెడ్డి మండలంలోని వడ్డెర కాలనీని సందర్శించిన ఆయన పూరిగుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాల పరిస్థితిని పరిశీలించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా గృహ సౌకర్యం కల్పించే దిశగా చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పూరిగుడిసెల్లో నివసిస్తున్న గృహరహిత కుటుంబాల వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించి ప్రభుత్వ నిబంధనల మేరకు వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమంలో పూరిగుడిసెల్లో నివసిస్తున్న అర్హులను ప్రాధాన్యంగా గుర్తించి ఇళ్లు మంజూరు చేయాలని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబం ప్రభుత్వ గృహ పథకాల ప్రయోజనం పొందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి పెండింగ్ అంశాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ పనులు వేగవంతం చేయాలని, లబ్ధిదారులకు అవసరమైన సాంకేతిక, పరిపాలనా సహకారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ విజయపాల్ రెడ్డి, తహసీల్దార్, సర్పంచ్ బండి ప్రవీణ్, ఎంపీడీవో నాగేశ్వర్ రావు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జిల్లాలో విద్యార్థుల నమోదు శాతాన్ని పెంచి ప్రతి చిన్నారికి విద్యను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న బడిబాట కార్యక్రమంలో కూడా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పాల్గొన్నారు. రామారెడ్డి మండలంలోని ఎస్సీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమాన్ని సందర్శించిన ఆయన ఇంటింటి ప్రచారం ద్వారా పాఠశాల వయస్సు కలిగిన పిల్లలను గుర్తించి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లైసెన్స్ లేకుండా అక్రమంగా అమ్ముతున్న వరి విత్తనాలు



**కథలాపూర్, జూన్ 9 (జనం సాక్షి) :** కథలాపూర్ మండలంలోని ఇప్పపెల్లి గ్రామం లో చేసిన తనికిలో భాగంగా గడ్డం ప్రతాపరెడ్డి అనే రైతు ఇంటి ఆవరణలో ఎటువంటి లైసెన్స్ లేకుండా వరి విత్తనాలు ఇతరులకు అమ్ముతున్నారు. ఈ విత్తనాల స్టాక్ ను సీజ్ చేసి గ్రామ పంచాయతీ లో భద్రపరిచి సెక్రటరీ గారి ఆధీనంలో ఉంచడం జరిగింది. రసీదు లేకుండా కొన్న విత్తనాన్ని, విత్తన లైసెన్స్ లేకుండా అమ్మడం విత్తన చట్టం ప్రకారం నేరం. ఈ విషయాన్ని పై అధికారులకు విన్నవించి అదనపు కలెక్టర్ గారికి ఫిర్యాదు చేయడం జరిగింది. పోతారం లోని తనికిలో భాగంగా సాయన్న అనే వ్యక్తి పై వచ్చిన ఫిర్యాదు ఆధారంగా విచారించినప్పుడు, లైసెన్స్ లేకుండా వరి విత్తనాలు అమ్ముతున్నట్టు తెలిసింది. వ్యవసాయ అధికారి ఏ ఓ యోగితా మరియు ఎస్ ఐ. రవి కిరణ్ మందలించి హెచ్చరించడం జరిగింది.

# కేసులు గడువులోపు పూర్తి చేయాలి

- నేర నియంత్రణలో సాంకేతికత కీలకం
- సీసీటీఎన్ఎస్ 2.0, ఈ-సాక్ష్య అమలును వేగవంతం చేయాలి
- రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా




**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీసు అధికారుల మే నెల నేర సమీక్షా సమావేశం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ సమావేశంలో పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తులో ఉన్న కేసులు,వారెంట్ల అమలు,పోలీసు సిబ్బంది పనితీరును సమగ్రంగా సమీక్షించారు.ఇప్పటివరకు నమోదైన కేసులు,పెండింగ్‌లో ఉన్న పాత కేసులపై సీపీ ప్రత్యేకంగా దృష్టి సారించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నమోదయ్యే ప్రతి కేసును నిర్దేశిత గడువులోపు పూర్తి చేసి,నాణ్యమైన దర్యాప్తుతో నిందితులకు శిక్ష పడేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసుల్లో అవసరమైతే న్యాయ సలహా తీసుకుని దర్యాప్తును వేగవంతం చేయాలని పేర్కొన్నారు.ఆస్థి సంబంధిత నేరాలు, ఆర్థిక నేరాల కేసులపై ప్రత్యేక దృష్టి సారిస్తూ ఆస్తుల గుర్తింపు, స్వాధీనం, అటాచ్‌మెంట్ ప్రక్రియలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. వాహనాల్లో ఫస్ట్ ఎయిడ్ కిట్, డ్రాగన్ లైట్, తాళ్లు, కోన్స్, క్రైమ్ ప్రొటెక్షన్ రిబ్బన్, రైట్ గేర్ కిట్ (హెల్మెట్, స్టోన్ గార్డ్, లాఠీ,బాడీ ప్రొటెక్టర్) తప్పనిసరిగా ఉండాలని సూచించారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు, వరదలలో చిక్కుకున్న ప్రజలను రక్షించేందుకు ముందస్తు అప్రమత్తతతో వ్యవహరించాలని, ప్రమాదంలో ఉన్న వారిని ఏ విధంగా రక్షించాలనే అంశాలపై తరచూ డ్రిల్ ప్రాక్టీస్ నిర్వహిస్తూ సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు.ప్రతి డేటా ఫీల్డ్ రియల్ టైమ్‌లో నవీకరించబడుతూ ఉండాలని,వ్యవస్థల్లో నమోదయ్యే సమాచారం ఖచ్చితంగా, సమగ్రంగా ఉండాలని సూచించారు. అనవసరమైన లేదా తప్పుడు సమాచారాన్ని అప్లోడ్ చేయరాదని హెచ్చరించారు. సీసీటీఎన్ఎస్‌లో డేటా అప్లోడ్ పెండింగ్ లేకుండా పనిచేసే సిబ్బందికి రివార్డులు కూడా అందజేయడం జరుగుతుంద ని పేర్కొన్నారు.ఈ సమావేశంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్, పెద్దపల్లి డీసీపీ బి.రామ్‌రెడ్డి, అదనపు డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్,పెద్దపల్లి ఏసీపీ జి.కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్,జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ కిరణ్‌కుమార్,స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ నాగేంద్ర గౌడ్,ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్,సీఐలు, ఇన్‌స్పెక్టర్లు,ఎస్ఐలు పాల్గొన్నారు.

# రూ.90 లక్షల మున్సిపల్ ఆస్తుల మాయం?

***అక్రమ విక్రయాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను అరెస్ట్ చేయాలి***

- స్క్రాప్, కాపర్ వస్తువులు, మోటార్ల అక్రమ తరలింపుపై ఆరోపణలు
- కలెక్టర్, ఎస్పీకి 20 మంది కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యుల ఫిర్యాదు
- ప్రభుత్వానికి భారీ నష్టం జరిగిందంటూ ఆందోళన
- చర్యలు లేకుంటే ప్రజాస్వామ్యబద్ధ ఉద్యమాలకు హెచ్చరిక



**కామారెడ్డి, జూన్ 9 (జనంసాక్షి):** కామారెడ్డి మున్సిపాలిటీకి చెందిన స్క్రాప్ సామగ్రి, కాపర్ వస్తువులు, పాత మోటార్లు తదితర విలువైన ప్రభుత్వ ఆస్తులను అక్రమంగా తరలించి విక్రయించడం ద్వారా రూ.90 లక్షలకు పైగా ప్రభుత్వానికి నష్టం వాటిల్లిందని 20వ వార్డు కౌన్సిలర్ కళ్లెం సావిత్రి సత్యం ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీకి సమర్పించిన ఫిర్యాదులో కోరారు. ఆమెతో పాటు 17 మంది వార్డు కౌన్సిలర్లు, ముగ్గురు కో-ఆప్షన్ సభ్యులు ఈ ఫిర్యాదుకు మద్దతు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని వాటర్ ఫిల్టర్ బెడ్ గోదాం, బుర్రమత్తడి, పెద్దచెరువు ప్రాంతం, వాటర్ బెడ్ ట్యాంక్ పరిసరాలు, జాతీయ రహదారి పక్కన నిల్వ ఉంచిన స్క్రాప్ సామగ్రి, కాపర్ వస్తువులు, పాత మోటార్లు తదితర ప్రభుత్వ ఆస్తులను 2024 డిసెంబర్ 10వ తేదీ రాత్రి కొందరు వ్యక్తులు కూలీల సహాయంతో ఎటువంటి అధికారిక అనుమతులు లేకుండా తరలించినట్లు సమాచారం వెలుగులోకి వచ్చిందని తెలిపారు. ఈ ఘటనపై ఇప్పటికే 2024 డిసెంబర్ 15న పోలీస్ స్టేషన్‌లో, డిసెంబర్ 16న మున్సిపల్ కమిషనర్‌కు, డిసెంబర్ 21న జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు సమర్పించినప్పటికీ ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై స్పష్టత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పత్రికల్లో ప్రచురితమైన కథనాలు, స్థానికంగా సేకరించిన సమాచారం ఆధారంగా మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నిల్వ ఉంచిన స్క్రాప్, ఇతర విలువైన సామగ్రి కూడా అక్రమంగా విక్రయించబడి నట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు.

వివిధ వార్డుల నుంచి తరలించబడిన సామగ్రి విలువ సుమారు రూ.35 లక్షలు కాగా, వాటర్ ఫిల్టర్ బెడ్ గోదాం నుంచి తరలించిన వస్తువుల విలువ సుమారు రూ.60 లక్షల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. మొత్తం ప్రభుత్వ ఆస్తులకు రూ.90 లక్షలకు పైగా నష్టం సంభవించినట్లు ప్రాథమిక సమాచారం సూచిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో రెండు ఘటనలపై వేర్వేరుగా కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో అప్పటి మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, ఆమె భర్త గడ్డం చంద్రశేఖర్ రెడ్డి పాత్రపై పత్రికల్లో పలు కథనాలు వెలువడ్డాయని పేర్కొన్నారు. అలాగే వాటర్ ఫిల్టర్ బెడ్ వద్ద విధులు నిర్వహించిన వాటర్ వర్క్స్ ఉద్యోగి శ్యామ్ ఇచ్చిన వాంగ్మూలంలో కూడా సంబంధిత వ్యక్తుల సమక్షంలోనే సామగ్రి తరలింపు జరిగినట్లు వెల్లడించారని తెలిపారు.ఎ ప్రజల పన్నుల రూపంలో సమకూరిన నిధులతో కొనుగోలు చేసిన ప్రభుత్వ ఆస్తులను అక్రమంగా విక్రయించడం అత్యంత తీవ్రమైన అవినీతి చర్యగా పరిగణించి ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోవాలని కౌన్సిలర్లు కోరారు. జిల్లా స్థాయి ఉన్నతాధికారులతో ప్రత్యేక విచారణ కమిటీ ఏర్పాటు చేయడం, మున్సిపాలిటీకి చెందిన స్క్రాప్, కాపర్, మోటార్లు తదితర సామగ్రిపై పూర్తి స్థాయి ఆడిట్ నిర్వహించడం, గతంలో సమర్పించిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యల నివేదికను బహిర్గతం చేయడం, అక్రమంగా తరలించిన ఆస్తులను గుర్తించి రికవరీ చేయడం, బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం వంటి డిమాండ్లను అధికారుల ముందుంచారు. ఈ ఫిర్యాదుతో పాటు సంబంధిత వీడియోలు, పత్రికా కథనాలు, గతంలో సమర్పించిన ఫిర్యాదుల ప్రతులను కూడా జిల్లా అధికారులకు అందజేసినట్లు తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి పారదర్శక విచారణ చేపట్టాలని, లేకపోతే మున్సిపల్ కార్యాలయం, జిల్లా కలెక్టర్ కార్యాలయం, పోలీస్ స్టేషన్ ఎదుట ప్రజాస్వామ్యబద్ధంగా భారీ ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని కౌన్సిలర్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఐరేని సందీప్, కౌన్సిలర్లు అంజద్, లడ్డు, కాళ్ల రాజమణి, వనిత రామ్మోహన్, ఫాతిమా, అఖిల, నీట్టు గంగాధర్, గోనె సునీత, తహసీన్ ఉన్నిసా, వాజిద్, ఆఫ్రిన్ సుల్తానా, ఆస్మా హబీబ్ ఖాన్, సుల్తానా బేగం, కొత్తపల్లి లలిత, మహమ్మద్ ఇసాక్ షేరు, అన్వర్ అహ్మద్, గోన శ్రీనివాస్, ముబాషిర్, కాళ్ల గణేష్ పాల్గొన్నారు.

# ప్రతి స్టాక్ పాయింట్‌లో యూరియా నిల్వలు ఉండాలి

- బుకింగ్ యాప్ ద్వారా ప్రణాళికాబద్ధంగా పంపిణీ
- నిజామాబాద్ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ఎడపల్లి, జూన్ 09 (జనంసాక్షి) :** జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోదాములలో, సేల్ పాయింట్ల లో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్దంగా పర్యవేక్షణ చేస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి వెల్లడించారు. వానాకాలం సీజన్ పంటల సాగుకు అవసరమైన మేరకు పూర్తి స్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. ఎడపల్లి మండలంలోని జానకంపేట్, ఎడపల్లిలో గల ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలను కలెక్టర్ మంగళవారం తనిఖీ చేశారు. గోడౌన్లలో నిల్వ ఉన్న యూరియా, ఇతర ఎరువులను పరిశీలించి, స్టాక్ వివరాల రిజిస్టర్ లో పొందుపరచిన వాటికి అనుగుణంగా నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేదా అని తనిఖీ చేశారు. నానో యూరియా వాడకం వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. ప్రయోగాత్మకంగా కొంత పరిమాణంలో నానో యూరియాను వినియోగించి ఫలితాలను స్వయంగా పరిశీలించాలని రైతులకు హితవు పలికారు. అయితే రైతులను నానో యూరియా కొనాలని బలవంతం చేయవద్దని, వారు కోరిన ఎరువులు మాత్రమే అందించాలని, ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, డీలర్ల లైసెన్సులు రద్దు చేసేందుకు కూడా వెనుకాడబోమని కలెక్టర్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు. జిల్లా రైతుల అవసరాలకు సరిపడా ప్రస్తుతం 27 వేల మెట్రిక్ టన్నుల పైచిలుకు యూరియా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఎక్కడ కూడా కొరత ఏర్పడకుండా రైతుల అవసరాలకు అనుగుణంగా అన్ని ప్రాంతాలకు నిల్వలను చేరవేస్తున్నామని తెలిపారు. మోతాదుకు మించి ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించకుండా, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని రైతులకు సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి, జిల్లా సహకార శాఖ అధికారి శ్రీనివాస్, తహసీల్దార్ దత్తాద్రి, జానకంపేట్ సర్పంచ్ అనురాధ, సొసైటీ చైర్మన్ నరేందర్, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
10 జూన్ 2026

# స్నానానికి దిగిన ముగ్గురు అన్నదమ్ములు గల్లంతు

▫ బాసర గోదావరిలో విషాదం



**బాసర, జూన్ 09 (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లా బాసర గోదావరి నది తీరం మరోసారి విషాదఛాయల్లో మునిగింది. మంగళవారం పుణ్యస్నానానికి వెళ్లిన ముగ్గురు అన్నదమ్ములు గోదావరిలో గల్లంతైన ఘటన బాసరలో తీవ్ర విచారం నింపింది. గల్లంతైన వారు హైదరాబాద్ కాచిగూడ చప్పల్ బజార్ కాలనీకి చెందిన చంద్రశేఖర్ (38), రాంచందర్ (36), మల్లేష్ (31)గా గుర్తించారు. స్నానం చేస్తున్న సమయంలో అనుకోకుండా లోతైన నీటిలోకి వెళ్లడంతో ఈ ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. సమాచారం అందిన వెంటనే పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని గాలింపు చర్యలు ప్రారంభించారు. గజఈతగాళ్ల సహాయంతో గోదావరి లో ముగ్గురి కోసం తీవ్రంగా అన్వేషించారు. దాదాపు నాలుగు గంటల గాలింపు అనంతరం మృతదేహాలను గుర్తించి వెలికి తీశారు. మృతదేహాలను వెలికి తీసిన బాసర మత్స్యకారులను అధికారులు ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం మృతదేహాలను బాసర సీఐ దీపక్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వాహనంలో ఎక్కించి భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటు తున్నాయి.

### అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

ఈ విషాదం పట్ల స్థానికులు, భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గోదావరి తీరంలో కంచె నిర్మించ కపోవడం, నదిలోకి వెళ్లకుండా అడ్డుకునేందుకు సరియైన పద్ధతిలో సిబ్బందిని నియమించకపోవడం వల్లే అమాయక ప్రాణాలు బలవుతున్నాయని ఆరోపిస్తున్నారు. గత ఏడాది కూడా ఇదే తీరంలో ఒకే కుటుంబానికి చెందిన వారు గోదావరిలో గల్లంతై ప్రాణాలు కోల్పోయారు. అంతేకాకుండా బాసర వంతెనపై నుంచి దూకి చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. నదిపై కంచె నిర్మిస్తే ఆత్మహత్యలను అరికట్టవచ్చని పలుమార్లు గ్రామస్తులు, పత్రికల ద్వారా విజ్ఞప్తి చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### అధికమాసం రద్దీలో భద్రత ప్రశ్నార్థకం

ప్రస్తుతం అధికమాసం కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో బాసర గోదావరికి వచ్చి పుణ్యస్నానాలు చేస్తున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్న సమయంలో భద్రతా చర్యలు మరింత పటిష్టంగా ఉండాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు. అమ్మవారికి భక్తులు అందిస్తున్న విరాళాలు లక్షల్లో, కోట్లలో వస్తున్నప్పటికీ, అందులో నుంచి గోదావరి నది వద్ద భక్తులకు సౌక ర్యాలు కల్పించడానికి మాత్రం నిధులు కేటాయించడం లేదని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన అనంతరం అమ్మవారి దర్శనం చేసుకోవాలని దేవాలయానికి సంబంధించిన వారు తరచూ లౌడ్స్పీకర్ లలో వినిపిస్తున్నప్పటికీ, గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించే భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో మాత్రం ఎందుకు వెనక ఆడుగు వేస్తున్నారనివారు ప్రశ్నిస్తున్నారు. గల్లంతైన ముగ్గురి మృతదేహాల వెలికితీతతో ఈ విషాద ఘటన ముగిసినప్పటికీ, ప్రాణాలు కాపాడేందుకు శాశ్వత చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# వీణా విజయన్‌కు ఈడీ నోటీసులు

**12న కొచ్చిలో విచారణకు హాజరు కావాలని ఆదేశం**



**తిరువనంతపురం, జూన్9 (జనంసాక్షి) :** సీఎమ్ఆర్ఎల్-ఎక్సాలాజిక్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్స్ కేసుకు సంబంధించి 'ది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' కేరళం మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కూతురు వీణా విజయన్‌కు సమన్లు జారీ చేసింది. జూన్ 12వ తేదీన శుక్రవారం కొచ్చిలోని ఆఫీస్‌లో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. వీణా విజయన్‌తో పాటు 9మందికి ఈడీ సమన్లు జారీ చేసింది. పినరయి విజయన్ కుమార్తె వీణా విజయన్‌కు చెందిన ఐటీ కన్సల్టెన్సీ సంస్థ ఎక్సాలాజిక్ సొల్యూషన్స్.. ప్రైవేట్ మైనింగ్ కంపెనీ అయిన సీఎమ్ఆర్ఎల్‌తో ఓ ఒప్పందం చేసుకుంది. ఆ ఒప్పందం కింద సీఎమ్ఆర్ఎల్ కంపెనీ.. వీణా విజయన్ కంపెనీకి 1.72 కోట్ల రూపాయల నుంచి 2.78 కోట్ల రూపాయల వరకు చెల్లించింది. అయితే, ఎక్సాలాజిక్ సొల్యూషన్స్.. సీఎమ్ఆర్ఎల్ కంపెనీకి ఎలాంటి ఐటీ సేవలు అందించకుండానే ఈ మొత్తాన్ని చెల్లించినట్లు దర్యాప్తులో తేలింది. ముఖ్యమంత్రితో ఉన్న కుటుంబ సంబంధాల వల్లే ఈ అక్రమ చెల్లింపులు జరిగాయని ఆదాయపు పన్ను శాఖ పేర్కొంది. నేపథ్యంలోనే సీరియస్ ఫ్రాడ్ ఇన్వెస్టిగేషన్ ఆఫీస్ వీణా విజయన్‌పై కంపెనీల చట్టం కింద కేసు నమోదు చేసింది. అంతేకాదు.. ఈ నిధుల మళ్లింపుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ మనీ లాండరింగ్ చట్టంకింద విచారణ చేపట్టింది. ఈ కేసులో ఈడీ విచారణను రద్దు చేయాలని కోరుతూ సీఎంఆర్ఎల్ సంస్థ కేరళం హైకోర్టును ఆశ్రయించింది. మే 26వ తేదీన విచారణ చేపట్టిన న్యాయస్థానం.. సీఎంఆర్ఎల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. కోర్టు తీర్పునిచ్చిన మరుసటి రోజే ఈడీ అధికారులు రంగంలోకి దిగారు. తిరువనంతపురంలోని విజయన్ అద్దె ఇంటితో పాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 10 ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఇప్పుడు వీణా విజయన్‌కు నోటీసులు ఇచ్చారు.

# పెరుగుతున్న ధరలతో మధ్యతరగతి అధోగతి

▫ ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలి
▫ 14 రకాల నిత్యావసరాలు అందచేయాలి
▫ సివిల్ సప్లై కార్యలయం ఎదుట ఐద్వా ధర్నా



**హైదరాబాద్, జూన్9 (జనంసాక్షి) :** పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలతో పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, ప్రజా పంపిణీ వ్యవస్థను మరింత బలోపేతం చేసి రేషన్ దుకాణాల ద్వారా బియ్యంతో పాటు 14 రకాల నిత్యావసర సరుకులను అందించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ఐద్వా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని సివిల్ సప్లై కార్యాలయం ఎదుట ఐద్వా ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఆర్. అరుణజ్యోతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మల్లు లక్ష్మి మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో బీజేపీ అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలను తగ్గిస్తామని హామీ ఇచ్చిందని, అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత ధరల పెరుగుదలను నియంత్రించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగడం వల్ల అనేక కుటుంబాలు పోషకాహారాన్ని తీసుకోలేకపోతున్నాయని, ముఖ్యంగా మహిళల్లో రక్తహీనత సమస్య అధికమవుతోందని మల్లు లక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. సరైన పోషకాహారం అందక చిన్నారులు కూడా ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఆహార భద్రతా చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, దేశవ్యాప్తంగా ఉన్న అన్ని రేషన్ దుకాణాల ద్వారా 14 రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేసేలా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఐద్వా డిమాండ్ చేసింది. ఈ ధర్నా కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఆశలత, కె. నాగలక్ష్మి, పి. శశికళ, వై. వరలక్ష్మి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బట్టుపల్లి అనూరాధతో పాటు మహిళా నాయకులు పాల్గొన్నారు.

# వీబీజీ రామ్-జీ పథకం అమలును వాయిదా వేయాలి

▫ రాష్ట్రాలతో సంప్రదింపులు లేకుండా కొత్త ఉపాధి హామీ పథకం ప్రారంభం సరికాదు
▫ ప్రస్తుత పనులు పూర్తయ్యే వరకు వంద శాతం నిధులు కేంద్రమే భరించాలి
▫ శివరాజ్ సింగ్ చౌహన్ వీడియో కాన్ఫరెన్స్‌లో తెల్చి చెప్పిన మంత్రి సీతక్క
▫ సీతక్క చాలా యాక్టివ్ మినిస్టర్ అని ప్రశంసించిన కేంద్ర మంత్రి
▫ తెలంగాణ ప్రతిపాదనపై త్వరలో చర్చిస్తామని కేంద్ర మంత్రి వెల్లడి



**హైదరాబాద్, జూన్ 9 (జనంసాక్షి) :** వీబీజీ రామ్-జీ పథక అమలును వాయిదా వేయాలని మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలను సంప్రదించకుండా..మరో 20 రోజుల్లో నూతన ఉపాధి హామీ పథకాన్ని ప్రారంభించడం సరికాదని పేర్కొన్నారు. ప్రస్తుతం అమలువున్న పనులు పూర్తయ్యే వరకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రకారమే వంద శాతం నిధులను కేంద్రం భరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్... రాష్ట్రాల గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాష్ట్రాల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఏ) స్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న వీబీజీ రామ్-జీ పథకానికి సంబంధించిన అంశాలపై తెలంగాణ ప్రభుత్వ అభిప్రాయాలను మంత్రి సీతక్క కేంద్రానికి తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం ఎంజీఎన్ఆర్ఈజీఏ అమలులో దేశంలోనే ముందంజలో ఉందని, ప్రతి సంవత్సరం సగటున 12 కోట్ల పనిదినాలు కల్పిస్తూ గ్రామీణ పేద కుటుంబాలకు ఉపాధి భరోసా కల్పిస్తున్నదని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలతో తగిన సంప్రదింపులు జరపకుండా కొత్త పథకాన్ని జూలై 1 నుంచి అమలు చేయాలని నిర్ణయించడం వల్ల పరిపాలనా, ఆర్థికపరమైన సవాళ్లు ఎదురవుతాయని ఆమె తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల భవనాల నిర్మాణం సహా అనేక పనులు కొనసాగుతున్న నేపథ్యంలో కొత్త విధానానికి మారడానికి తగిన సమయం అవసరమని పేర్కొన్నారు. కొత్త పథకం అమలును కనీసం రెండు నెలలు వాయిదా వేయాలని కేంద్రాన్ని మంత్రి సీతక్క కోరారు. ఉపాధీ హామీ చట్టానికి అనుగుణంగా ప్రారంభమైన పనులకు ప్రస్తుత విధానంలోనే చెల్లింపులు చేయాలని విజ్ఞప్తి చేశారు. వీ బీ జీ రామ్-జీ పథకంలో వ్యవసాయ సీజన్‌లో తప్పనిసరిగా 60 రోజులపాటు పనులు నిలిపివేయాలనే నిబంధన గ్రామీణ పేద కుటుంబాల జీవనోపాధిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఉపాధి హామీ పథకం డిమాండ్ ఆధారితంగా ఏడాది పొడవునా కొనసాగాలని, గ్రామీణ కార్మికులకు అవసరమైన సమయంలో ఉపాధి కల్పించే వెసులుబాటు ఉండాలని సూచించారు. నిధుల కేటాయింపు విషయంలో ప్రస్తుతం ఉన్న డిమాండ్ ఆధారిత విధానానికి బదులుగా స్థిరమైన (నార్మేటివ్) కేటాయింపులను ప్రతిపాదించడం వల్ల అధిక డిమాండ్ ఉన్న సమయంలో నిధుల కొరత ఏర్పడే ప్రమాదం ఉందని మంత్రి పేర్కొన్నారు. గత ఐదేళ్ల పనిదినాల ఆధారంగా నిధులను నిర్ణయించడంతో పాటు ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షించి అదనపు నిధులను విడుదల చేయాలని కేంద్రాన్ని కోరారు. కొత్త పథకంలో కేంద్ర రాష్ట్ర భాగస్వామ్య నిధుల విధానం రాష్ట్రాలపై అదనపు ఆర్థిక భారం మోపుతుందని మంత్రి సీతక్క వివరించారు. ప్రస్తుతం ఎంజీఎన్ ఆర్ఈజీఏలో అమలవు తున్నట్లుగా నైపుణ్యం లేని కార్మికుల వేతనాలను పూర్తిగా కేంద్ర ప్రభుత్వం భరించడం, మెటీరియల్ వ్యయంలో 75 శాతం కేంద్రం వాటా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే గ్రామీణ అవసరాలకు అనుగుణంగా రాష్ట్రాలకు ప్రత్యేక పనులను చేర్చుకునే స్వేచ్ఛ కల్పించాలని మంత్రి కోరారు. వ్యవసాయ అనుబంధ పనులు, రాష్ట్ర గృహ నిర్మాణ పథకాల వంటి పనులను అనుమతించాల్సిన అవసరం ఉందని తెలిపారు. గ్రామీణ ఉపాధి కల్పన, గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి, పేద కుటుంబాల జీవనోపాధి భద్రత లక్ష్యాలు దెబ్బతినకుండా కొత్త పథకంలో అవసరమైన మార్పులు, సడలింపులు కల్పించాలని మంత్రి సీతక్క కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సీతక్క ప్రతిపాదనలకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ మంత్రి సీతక్క చాలా యాక్టివ్ మినిస్టర్ అని ప్రశంసించారు. తెలంగాణ ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలపై మంత్రి సీతక్కతో ప్రత్యేకంగా సమావేశమై చర్చిస్తామని హామీ ఇచ్చారు.

# మొహర్రం ఊరేగింపునకు విస్తృత ఏర్పాట్లు

▫ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, జూన్ 09 (జనంసాక్షి) :** ఈనెల 16న జరగనున్న మొహర్రం ఉరేగింపు కార్యక్రమాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మొహర్రం పవిత్ర మాసం ఏర్పాట్లపై మంగళవారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహమ్మద్ అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ తో కలిసి వివిధ శాఖల అధికారులు, ముస్లిం మత పెద్దలతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మొహర్రం కార్యక్రమాలు నిర్వహించే ఆశుర్ ఖానాల వద్ద పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆశుర్ ఖానాల పరిసర ప్రాంతాలలో పెండింగ్ లో ఉన్న డ్రైనేజ్, రోడ్లు మరమ్మత్తు పనులను వెంటనే పూర్తి చేయాలని, అన్ని చోట్ల హైమాస్ట్ లైట్లను ఏర్పాట్లు చేయాలని మంత్రి ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు ప్రత్యేక విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలని, వాటర్ బోర్డ్ అధికారులు తాగు నీటి సరఫరా చేయాలని, జీహెచ్ఎంసీ అధికారులు పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించాలని అన్నారు. మొబైల్ టాయిలెట్స్ తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆర్ అండ్ బి అధికారులు బారికేడింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశిం చారు. మొహర్రం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని పోలీస్ ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రధాన ఊరేగింపు ప్రారంభం కానున్న బీబీ-కా-ఆలం పరిసరాల ప్రాంతంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఆశుర్ ఖానాలకు వచ్చే వారికి ఇబ్బందులు కలగకుండా అన్ని మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ అలీ సూచించారు. వైద్య శిబిరాలు, అంబులెన్స్ లను కూడా అందుబాటులో ఉంచాలని అన్నారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, మైనారిటీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్ సొసైటీ వైస్ ఛైర్మన్ ఫహీం కురేషీ, చార్మినార్, బహదూర్‌పురా, యాకత్ పురా, నాంపల్లి, కార్వాన్, మల్కాజిగిరి ఎమ్మెల్యేలు, మీర్ జుల్ఫెకర్ అలీ, మహమ్మద్ ముబీన్, జాఫర్ హుస్సేన్, మాజిద్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీలు మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండి, మీర్జా రహ్మత్ బేగ్, వక్ఫ్ బోర్డు ఛైర్మన్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబైదుల్లా కొత్వాల్, హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ ఎండీ అశోక్ రెడ్డి, మైనారిటీ సంక్షేమ శాఖ కార్యదర్శి షఫీఉల్లా, వక్ఫ్ బోర్డు జజూా తదితరులు పాల్గొన్నారు.

## పచ్చిరొట్ట పంటల సాగుతో భూమి సారవంతం

▫ వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి సూచన

**హైదరాబాద్, జూన్ 9 (జనంసాక్షి) :** వ్యవసాయ భూముల్లో సేంద్రియ కర్బన పదార్థం తగ్గిపోవడం, నేల గట్టిపడటం, నీటి నిల్వ సామర్థ్యం క్షీణించడం, రసాయన ఎరువుల వినియోగం పెరగడం వంటి సమస్యలను అధిగమించేందుకు రైతులు పచ్చిరొట్ట పంటల సాగును విస్తృతంగా చేపట్టాలని వ్యవసాయ శాఖ సంచాలకులు గోపి సూచించారు. జనుము, జీలుగు, పిల్లిపెసర వంటి పచ్చిరొట్ట పంటలను ప్రధాన పంటలకు ముందు లేదా రెండు పంటల మధ్యకాలంలో సాగు చేసి, పూత దశలో భూమిలో కలియదున్నడం ద్వారా నేలలో సేంద్రియ కర్బన పదార్థం పెరిగి భూమి సారవంతమవుతుందని తెలిపారు. ఈ పంటలను భూమిలో కలపడం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు ఉపయోగకరమైన సూక్ష్మజీవుల సంఖ్య పెరుగుతుందని పేర్కొన్నారు. పచ్చిరొట్ట పంటల వేర్ల వద్ద అభివృద్ధి చెందే సూక్ష్మజీవులు గాలిలోని నత్రజనిని భూమిలో స్థిరపరచి మొక్కలకు సహజ పోషకాలను అందిస్తాయని తెలిపారు. దీంతో రసాయన ఎరువుల అవసరం తగ్గి సాగు ఖర్చులు గణనీయంగా తగ్గే అవకాశం ఉంటుందని వివరించారు.

## లోకేశ్ అంటే జగన్‌కు భయం

**కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

**శ్రీకాకుళం, జూన్9 (జనంసాక్షి) :** వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై కేంద్రమంత్రి కింజరపు రామ్మోహన్ నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అండ్ కోకి లోకేశ్ అంటే భయమని, అందుకే ఆయనను టార్గెట్‌గా చేసుకుని ఫేక్ ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. వైసీపీ ఫేక్ ప్రచారాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని సూచించారు. మంగళవారం శ్రీకాకుళం జిల్లాల్లో రామ్మోహన్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. డీఎస్సీ విషయంలో వైసీపీ విషప్రచారాన్ని తమ ప్రభుత్వం తిప్పి కొట్టిందని రామ్మోహన్ తెలిపారు. వైసీపీ తాను తీసిన గోతిలో తానే పడిందని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు ఆనందంగా ఉన్నారని చెప్పుకొచ్చారు.

# ముగ్గురిని కాపాడి అమరుడైన అనురూప్ రెడ్డి

▫ అమెరికాలో ప్రాణత్యాగం చేసిన యువకుడికి ఘన నివాళులు
▫ కుటుంబానికి భరోసా ఇచ్చిన ఎంపీ చామల, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి, మందుల సామెల్



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 9(జనం సాక్షి):** మానవత్వానికి ప్రతిరూపంగా నిలిచి ముగ్గురు స్నేహితుల ప్రాణాలను కాపాడి, తన ప్రాణాలను అర్పించిన యువకుడు అనురూప్ రెడ్డి త్యాగం అందరినీ కంటతడి పెట్టిస్తోంది. అమెరికాలో జరిగిన ఈ విషాద ఘటన తెలంగాణ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేయగా, స్వగ్రామానికి చేరుకున్న అనురూప్ మృతదేహానికి ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, కుటుంబ సభ్యులు ఘన నివాళులు అర్పించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లి గ్రామానికి చెందిన కోడూరు రాజేందర్‌రెడ్డి, దుర్గాభవాని దంపతుల చిన్న కుమారుడు అనురూప్ రెడ్డి ఉన్నత విద్య కోసం రెండేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. అక్కడ యూనివర్సిటీ ఆఫ్ నార్త్ టెక్సాస్‌లో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ పూర్తి చేసి, ఉద్యోగ జీవితంలోకి అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యాడు. మరో వారం రోజుల్లో ఉద్యోగంలో చేరాల్సి ఉండగా విధి వక్రించింది. గత నెల 30వ తేదీన తన స్నేహితులతో కలిసి లూసియానా రాష్ట్రంలోని టోరోడో పార్క్ సమీపంలోని సెబాన్ నది వద్దకు వెళ్లిన అనురూప్, అక్కడ జరిగిన ప్రమాదంలో అసాధారణ ధైర్యసాహసాలు ప్రదర్శించాడు. నదిలో ఈత కొడుతున్న ముగ్గురు స్నేహితులు లోతైన నీటిలో చిక్కుకుని మునిగిపోతుండగా, తన ప్రాణాలను లెక్కచేయకుండా వారిని ఒక్కొక్కరిని ఒడ్డుకు చేర్చాడు. అయితే చివరగా తాను ఒడ్డుకు చేరుకునే క్రమంలో నదిలో ఏర్పాటు చేసిన ఓ వల అతని కాళ్లకు చుట్టుకోవడంతో బయటపడలేకపోయాడు. ఎంత ప్రయత్నించినా వల నుంచి బయటకు రాలేక నీటిలోనే మునిగి ప్రాణాలు కోల్పోయాడు. అతని త్యాగం వల్ల ముగ్గురు ప్రాణాలతో బయటపడగా, అనురూప్ మాత్రం అమరుడయ్యాడు. ప్రమాదం జరిగిన తర్వాత దాదాపు పది రోజుల పాటు కొనసాగిన గాలింపు చర్యల అనంతరం అనురూప్ మృతదేహాన్ని గుర్తించి, అమెరికా నుంచి స్వగ్రామంకావడిపల్లికి తరలించారు. మృతదేహం గ్రామానికి చేరుకోవడంతో గ్రామమంతా శోకసంద్రంగా మారింది. బంధువులు, స్నేహితులు, గ్రామస్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి కన్నీటి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భువనగిరి పార్లమెంట్ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ అనురూప్ మృతదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# ఓజీ గంజాయి స్మగ్లింగ్ ముఠా బట్టబయలు

▫ జూనియర్ ఆర్టిస్ట్ దొడ్డి సూరి కళ అరెస్ట్




**హైదరాబాద్, జూన్9 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లో అంతర్జాతీయ మాదకద్రవ్యాల అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను ఈగల్ ఫోర్స్ తెలంగాణ, కస్టమ్స్ విభాగం, నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) సంయుక్తంగా ఛేదించాయి. బ్యాంకాక్-ఇండియా మార్గంలో సాగుతున్న ఓజి గంజాయి స్మగ్లింగ్ ముఠాను బట్టబయలు చేసి కీలక నిందితులను గుర్తించారు. ఈ కేసులో హైదరాబాద్‌కు చెందిన జూనియర్ ఆర్టిస్ట్ దొడ్డి సూరి కళను శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులు అరెస్ట్ చేశారు. ఆమె వద్ద నుంచి 2.15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న సమయంలో కస్టమ్స్ అధికారులు తనిఖీలు నిర్వహించగా ఈ డ్రగ్స్ బయటపడ్డాయి. కేరళకు చెందిన చల్లిల్ పుత్తన్‌పురయిల్ నఫ్షీద్ అలియాస్ అలెక్స్ ఈ ముఠాకు ప్రధాన సూత్రధారిగా ఉన్నట్లు పోలీసులు దర్యాప్తులో గుర్తించారు. మహిళా జూనియర్ ఆర్టిస్టులను లక్ష్యంగా చేసుకుని ఒక్కో ట్రిప్‌నకు రూ.20 వేల వరకు పారితోషికం ఇస్తామని ఆశ చూపించి వారిని డ్రగ్స్ రవాణాకు వినియోగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల విచారణలో మరికొన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 2026 మార్చిలో సూరి కళ మొదటిసారి బ్యాంకాక్‌కు వెళ్లి అక్కడి నుంచి గంజాయిని తీసుకువచ్చి చెన్నైలో ముఠా సభ్యులకు అప్పగించినట్లు తేలింది. అనంతరం ఏప్రిల్ 2026లో మరోసారి బ్యాంకాక్ వెళ్లి మాదకద్రవ్యాలను భారత్‌కు తీసుకువచ్చి హైదరాబాద్‌లో అందజేసినట్లు గుర్తించారు. జూన్ 2026లో మూడోసారి అదే తరహా ప్రయత్నం చేస్తుండగా శంషాబాద్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు.. జూనియర్ ఆర్టిస్ట్ దొడ్డి సూరి కళను పట్టుకున్నారు. దీంతో అంతర్జాతీయ స్మగ్లింగ్ నెట్‌వర్క్ కార్యకలాపాలు వెలుగులోకి వచ్చాయి. ఈ ముఠాలో రాజు బిస్వాస్ అనే వ్యక్తి కూడా కీలక పాత్ర పోషించినట్లు దర్యాప్తులో తేలింది. అలాగే గంగా భవాని, గౌరి అనే మరో ఇద్దరు మహిళలను కూడా బ్యాంకాక్‌కు పంపించి గంజాయి రవాణా చేయించినట్లు అధికారులు గుర్తించారు. మహిళా ఆర్టిస్టులను ఎరగా వేసుకుని అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ నిర్వహిస్తున్న ఈ ముఠాపై అధికారులు మరింత సమగ్ర దర్యాప్తు చేస్తున్నారు. ఈ నెట్‌వర్క్‌కు సంబంధించిన మరికొంతమంది సభ్యులు, ఆర్థిక లావాదేవీలు, విదేశీ సంబంధాలపై విచారణ కొనసాగుతోంది. 2.15 కిలోల గంజాయి స్వాధీనం కావడంతో పాటు అంతర్జాతీయ డ్రగ్స్ రాకెట్‌కు సంబంధించిన కీలక ఆధారాలు కూడా లభించినట్లు అధికారులు తెలిపారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370